తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

సోమవారం 19.01.2026 | సంపుటి :12 సంచిక : 180 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698





# పురపోరుకు పచ్చజెండా



- మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం
- మేడారంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశ వివరాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి

మేడారం(జనంసాక్షి): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ములుగు జిల్లా మేడారంలోని హరిత హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఈ సమావేశం వివరాలను మంత్రి సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి.. పొంగులేటి మీడియాకు వివరించారు."చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా మేడారంలో 27వ క్యాబినెట్ భేటీ నిర్వహించాం. మంత్రి సీతక్క చొరవతో సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రుల ఏకాభిప్రాయంతో అద్భుతంగా సమావేశం జరిగింది. అనేక అంశాలను చర్చించాం. ప్రభుత్వానికి సంబంధించిన 14 ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థలు కావొచ్చు.. రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలు కావొచ్చు..

మిగతా 2లో..

## హార్వర్డ్ విద్యార్థిగా రేవంత్ రెడ్డి

ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో లీడర్‌షిప్‌పై కోర్స్ చేయనున్న ముఖ్యమంత్రి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కొత్త రికార్డ్ సృష్టించబోతున్నారు. దేశంలో ప్రస్తుతం పదవిలో ఉన్న ముఖ్యమంత్రులందరిలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఒక కోర్స్ సర్టిఫికెట్ అందుకోబోతున్న మొదటి ముఖ్యమంత్రిగా ఒక అరుదైన ఘనత

మిగతా 2లో..

# సింగరేణి టెండర్లపై ఓ మీడియా తప్పుడు ప్రచారం

- మీడియా బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించొద్దు
- మంత్రులపై వివరణ కావాలంటే నన్నడగండి

మీడియా సంస్థల మధ్య పోటీలో మంత్రులు, అధికారులను బలిపశువును చెయ్యొద్దు

సింగరేణిలో బొగ్గు స్కామ్ అని వార్తలు రాస్తున్నారు. సింగరేణి టెండర్ విషయంలో అణాపైసా కూడా అవినీతికి ఆస్కారం లేదు. నా మంత్రులపై వార్తలు రాసేముందు నా వివరణ తీసుకోండి. ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ప్రత్యేక్షంగా, పరోక్షంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. స్కామ్ జరిగిందని బొగ్గు మాయమైందని వార్తలు రాస్తున్నారు. మా రెండేళ్ల పాలనలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఇవ్వలేదు. తప్పుడు ప్రచారం ద్వారా బీఆర్ఎస్ నేతలు బలపడేలా చేయొద్దు"

\- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల తదితరులు

- రెండేళ్ల పాలనలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఇవ్వలేదని స్పష్టీకరణ
- భద్రాచలానికి రూ.100 కోట్లు ఇస్తానని చెప్పి కేసీఆర్ ఏమీ ఇవ్వలేదు
- పేదవారికి ఇల్లు ఇచ్చే బాధ్యత మాదే
- విద్య,వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం
- ఖమ్మం పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- మున్నేరు – పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

ఖమ్మంరూరల్(జనంసాక్షి):సింగరేణిలో బొగ్గు స్కామ్ అని విలేకరులు వార్తలు రాస్తున్నారని, క్యాబినెట్ మంత్రులపై వార్తలు రాసేముందు ఒకసారి తన వివరణ కూడా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వంపై కొంతమంది అసత్య ప్రచారం చేస్తూ, టెండర్ల గురించి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రత్యేక్షంగా, పరోక్షంగా కుంభకోణం జరిగిందని కొన్ని వార్తా పత్రికలు రాయడం పట్ల ఆక్షేపించారు. సింగరేణి బొగ్గు మాయమైందని అంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజా ప్రభుత్వంలో అవకతవకలకు

మిగతా 2లో..

## మహాపూజతో మొదలైన నాగోబా జాతర



2లో..

## కమ్యూనిస్టు కామ్రేడ్లు, కాంగ్రెస్ కలిసికోట్లాడితేనే స్వాతంత్య్రం వచ్చింది

- బ్రిటీషర్ల కంటే ప్రమాదమైనది భాజపా సర్కారు
- సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల్లో సీఎం రేవంత్
- సీపీఐ ప్రస్థానం ఎన్నో త్యాగాలతో మొదలైంది
- భారత్ అభివృద్ధి కోసం మోదీ చేసిందేమీ లేదు
- పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ఖమ్మం(జనంసాక్షి): కమ్యూనిస్టు మిత్రులను స్ఫూర్తిగా తీసుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడి.. పాశవికంగా వ్యవహరించిన ప్రభుత్వాలను పడగొట్టామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న పాశవిక శక్తులను ఓడించడానికి ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరముందన్నారు. సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల

మిగతా 2లో..

## బెంగాల్‌లో అవినీతి, బంధుప్రీతి రాజ్యమేలుతున్నాయి

'మహా జంగిల్ రాజ్'కు ముగింపు పలుకుతాం

డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే మహిళలకు భద్రత: ప్రధాని మోదీ



కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విమర్శలు చేశారు. మమత పాలనలో బెంగాల్‌లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నా యన్నారు. తమ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను బెంగాల్ ప్రజలకు అందకుండా మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ప్రధాని ఆరోపించారు. వీరితో విసిగిపోయిన ప్రజలు భాజపా వైపు చూస్తున్నారన్నారు. బిహార్‌లో జంగిల్ రాజ్‌కు తగిన బుద్ధి చెప్పినట్లే.. 2026 ఎన్నికల్లో 'మహా జంగిల్ రాజ్'కు ముగింపు పలుకుతామన్నారు. సింగూర్‌లో నిర్వహించిన సభలో ప్రధాని మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం చొరబాటుదారులకు మద్దతిస్తూ.. దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టేస్తోందన్నారు. బెంగాల్ సరిహద్దులను కాపాడుకోవాలంటే సొంత ప్రయోజనాల కోసం కాకుండా దేశాభివృద్ధి కోసం పని చేసే ప్రభుత్వం కావాలన్నారు. బెంగాల్‌లో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమికొడతామని హామీ ఇచ్చారు.బెంగాల్‌లోని బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల్లో మహిళలపై లైంగిక వేధింపుల ఘటనలు తరచుగా వెలుగులోకి వస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు భద్రత అవసరమని పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్

మిగతా 2లో..

## న్యాయవాదులు ఆర్‌టీఐ కింద క్లయింట్ల సమాచారాన్ని కోరలేరు

సీఐసీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):క్లయింట్ల తరపున వాదిస్తున్న కేసులకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు న్యాయవాదులు సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించలేరని కేంద్ర సమాచార కమిషన్ స్పష్టం చేసింది. ఈ విధంగా స.హ. చట్టాన్ని ఉపయోగించడం వల్ల దాని ముఖ్య ఉద్దేశాలు దెబ్బతింటాయని పేర్కొంది. హరియాణాలోని ఓ జవహర్ నవోదయ విద్యాలయంలో పండ్లు, కూరగాయల సరఫరా కాంట్రాక్టు రద్దుకు సంబంధించిన వివాదంలో ఓ న్యాయవాది దాఖలు చేసిన రెండో అప్పీల్‌ను సీఐసీ కొట్టివేసింది. కూరగాయలు, పండ్లు సరఫరా చేసే తన సోదరుడి

మిగతా 2లో..




## బీజాపూర్ కొనసాగుతున్న ఎదురుకాల్పులు

ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి

భద్రాచలం(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య ఎలియాస్ పాపారావు.. నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెజ్జా ఉన్నారని నిఘావర్గాలకు సమాచారం అందడంతో బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెజ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. ఓ మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 2లో..



## కట్టు కథలకు భయపడి లొంగిపోను

తెలంగాణ వనరులు ప్రజలకు అందించటం కోసమే రాజకీయాల్లోకి

- నా జీవితం పారదర్శకంగా ఉంటుంది
- అధికారం హోదా అనుభవించడానికి రాజకీయాల్లోకి రాలేదు
- దోపిడీదారులు క్రిమినల్స్ నుంచి రాష్ట్రాన్ని,ప్రజలను రక్షిస్తాను
- ప్రజాభవన్ మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్(జనంసాక్షి):వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించడము కోసమో, అధికారం హోదాను అనుభవించడం కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం హైదరాబాదులోని ప్రజా భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక లక్ష్యం కోసం రాజకీయాల్లోకి వచ్చానని, దారి దోపిడీదారులు, బందిపోట్ల నుంచి తెలంగాణ ఆస్తులను వనరులను రక్షించి, వాటిని ప్రజలకు అందజేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సింగరేణి బొగ్గు సంస్థలకు టెండర్లపై ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ కొత్త పలుకులో తనకు తోసింది రాశాడని విమర్శించారు. ఓ కట్టు కథనాన్ని ఎవరి ప్రయోజనం కోసమో వండి వార్చా దన్నారు . టెండర్ల నిబంధనలు సింగరేణి బోర్డ్ ఖరారు చేస్తుంది మంత్రికి సంబంధం ఉండదని తెలిపారు. ఆరోపణలు వచ్చిన వెంటనే టెండర్లు రద్దు చేయాలని సూచించినట్టు తెలిపారు.తాను సింగరేణి బోర్డు సభ్యులకు చెప్పి వెంటనే సదరు బోర్డు మాత్రం టెండర్లు పిలిచిన ఇంకా ఎవరూ రాలేదని చెప్పారని అన్నారు. అయినప్పటికీ తాను టెండర్లు రద్దు చేసి ఫ్రెష్‌గా పిలవమని సూచించినట్టు తెలిపారు. తాను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తో సన్నిహితంగా ఉండటంతో రాధాకృష్ణకు నచ్చక వైయస్ పై ఉన్న కోపంతో నాపై ఈ వార్త రాసినట్టుగా కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ వార్త వల్ల అధికారులకు, మంత్రులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే ప్రయత్నం చేస్తే చూస్తూ

మిగతా 2లో..

# 8 ఐరోపా దేశాలపై 10% అదనపు సుంకం

గ్రీన్‌లాండ్ వివాదంలో మాట వినని దేశాలపై ట్రంప్ నిర్ణయం



నూక్(జనంసాక్షి): గ్రీన్‌లాండ్ విషయంలో తమ విధానాన్ని వ్యతిరేకిస్తున్న 8 ఐరోపా దేశాలపై 10 శాతం అదనపు సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సరకులపై 10 శాతం అదనపు సుంకం ఫిబ్రవరి నుంచి అమల్లోకి వస్తుందని శనివారం ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ దేశాలకు ఈ సుంకం వర్తిస్తుందని తెలిపారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా సంపూర్ణంగా కొనుగోలు చేయడంపై జూన్ 1కల్లా అంగీకారం కుదరకపోతే సుంకాన్ని 25శాతానికి పెంచుతానని ట్రంప్ హెచ్చరించారు. గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ వాదనతో అమెరికన్ కాంగ్రెస్ ద్వైపాక్షిక ప్రతినిధి బృందం విభేదించింది. ట్రంప్ మాటలెలా ఉన్నా తాము డెన్మార్క్‌కు, దాని భూభాగమైన గ్రీన్‌లాండ్‌కు మద్దతు తెలుపుతున్నామని శనివారం స్పష్టం చేసింది.

### ఇది తప్పుడు చర్య

ట్రంప్ సుంకాలపై ఈయూ ఖండన

వాషింగ్టన్(జనంసాక్షి):గ్రీన్‌లాండ్ విషయంలో తమ విధానాన్ని వ్యతిరేకిస్తున్న 8 ఐరోపా దేశాలపై 10 శాతం అదనపు సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే.

మిగతా 2లో..

## ఖమేనీ గద్దె దిగాల్సిందే..

ఆ సమయం వచ్చేసింది :ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఇరాన్ ప్రజలపై దాడులు జరుగుతున్నాయన్నారు. అక్కడ కొనసాగుతోన్న హింసకు ఖమేనీనే కారణమని ఆరోపించారు. నాయకుడి స్థానంలో ఉన్న ఖమేనీ వేలాది మంది ప్రజలను చంపుతూ.. తన దేశాన్ని తనే నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు ఆయనకు నాయకత్వం కట్టబెట్టింది ఇటువంటి భయాలు, మరణాలు సృష్టించడానికి కాదని అన్నారు. ఇంతమంది ప్రాణాలు తీసిన సుప్రీం లీడర్ ఇరాన్‌ను పాలించడానికి అనర్హుడని పేర్కొన్నారు. ఇక ఆయన అధికారం నుంచి దిగిపోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవాలని ఆ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.ఇరాన్‌లో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఖమేనీ ఆరోపించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. శనివారం

మిగతా 2లో..



### అమెరికా దురాక్రమణ చర్యలను ధీటుగా ఎదుర్కొంటాం

- అందుకు కఠినమైన ప్రతిస్పందన ఉంటుంది
- ట్రంప్‌కు ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులకు సన్నాహాలు చేస్తుందన్న ఆరోపణలను టెహ్రాన్ తోసిపుచ్చింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచడానికి వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని విమర్శించింది. ఈ మేరకు

మిగతా 9లో..

## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

వాణిజ్య సలహాదారు పీటర్ నవారో



న్యూయార్క్(జనంసాక్షి):భారత్ వంటి ఇతర దేశాల్లో కృత్రిమ మేధ సేవల కోసం అమెరికన్ వనరులను ఉపయోగించడాన్ని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో విమర్శించారు. చాట్‌జీపీటీ వంటి ప్లాట్‌ఫామ్‌లు అమెరికా భూభాగంపై ఇక్కడి విద్యుత్తును ఉపయోగించి పనిచేస్తున్నాయని.. కానీ, భారత్ వంటి దేశాల్లో పెద్ద సంఖ్యలో వినియోగదారులకు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. ఓ అమెరికన్ ఛానల్‌లో వైట్ హౌస్ మాజీ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో నవారో ఈమేరకు వ్యాఖ్యలు చేశారు."భారత్‌లో ఏఐ సేవల కోసం అమెరికన్లు ఎందుకు డబ్బులు చెల్లిస్తున్నారు? చాట్‌జీపీటీ అమెరికా గడ్డపై పనిచేస్తోంది. ఇక్కడి విద్యుత్తును ఉపయోగిస్తోంది. కానీ, భారత్, చైనా ఇలా ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో పెద్దఎత్తున వినియోగదారులకు సేవలు అందిస్తోంది" అని నవారో వ్యాఖ్యానించారు. అదే విధంగా అమెరికాలో వ్యవసాయ భూముల

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
19.01.2026




## కమ్యూనిస్టు కామ్రేడ్లు, కాంగ్రెస్ కలిసికొట్లాడితేనే స్వాతంత్య్రం వచ్చింది

మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, సీపీఐ అగ్రనేతలు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సీపీఐ శ్రేణులతో ఖమ్మం నగరం ఎరుపెక్కింది.ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "కాంగ్రెస్, కమ్యూనిస్టు సోదరులు కొట్లాడితేనే దేశానికి స్వాతంత్య్రం వచ్చింది. దున్నేవాడిదే భూమి అని కమ్యూనిస్టు పార్టీ నినాదం ఇస్తే.. దానికి చట్టరూపం కల్పించింది కాంగ్రెస్ సర్కారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. రజాకార్లకు, నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారు. ఆనాడు జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో 4 వేల మంది వీరులు అమరులయ్యారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఎర్రజెండా తలెత్తి నిలబడుతుంది. కమ్యూనిస్టుల కంచుకోట ఖమ్మంలో ఈ సభ జరగడం హర్షణీయం.బ్రిటీషర్ల కంటే ఎక్కువ ప్రమాదం భాజపాతోనే. భాజపా అంటే బ్రిటీష్ జనతా పార్టీ. విభజించు, పాలించు, పేదవాళ్లను అణగదొక్కాలని బ్రిటీషర్ల నుంచి వచ్చిన ఆలోచనతోనే... ఇవాళ మనల్ని అణచివేయాలని చూస్తోంది. ఆనాడు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ కలిసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొస్తే.. ఇవాళ ఆ పథకాన్ని రద్దు చేశారు. నరేంద్ర మోదీ కార్పొరేట్ కంపెనీల చేతిలో కీలుబొమ్మగా మారి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి.. మల్టీ నేషనల్ కంపెనీలకు మన హక్కులను తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం రద్దుతో మళ్లీ వలసలు మొదలవుతాయి. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చడానికి, పేదల హక్కులు కొల్లగొట్టడానికి భాజపా 400 సీట్లు అడిగింది. కానీ, రాహుల్ గాంధీ, కమ్యూనిస్టులు ప్రజల దగ్గరకు వెళ్లి చెప్పడంతో.. 240 సీట్ల వద్దే ఆ పార్టీ ఆగింది. రాజ్యాంగాన్ని దెబ్బ తీసేందుకు మళ్లీ ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. ఎస్ఐఆర్ ద్వారా పేదల ఓటు హక్కును కేంద్రం రద్దు చేస్తోంది" అని సీఎం ఆరోపించారు.

భారత్ అభివృద్ధి కోసం మోదీ చేసిందేమీ లేదు: డి.రాజా

సీపీఐ ప్రస్థానం ఎన్నో త్యాగాలతో మొదలైందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, సీపీఐ అగ్రనేతలు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సీపీఐ శ్రేణులతో ఖమ్మం నగరం ఎరుపెక్కింది.డి.రాజా మాట్లాడుతూ.. "1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించింది. ఇండియాకు సంపూర్ణ స్వరాజ్యం కావాలని ఆరంభంలోనే సీపీఐ చెప్పింది. 1885లోనే కాంగ్రెస్ పార్టీ ఏర్పడింది. ఆ పార్టీ ఏర్పడి 140 ఏళ్లు గడిచాయి. స్వాతంత్య్ర పోరాటంలో కాంగ్రెస్, సీపీఐ కీలకపాత్ర పోషించాయి. స్వాతంత్య్ర సాధన కోసం సీపీఐ శ్రేణులు పోరాటం చేశాయి. ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమీ లేదు. అప్పటి బ్రిటీష్ పాలకులతో ఆర్‌ఎస్‌ఎస్ చేతులు కలిపింది.పాలస్తీనాలో మారణహోమం జరుగుతోంది. వేల మంది అమాయకులను ఊచకోత కోస్తున్నారు. ఇజ్రాయెల్, అమెరికా కలిసి పాలస్తీనాలో దారుణాలు చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హిట్లర్‌లా మారారు. నియంతలా మారి.. అన్ని దేశాలను బెదిరిస్తున్నారు. ప్రధాని మోదీ అమెరికా ముందు తలవంచారు. భారత్ అభివృద్ధి కోసం మోదీ చేసిందేమీ లేదు" అని డి.రాజా అన్నారు.


## ఇది తప్పుడు చర్య

దీన్ని ఐరోపా దేశాలు తీవ్రంగా ఖండించాయి. తప్పుడు చర్యగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ స్పందిస్తూ.. ట్రంప్ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. మరోవైపు.. అమెరికా తీరుకు వ్యతిరేకంగా గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌లలో వేలాది మంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. "నాటో సభ్యదేశాలుగా గ్రీన్‌లాండ్ భద్రత కోసం చర్యలు తీసుకుంటే.. సుంకాలు విధిస్తామని హెచ్చరించడం పూర్తిగా తప్పు. ఈ విషయాన్ని నేరుగా అమెరికా యంత్రాంగంతో తేల్చుకుంటాం" అని కీర్ స్టార్మర్ అన్నారు. "సుంకాల బెదిరింపులు ఆమోదయోగ్యం కాదు. ఎటువంటి బెదిరింపులకు లొంగేది లేదు" అని మెక్రాన్ వ్యాఖ్యానించారు. "చైనా, రష్యా పండగ చేసుకుంటున్నాయి. మిత్రదేశాల మధ్య విభేదాల వల్ల ప్రయోజనం పొందేది ఆ దేశాలే"నని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ పేర్కొన్నారు. తమను బ్లాక్‌మెయిల్ చేయలేరంటూ స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాన్ని కాపాడుకునే విషయంలో ఈయూ ఎల్లప్పుడూ దృఢంగా ఉంటుందని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అన్నారు. ట్రంప్ ప్రకటన ఆశ్చర్యకరమని డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లోకే రాస్‌ముస్సేన్ తెలిపారు. తమ దేశ భద్రత విషయంలో గ్రీన్‌లాండ్ ఎంతో ముఖ్యమని, దాన్ని స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. ఈ ప్రాంతం డెన్మార్క్ నియంత్రణలో ఉంది. ఈ నేపథ్యంలో ఐరోపా దేశాలు డెన్మార్క్‌కు మద్దతుగా నిలిచాయి. గ్రీన్‌లాండ్ భద్రత 'నాటో' ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, నెదర్లాండ్స్, బ్రిటన్‌లు అక్కడికి బలగాలను తరలించాయి. ఈ పరిణామాల నడుమే డెన్మార్క్‌తోపాటు ఈ ఏడు దేశాలపై ట్రంప్ 10 శాతం అదనపు సుంకం ప్రకటించారు.

## భాజాపాది అవకాశవాద రాజకీయం

**ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడం, అధికారంలోకి వచ్చాక పక్కనపెట్టేయడం ఆ పార్టీకి అలవాటుగా మారింది: కపిల్ సిబల్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భాజపాపై రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ అధికారం/ మెజార్టీ లేని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడం, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలను పక్కనపెట్టేయడం అనే వ్యూహాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ వ్యూహం బిహార్‌లో విజయవంతమైందని, ప్రస్తుతం మహారాష్ట్రలో అమలు



చేస్తోందని ఆరోపించారు. తాజా మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించిన పరిణామంపై సిబల్ ఈ విధంగా మాట్లాడారు. కాంగ్రెస్‌తో నేరుగా పోటీ పడే ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో భాజపా రాజీపడకుండా చూసుకుంటోందని కపిల్ సిబల్ పేర్కొన్నారు. తమిళనాడులో ప్రాబల్యాన్ని విస్తరించుకోవడానికి ప్రయత్నిస్తున్న కాషాయ పార్టీ ఇప్పటికే అనేకసార్లు విఫలమైందన్నారు. అందుకే ఇప్పుడు దేవాలయాల రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేరళ, పశ్చిమ బెంగాల్‌లో ఆ పార్టీ తీవ్ర ప్రతిఘటన ఎదుర్కుంటోందని అన్నారు.నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో చీలికను ప్రస్తావించిన సిబల్ అవకాశవాద రాజకీయాలపై హెచ్చరికలు చేశారు. అజిత్ పవార్‌ను ఉద్దేశిస్తూ.. వారితో (భాజపాతో) రాజీపడటం వల్ల డిప్యూటీ సీఎం కావొచ్చేమో కానీ భవిష్యత్తు ముగిసిపోయినట్లేనన్నారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన 29 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో మొత్తం 2,869 స్థానాలు ఉండగా 1,425 సీట్లలో విజయం సాధించిన భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించింది. ముంబయి, పుణెలలో ఠాక్రే, పవార్ కోటలను బద్దలుకొట్టింది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లో 227 స్థానాలకుగాను 89 చోట్ల భాజపా గెలుపొందిన విషయం తెలిసిందే.

# సింగరేణి టెండర్లపై ఓ మీడియా తప్పుడు ప్రచారం



ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు. అనవసర ప్రచారం చేస్తూ మారీచుడు, శుక్రాచార్యుడు బలపడడానికి అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాలోని ఏదులాపూర్ మున్సిపాలిటీలో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఏదులాపురం మున్సిపాలిటీలో రూ.362 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.సింగరేణి కోల్ మైనింగ్ టెండర్‌ను అనుభవం ఉన్న కంపెనీకే కేటాయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి టెండర్ విషయంలో అణాపైసా అవినీతికి కూడా ఆస్కారం లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వాన్ని ఎలాగైనా బద్నాం చేయాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియా ద్వారా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భద్రాచలానికి రూ.100 కోట్లు ఇస్తానని చెప్పి మాజీ సీఎం కేసీఆర్ ఏమీ ఇవ్వలేదు సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వంలో భద్రాచలంలో భూసేకరణ జరుగుతోందని తెలిపారు. భద్రాచలాన్ని అయోధ్యను తలపించేలా అద్భుతంగా పునఃర్మిస్తామన్నారు. త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి బీఆర్ఎస్‌ను బొందపెట్టాలని విమర్శించారు. 2023 నుంచి 2034 వరకు అధికారం కాంగ్రెస్‌దేనని జోస్యం చెప్పారు. పదేళ్లు ఇందిరమ్మ రాజ్యం, పేదల ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో బీజేపీ ఆనవాళ్లు లేవని, బీజేపీని ఖమ్మంలోకి రాలేదని, ఆ జిల్లా ప్రజలు మొదటి నుంచి బీజేపీని నిషేధించారని సీఎం అన్నారు.

పేదవారికి ఇల్లు ఇచ్చే బాధ్యత మాదే : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎవరికైనా డబల్ బెడ్‌రూమ్ ఇల్లు వచ్చిందా? అని సీఎం ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక 4.50 లక్షల ఇందిరమ్మ ఇళు ఇచ్చినట్లు తెలిపారు. పేదలకు ఇల్లు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం చూసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పేదవాడిపై కుట్ర చేసి ఇళ్లు ఇవ్వకుండా అడ్డుకుందని నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వం వారి మోచేతి నీళ్లు తాగాలి అన్నట్లుగా వ్యవహరించిందని ఘటుగా వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణం మొదట ఖమ్మం జిల్లాలోనే మొదలు పెట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 2007-08లో ఖమ్మం జిల్లా మధిరలోని కొన్ని గ్రామాల్లో టీడీపీ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేవరకు ఖమ్మం జిల్లా ప్రజలు తనకు అండగా నిలబడ్డారని అన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డు రావాలంటే ఉన్నవాళ్లలో ఎవరో చనిపోవాలనే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు లక్షలాది రేషన్ కార్డులను పేదలకు అందించినట్లు తెలిపారు. ఇంకా రాష్ట్రంలో ఎవరికైనా రేషన్ కార్డు రాకపోతే జారీ చేస్తామన్నారు. సన్న బియ్యం అందించి పేదవాడి ఆకలి తీర్చాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఆయన ఆశయాలను సాధించడమే : ఇవాళ నందమూరి తారక రామారావు వర్ధంతి అని ఆయన ఆశయాలను సాధించడమే ఘన నివాళి అని చెప్పారు. మదరాసీలుగా ఉన్న తెలుగువారికి ఎన్టీఆర్ ప్రత్యేక గుర్తింపు తెచ్చారని, రూ.2 బియ్యంతో పేదోడికి తెల్లన్నం తినే అవకాశం కల్పించారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో తాము పేదోడికి సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. తెలంగాణలో ఎన్టీఆర్ అభిమానులు, చంద్రబాబు సహచరులు ఉన్నారని తెలిపారు.

కేసీఆర్ టీడీపీపై కక్షగట్టారు : తెలంగాణలో టీడీపీ ఉండొద్దని కేసీఆర్ కక్షకట్టి ఆ పార్టీ నాయకత్వాన్ని దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను 100 మీటర్ల గొయ్యితీసి పాతిపెట్టడమే ఎన్టీఆర్‌కు నివాళి అని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు గద్దెలు దిగాలి, ఊళ్లలో బీఆర్ఎస్ గద్దెలు కూలాలని విమర్శించారు. బీఆర్?ఎస్? పార్టీని భూస్థాపితం చేయడమే ఎన్టీఆర్‌కు మనం ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. రైతులకు 9 గంటల కరెంట్ ఇచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదే అని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు 200 యూనిట్ల ఉచిత విద్యుత్?ను పేద ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు లతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘన స్వాగతం పలికారు. పాలేరు నియోజకవర్గ పరిధి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో 108 కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నూతన భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. కూసుమంచిలో 5 ఎకరాల విస్తీర్ణంలో 45 కోట్లతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, 162 కోట్ల 54 లక్షలతో మున్నేరు పాలేరు లింక్ కేనాల్ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.అలాగే 25 కోట్ల రూపాయలతో 5 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాలను, మద్దులపల్లిలో 23 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 20 కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డును ప్రారంభించారు. అనంతరం నర్సింగ్ కళాశాలలో విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థినులకు నర్సింగ్ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు.సమాజంలో వైద్య రంగానికి అత్యంత విలువ ఉందని, ఆపద సమయంలో ప్రజలు నమ్మకంతో ఆసుపత్రులకు వస్తారని, విధుల నిర్వహణలో చిన్న నిర్లక్ష్యం చూపిన ప్రాణ నష్టం, ఒక కుటుంబం జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉంటుందని, కాబట్టి విధి నిర్వహణలో వ్యక్తిగతంగా ఉన్న ఇబ్బందులు, సమస్యలను పక్కన పెట్టాలని అన్నారు.విధుల నిర్వహణలో బాధ్యతతో నర్సులు పని చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా విదేశాలలో కూడా బీఎస్సి నర్సింగ్ చదివిన విద్యార్థులకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. గతంలో ఇంజనీరింగ్ చదివిన వారికి విదేశాలలో ఎక్కువ అవకాశాలు దక్కాయని, నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని వైద్య రంగంలో అనేక ఉపాధి అవకాశాలు విదేశాలలో ఉన్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా పర్యటనలో అక్కడ లక్షలాదిగా నర్సుల కొరత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. జపాన్ లో ఏజింగ్ సమస్య వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మన నర్సింగ్ విద్యార్థులకు అక్కడ సాఫ్ట్వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువ జీతభత్యాలతో ఉపాధి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. మన విద్యార్థులకు అక్కడి భాష, సంస్కృతి నేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## హార్వర్డ్ విద్యార్థిగా రేవంత్ రెడ్డి

సాధించబోతున్నారు. ప్రపంచంలోని నంబర్ వన్ విద్యాసంస్థలలో ఒకటైన హార్వర్డ్ యూనివర్సిటీలోని కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో "లీడర్‌షిప్: 21 సెంచరీ" అనే కోర్స్‌కు హాజరుకాబోతున్నారు. దీనితో, భారతదేశ చరిత్రలో ఒక ఐవీ లీగ్ కార్యక్రమానికి హాజరవుతున్న మొదటి ముఖ్యమంత్రి రేవంతే అవుతారు. ఈ కోర్స్ పేరు – "21వ శతాబ్దంకోసం నాయకత్వంఈ కోర్స్ కోసం ఆయన ఈ నెల 25 నుంచి 30 వరకు మసాచుసెట్స్‌లోని కెనడీ స్కూల్ క్యాంపస్‌లో ఉండి తరగతులకు హాజరవుతారు.ఐదు ఖండాలనుంచి 20 దేశాల ప్రతినిధులు ఈ కోర్సుకు హాజరు కాబోతున్నారు. వీరితో కలిసి రేవంత్ రెడ్డి తరగతులు, అసైన్‌మెంట్‌లు, హోమ్‌వర్క్‌లు పూర్తి చేసి గ్రూప్ ప్రాజెక్టులు కూడా నిర్వహిస్తారు. ఈ కోర్సుకు ప్రొఫెసర్ టిమ్ ఓ బ్రియాన్ ఛైర్మన్‌గా, ప్రొఫెసర్ కరెన్ మోరిసీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ కోర్సులో భాగంగా ప్రతినిధి బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, కాలాలు, తరాలనుండి కేస్ స్టడీలను విశ్లేషించి, పరిష్కారాలు రూపొందించి తరగతిలో సమర్పిస్తారు. కోర్స్ పూర్తి చేసిన తర్వాత ముఖ్యమంత్రి హార్వర్డ్ యూనివర్సిటీనుంచి సర్టిఫికెట్ పొందనున్నారు.

## మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర

**ఉట్నూరు(జనంసాక్షి):** దేశంలో రెండో అతిపెద్ద ఆదివాసీ సంప్రదాయ వేడుక ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఆదివారం అర్ధరాత్రి మహాపూజతో అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఆదివాసీ సంప్రదాయ రీతిలో సన్నాయి మోతలు, డోలు వాయిద్యాలు, దివిటీల కాంతుల మధ్య మెస్రం వంశ పెద్దల ప్రత్యేక పూజలతో మహాక్రతువు ఆద్యంతం భక్తుల తన్మయత్వం మధ్య వైభవంగా సాగింది. ముందుగా గర్భాలయం వెనక ఉంచిన పవిత్ర గంగా జలంతో శుద్ధికార్యక్రమం చేపట్టారు. సరిగ్గా అర్ధరాత్రి ఇలవేల్పు శేషసాయికి ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావు, కటోడాలు హన్మంతు, కోసు సహా మెస్రం పెద్దలు అంతరంగికంగా నిర్వహించిన అభిషేకంతో మహాపూజలోని ప్రధాన ఘట్టం ముగియనుంది.మెస్రం వంశీయుల దవళ వస్త్రధారణతో విద్యుత్తు కాంతుల ధగధగల మధ్య ఆలయ ప్రాంగణం తెలుపు వర్ణ శోభితమైంది. సంప్రదాయరీతిలో మెస్రం వంశ కొత్త కోడళ్ల భేటీ జరిగింది. సతీక్ దేవత పూజలు చేసి కుల పెద్దల కాళ్లు మొక్కి ఆశీస్సులు తీసుకున్నారు. అంతకుముందు కేస్లాపూర్‌లోని పాత మందిరమైన మురాఢి నుంచి నాగోబా దేవత ఆభరణాలను ఆలయానికి చేర్చారు. మెస్రం ఆడపడుచులు కొత్తకుండలతో కొనేరు నుంచి తెచ్చిన జలంతో అల్లుళ్లు, మెస్రం మహిళలు మట్టితో పుట్టలు తయారుచేసి పూజలు నిర్వహించారు

## బీజాపూర్ కొనసాగుతున్న ఎదురు కాల్పులు..

మృతుల్లో దిలీప్ బెడ్జా ఉన్నట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో ఇవాళ జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఏకే 47, 303 రైఫిల్, ఇన్సాస్, రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

## ఖమేనీ గద్దె దిగాల్సిందే..

ఖమేనీ మాట్లాడుతూ.. దేశంలో నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్నారు. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారేనని తెలిపారు. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడమే లక్ష్యంగా ఈ కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఇరాన్‌లో కొనసాగుతోన్న నిరసనలు మరింత తీవ్రం చేయాలని ప్రవాసంలో తలదాచుకున్న ఆ దేశ యువరాజు రెజా పహ్లవి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా వీధుల్లోకి వచ్చి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలన్నారు. ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అండగా ఉంటారని పేర్కొన్నారు. ఆ దేశంలో కొనసాగుతోన్న హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

కొనుగోళ్లపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు స్థానిక వ్యవసాయ భూములను వాస్తవ ధర కంటే పది రెట్లు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి ధోరణులు అమెరికాలో ఆహార ధరల పెంపునకు కారణం కావొచ్చన్నారు.అమెరికాతో వాణిజ్యం, రష్యాతో కొనసాగిస్తున్న విధానాలపై భారత్‌ను లక్ష్యంగా చేసుకుని నవారో గతంలోనూ పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు. భారత్ అత్యధిక సుంకాలు విధించడం వల్ల అమెరికా ఉద్యోగాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. లాభం కోసమే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, ఉక్రెయిన్‌తో మాస్కో చేస్తున్న యుద్ధాన్ని పోషిస్తోందని నోరు పారేసుకున్నారు. భారత్ ఈ వ్యాఖ్యలను కొట్టిపారేసింది. రష్యా నుంచి తాము చమురు కొనుగోలు చేస్తోంది కేవలం ఇంధన భద్రత కోసమేనని పేర్కొంది.

## ఇరాన్ ఆందోళనల్లో మృతులు 5 వేలు!

**ధ్రువీకరించిన అధికారులు**

**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్‌లో ఇటీవల జరిగిన ఆందోళనల్లో వేలాది మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఐదు వేల మరణాలను ధ్రువీకరించినట్లు అధికార వర్గాల సమాచారం. వీరిలో సుమారు ఐదు వందల మంది భద్రతా సిబ్బంది ఉన్నారని టెహ్రాన్ అధికారులు చెప్పినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. తమ దేశంలో అల్లర్లకు ఇజ్రాయెల్‌తో పాటు విదేశీ శక్తులు కూడా సాయం అందించినట్లు ఇరాన్ అధికారులు ఆరోపించారు. వేలాది మంది ఇరానీయన్ల మరణాలకు వారే కారణమన్నారు. కుర్దిష్ ప్రాంతంలో అల్లర్ల తీవ్రత ఎక్కువగా ఉందని అంగీకరించారు. మరణాల సంఖ్య ఎక్కువగా ఉండవచ్చని నివేదికలు చెబుతుండగా.. ఇవి ధ్రువీకరించిన మరణాలని, ఈ సంఖ్య గణనీయంగా పెరగకపోవచ్చని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, నిరసనకారులపై ఇరాన్ ప్రభుత్వం హింసకు పాల్పడితే తాము జోక్యం చేసుకోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే.

# పురపోరుకు పచ్చజెండా..




వీటికి ప్రభుత్వ భూముల కేటాయింపునకు ఆమోదం తెలిపాం. అలాగే, రాష్ట్రంలో గడువు పూర్తయిన 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లు, 2,996 వార్డులు, డివిజన్లలో వీలైనంత త్వరగా ఎన్నికలు జరపాలని నిర్ణయించాం. ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం రెండు రోజుల క్రితం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వీలైనంత త్వరగా మున్సిపల్ ఎన్నికలు జరపాలని క్యాబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. 2027 జులై 27 నుంచి ఆగస్టు 3వరకు గోదావరి పుష్కరాలు రానున్నాయి. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం. టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటుకు ఫిబ్రవరి 15లోపు కన్సల్టెన్సీ నివేదిక ఇస్తుంది. హైదరాబాద్ మెట్రోకు సంబంధించి క్యాబినెట్ సమావేశంలో చర్చించాం. మెట్రో ఫేస్–2 ఏ, బీ దశలకు సంబంధించి భూసేకరణకు రూ.2,787 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ములుగు జిల్లాలో సాగునీరు అందించేందుకు పొట్లపూర్ ఎత్తిపోతల పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది" అని వివరించారు.

## కట్టు కథలకు భయపడి లొంగిపోను

ఊరుకోనని స్పష్టం చేశారు. తాను ఆత్మగౌరవం కోసం బతుకుతామని, దోపిడి దారుల నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులమంతా రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని చిల్లర కథనాలతో భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తాను రాజకీయాల్లోకి గాలికి రాలేదని 40 సంవత్సరాలుగా సభలో ,బయట ఉండి ప్రజల కోసం పోరాటాలు చేసి వచ్చానన్నారు. రాధాకృష్ణ తొలి పలుకును ఏం ఆశించి రాశాడో,ఎవరి మెప్పు కోసం రాశాడో బయటపడుతుందని అన్నారు. ఈ కథనంపై రాష్ట్ర ప్రజలకు నిజాలు తెలియాలని తాను స్పందించడం జరిగిందన్నారు. త్వరలో పూర్తి వివరాల తో అన్ని విషయాలు వివరిస్తానని తెలిపారు.

## అమెరికా దురాక్రమణ చర్యలను దీటుగా ఎదుర్కొంటాం

ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పర్షియన్ భాషలో సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. అమెరికా ఆస్తులపై జరిగే ఏదైనా దాడిని చాలా బలమైన శక్తితో ఎదుర్కొంటామని, తమ దగ్గర అన్ని ఆప్షన్లు పరిశీలనలో ఉన్నాయని అమెరికా విదేశాంగ శాఖ పోస్ట్ చేసిన నేపథ్యంలో ఇరాన్ ఈ మేరకు స్పందించింది.అమెరికన్ స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఇటీవలే అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘై ఈ పోస్ట్ పెట్టారు. "ఈ ప్రకటనలు, వాదనలు పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలను పెంచేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలు, విధానాలకు అనుగుణంగా ఉన్నాయి. మా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి ఇరాన్ సాయుధ దళాలు దృష్టి పెట్టాయి. దేశంలోని సైనిక, రక్షణ సామర్థ్యాలను కాపాడటం, పెంచడంపై దృష్టి సారించాయి. అమెరికా ఏదైనా దురాక్రమణ చర్యకు దిగితే ఇరాన్ కఠినంగా, నిర్ణయాత్మకంగా స్పందిస్తుంది." అని ఎస్మాయిల్ బఘై పేర్కొన్నట్లు ఇరాన్ స్టేట్ ప్రసార సంస్థ ప్రెస్ టీవీ చెప్పింది.

ఇరాన్ స్టేట్ ప్రసార సంస్థ ప్రెస్ టీవీ కథనం ప్రకారం ఇరాన్ అంతటా ఆర్థిక సమస్యలపై గత నెల చివర్లో ప్రారంభమైన నిరసనలు అమెరికా, ఇజ్రాయెల్ ప్రముఖుల బహిరంగ ప్రకటనల తరువాత హింసాత్మకంగా మారాయి. అలాగే ఇరాన్‌లో అశాంతిని రెండు దేశాల నేతలు ప్రోత్సహించారు. ఇరాన్‌లో అశాంతి సమయంలో విదేశీ మద్దతుగల కిరాయి సైనికులు నగరాలపై దాడి చేశారు. ఫలితంగా ఇరాన్‌లో అనేక మంది భద్రతా సిబ్బంది, పౌరులు మరణించారు. ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ఇరాన్‌పై సైనిక చర్య చేపడతామని బెదిరిస్తున్నారు.

ట్రంప్‌పై ఖమేనీ ఫైర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ శనివారం మండిపడ్డారు. ట్రంప్‌ను నేరస్థుడిగా అభివర్ణించారు. ఇరాన్‌లో జరిగిన భారీ నిరసనలకు అమెరికా మద్దతు తెలపడంపై విమర్శలు గుప్పించారు. తమ దేశంలో నెలకొన్న అశాంతికి అమెరికాయే కారణమని అన్నారు. డిసెంబర్ 28న ప్రారంభమైన నిరసనలు, ఆ తర్వాత జరిగిన అణిచివేతలో కొన్ని వేల మంది మరణించారని స్పష్టం చేశారు. అల్లర్ల వల్ల జరిగిన మరణాల సంఖ్యపై ఇరాన్ సుప్రీం లీడర్ ఇలాంటి ప్రకటన రావడం ఇదే తొలిసారి.నిరసనకారులను రెచ్చగొడుతూ ట్రంప్ స్వయంగా ప్రకటనలు చేయడం, వారికి సైనిక మద్దతు ఇస్తామని హామీ ఇవ్వడం రాజద్రోహమని ఖమేనీ ఆరోపించారు. నిరసనకారులను అమెరికాకు చెందిన ఫుట్ సోల్జర్స్‌గా ఖమేనీ పేర్కొన్నారు. వారు మసీదులు, విద్యా సంస్థలను ధ్వంసం చేశారని మండిపడ్డారు. ప్రజలను గాయపరిచి, వేలాది మందిని వారు హతమార్చారని ఆరోపణలు గుప్పించారు. నిరసనకారుల వద్ద విదేశాల నుంచి దిగుమతి చేసిన ఆయుధాలు ఉన్నాయని అన్నారు.

## బెంగాల్‌లో అవినీతి, బంధుప్రీతి రాజ్యమేలుతున్నాయి

ప్రభుత్వం మాత్రమే ప్రజలకు రక్షణ, న్యాయం అందిస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రతికూల రాజకీయాలను దేశ ప్రజలు తిరస్కరిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశవ్యాప్తంగా భాజపాకు ప్రజల్లో మద్దతు పెరుగుతోందన్నారు. ప్రజల మొదటి ఎంపికగా తమ పార్టీ మారిందన్నారు. ఓటర్లు సుపరిపాలన, అభివృద్ధిని కోరుకుంటున్నారని.. బిహార్ ఎన్నికలు, తిరువనంతపురం, ముంబయి స్థానిక ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమయ్యిందన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో మోదీ పర్యటించారు. కలియాబోర్ ప్రాంతంలో నిర్వహించిన సభలో మాట్లాడారు."దేశాన్ని ఎన్నో ఏళ్లు పాలించినప్పటికీ కాంగ్రెస్‌కు అభివృద్ధి అజెండా లేదు. అందువల్లే ఆ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టింది. చొరబాటుదారుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం ఎన్నో ఏళ్లు కాంగ్రెస్ అస్సాంలో వారికి ఆశ్రయమిచ్చింది. ఆ పార్టీ హయాంలో పెద్ద మొత్తంలో చొరబాటుదారులు రాష్ట్రంలోకి వచ్చారు. కాంగ్రెస్ పెంచి, పోషించిన అక్రమ వలసదారులు ప్రజల భూములు ఆక్రమించుకుంటున్నారు. వారి సంస్కృతిపై దాడి చేస్తున్నారు. దీని వల్ల అస్సాం ప్రజల అస్తిత్వం ప్రమాదంలో పడింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం రాష్ట్రంలో ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మరిన్ని చర్యలు తీసుకుంటాం" అని మోదీ పేర్కొన్నారు.

## న్యాయవాదులు ఆర్‌టీఐ కింద క్లయింట్ల సమాచారాన్ని కోరలేరు

తరఫున అప్పీలుదారు ఈ సమాచారాన్ని కోరినట్లు కేంద్ర సమాచార కమిషనర్ సుధారాణి రేలంగి పేర్కొన్నారు."సరఫరాదారుడే స్వయంగా ఆ సమాచారం ఎందుకు అడగలేదు? అనే దానిపై అప్పీల్‌లో ఎటువంటి వివరణ లేదు. తన క్లయింట్ తరఫున అప్పీలుదారు ఈ సమాచారాన్ని కోరినట్లు కనిపిస్తోంది. దీన్ని అనుమతించలేం" అని కమిషన్ పేర్కొంది.

# నేతకాని వర్గానికి సముచిత గౌరవం

- మేడారం ట్రస్ట్ బోర్డులో ప్రాతినిధ్యంపై హర్షం



ములుగు(మేడారం), జనవరి18 (జనంసాక్షి): ఆదివాసీల కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ల నియామకంలో నేతకాని సామాజిక వర్గానికి చోటు కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నేతకాని వర్గానికి చెందిన జనగాం గంగలక్ష్మిని ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి సీతక్కకు సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మార్శల్ దుర్గం నగేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తూ మేడారం జాతరలో సంప్రదాయబద్ధ సేవలందిస్తున్న నేతకాని వర్గానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డా. నగేష్ చేసిన డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఆచారాల ప్రకారం వారు సమర్పించే 'సారె చీర'కు అధికారిక గుర్తింపు ఇవ్వాలన్న విజ్ఞప్తినీ పరిగణనలోకి తీసుకుంది. శనివారం మేడారం గ్రామంలో మంత్రి సీతక్క సమక్షంలో గంగలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా డా. నగేష్ మాట్లాడుతూ, కాకతీయుల కాలం నుంచే ఆదివాసీలతో కలిసి జీవిస్తున్న నేతకాని వర్గానికి ఈ నియామకం చారిత్రక గౌరవమని, ఇది సామాజిక న్యాయానికి నిదర్శనమని అన్నారు. గంగలక్ష్మి నియామకంతో తెలంగాణ వ్యాప్తంగా నేతకాని వర్గాల్లో సంబరాలు వెల్లివిరిశాయి. కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు ఎండి. అఫ్సర్ పాషా, జాడి రాంబాబు తదితరులు ఆమెను ఘనంగా సన్మానించారు. 2026 మేడారం జాతరలో నేతకాని వర్గ సంప్రదాయాలకు మరింత అధికారిక గుర్తింపు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# చంటి బిడ్డతో ట్రాఫిక్ విధులు





- హర్షం వ్యక్తం చేసిన సజ్జనార్

హైదరాబాద్ (జనంసాక్షి) : ఏపీలో ఇటీవల చంటిబిడ్డతో ట్రాఫిక్ క్లియర్ చేసిన మహిళా కానిస్టేబుల్‌పై హైదరాబాద్ సీపీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా వీడియో పంచుకున్నారు. ఒక చేతిలో పేగు బంధం.. మరో చేతిలో సమాజ బాధ్యత! అంటూ ఆయన ఫిదా అయ్యారు. డ్యూటీలో లేకపోయినా, చంటి బిడ్డ చంకలో ఉన్నా.. ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న అంబులెన్స్ కోసం స్వయంగా దారి క్లియర్ చేసిన ఏపీలోని రంగంపేట మహిళా కానిస్టేబుల్ ఆముదాల జయశాంతికి హ్యాట్సాఫ్.. అంటూ తెలిపారు. కాకినాడ - సామర్లకోట రోడ్డులో ఆమె చూపిన సమయస్ఫూర్తి, విధి నిర్వహణ పట్ల ఆమెకున్న నిబద్ధత అందరికీ ఆదర్శమని చెప్పారు. మాతృత్వానికి, కర్తవ్యానికి సెల్యూట్ అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు. రంగంపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళ కానిస్టేబుల్ ఆముదాల జయశాంతి తన డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాకినాడ జిల్లా సామర్లకోట ఫ్లైఓవర్ పైన శనివారం రాత్రి విపరీతంగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ఆమె రంగంలోకి దిగింది. తన బిడ్డను ఎత్తుకొని మరి ట్రాఫిక్ క్లియర్ చేశారు జయశాంతి. ఇక ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఇది చూసిన నెటిజెన్స్ ఫిదా అయిపోతున్నారు. ఓ చంటి బిడ్డను ఎత్తుకొని మరి ఇలా ట్రాఫిక్ క్లియర్ చేయడం చాలా గ్రేట్ అని నెటిజన్లు కొనియాడారు.

# మళ్లీ జతకడుతున్న కాంగ్రెస్, బీజేపీ

- మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం కుయుక్తులు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మహబూబ్‌నగర్ (జనంసాక్షి) : పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలు సరిగా రాకపోయే సరికి బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతున్నయని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నేతల పరస్పర పొగడ్తలు మున్సిపల్ ఎన్నికల్లో వారు కుమ్మక్కు అవుతున్నట్టు స్పష్టంగా సూచిస్తున్నాయన్నారు. సీఎం మహబూబ్ నగర్‌లో మాట్లాడిన తీరు ఎన్నికల్లో మాట్లాడినట్టుగానే ఉన్నదన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే ఆయనకు పథకాలు గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. రేవంత్ తన తండ్రి చనిపోతే స్నానానికి నీళ్లు లేవని కరెంటోళ్లకు చెప్పి అరగంట మోటార్ ఆన్ చేసుకున్నామని అసెంబ్లీలో చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో ఇప్పుడు ఆ పరిస్థితి ఉన్నదా అని నిలదీశారు. కేసీఆర్ పాలనలోనే పాలమూరు పరిస్థితులు మారాయని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ తీసుకురాకుంటే రేవంత్ సీఎం అయ్యేవారా అని.. నడుం విరగ్గొట్టి పడుకోబెట్టా అని నీచంగా మాట్లాడుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నువ్వు ఏం చేస్తే అడ్డుపడ్డారని హరీశ్‌రావు, కేటీఆర్‌ను మారీచుడు, సుబాహుడు అంటున్నావు'అని నిలదీశారు. జూరాలలో నీళ్లు ఉంటే క్రాప్ హాలిడే ఎందుకు ప్రకటించారన్నారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తీసుకొచ్చి కాంగ్రెస్, బీజేపీ నేతలు మాట్లాడాలన్నారు. మంత్రులకు దమ్ముంటే అశోక్‌నగర్ లైబ్రరీ సందర్శించాలని సవాల్ విసిరారు. మంత్రులు ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటూ మహిళా ఐఏఎస్ అధికారుల పరువును బజారుకీడుస్తున్నారని.. రాష్ట్రంలో వారు పనిచేయడానికి భయపడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి సి.లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ.. నల్లమల్ల బిడ్డను అని చెప్పుకుని సీఎం నిత్యం ప్రజల మొహాలు నల్లగా చేసి వెళ్తున్నారని అన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చింది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# త్వరలో కాంగ్రెస్‌కు జాతీయ హెూదా కనుమరుగు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు

హైదరాబాద్ (జనంసాక్షి) : దేశంలో అతి త్వరలోనే కాంగ్రెస్ పార్టీ కూడా జాతీయ పార్టీ హోదాను కోల్పోయే పరిస్థితులు భారత రాజకీయాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఇది దేశవ్యాప్తంగా కనిపిస్తున్న వాస్తవ రాజకీయ పరిణామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ దేశ ప్రజలు మోడీ ప్రభుత్వాన్ని బలంగా సమర్థిస్తూ అభివృద్ధిలో భాగస్వాములైతుంటే కాంగ్రెస్ పార్టీ ఒక్కొక్క రాష్ట్రాన్ని కోల్పోతూ, దేశ రాజకీయాల్లో క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోయి, కనుమరుగయ్యే దశకు చేరుకుంటోందని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీ హోదా కోల్పోయిన సీపీఐ మహాసభల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్ఐఆర్ వంటి అత్యంత సున్నితమైన, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై కనీస అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

# అభయారణ్యాల్లో జంతుగణన

- అడవుల్లో శాఖాహార మాంసాహార జంతువుల లెక్కింపు
- నేటి నుంచి అడవుల్లో లెక్కింపు ప్రక్రియ
- అటవీ అధికారులతో పాటు వాలంటీర్లకు అవకాశం



**ఆదిలాబాద్ ప్రతినిధి/ఖానాపూర్, (జనంసాక్షి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో మొత్తం ఎన్ని రకాల జంతువులు, అదే విధంగా ఎన్ని రకాల పక్షి జాతులు తల దాచు కుంటున్నాయి అనే దానిపై ఓ లెక్క తేలనుంది. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అడవుల్లో ఉన్న శాఖాహార మరియు మాంసాహార వన్యప్రాణులను లెక్కించేందుకు అటవీ అధికారులు సిద్ధం అవుతున్నారు. అయితే ఈసారి లెక్కింపులో భాగంగా అటవీ శాఖ అధికారులతో పాటు వాలంటీర్లకు అవకాశం కల్పించారు.**

ఈ లెక్కింపు ప్రక్రియ ప్రతీ నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. ఈ లెక్కింపులో భాగంగా అడవుల్లో దాగి ఉన్న ప్రతీ వన్య ప్రాణులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందు కోసం వారం రోజుల పాటు అడవుల్లో కొన్ని కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లాలో కోసాయి, అర్లి (టీ) దేవాపూర్ అటవీ రేంజ్ ప్రాంతంలో శాఖాహార జంతువులు అదేవిధంగా గొల్లఘడ్ తాంసి పెన్ గంగా నది తీరం వెంబడి ప్రతీ సంవత్సరం శీతాకాలంలో పులులు, చిరుతలు తరచుగా కనిపిస్తుంటాయని ఆదిలాబాద్ ఎఫ్ ఆర్ ఓ గులాబ్ సింగ్ తెలిపారు. అదేవిధంగా సిరిచెల్మ, బోథ్, నెరడిగొండ అటవీ రేంజ్ పరిదిలో ఎక్కువగా శాఖాహార జంతువులైన జింకలు, కొండ గొర్రెలు, నీలు గాయిలు, అప్పుడప్పుడు సాంబారు వంటి జంతువులతో పాటు డెడ్రా వంటి దట్టమైన అటవీప్రాంతంలో చిరుతలు, అప్పుడప్పుడు పెద్ద పులుల కదలికలు వాటి అడుగులు కనిపిస్తుంటాయి అని ఇచ్చోడ ఎఫ్ఆర్ఓ పుండలీక్ తెలిపారు. ఈ అటవీ ప్రాంతాలే కాకుండా కవ్వాల్ టైగర్ జోన్ పరిదిలో ఉన్న ఉట్నూర్ డివిజన్ పరిధిలోని బీర్సాయి పేట వంటి దట్టమైన అటవీ ప్రాంతంలో ఎన్నో రకాల అందమైన పక్షులు, ఎన్నో రకాల శాఖాహార, మాంసాహార జంతువులు తల దాచుకుంటున్నాయి. ఇప్పుడు చేపడుతున్న ఈ లెక్కింపులో ఏ ఏ రకాల జంతువులు నివసిస్తున్నాయో వారం రోజుల లెక్కింపు అనంతరం వివరాలు తెలిసే అవకాశం ఉంది. జిల్లాలో పులులు సంఖ్య ఈమేరకు ఉందో వాటి అడుగుల ఆధారంగా తెలిసే అవకాశం ఉంది.

ఖానాపూర్ డివిజన్ పరిధిలోని కవ్వాల్ అభయారణ్యంలో శాఖాహార, మాంసాహార జంతు గణన నిర్వహిస్తున్నట్లు ఫారెస్ట్ డివిజనల్ అధికారి శివ కుమార్ తెలిపారు. ఈనెల 20 నుండి 26వ తేదీ వరకు ఆరు రోజులపాటు గణన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏక కాలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బందితోపాటు 35 మంది ప్రత్యేక వాలంటీర్లు పాల్గొంటున్నారని, మొదటి మూడు రోజులు శాకాహార జంతువుల గణన, తదుపరి మూడు రోజులు మాంసాహార జంతువుల గణన నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

# అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల



హైదరాబాద్ (జనంసాక్షి) : ఐవీఎఫ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్త పేట మోహన్ నగర్ మెయిన్ రోడ్ వద్ద అమావాస్య సందర్భంగా కొత్త పేట ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మారుతి నగర్ మహంకాళి ఆలయం వద్ద అమావాస్య అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో రామంతపూర్ లో తన తల్లి తండ్రులు ఉప్పల ఆనంతలక్ష్మీ - ఉప్పల విశ్వనాథం జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టిన టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త వారి సతీమణి ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న పెద్ద కుమారుడు ఉప్పల సాయి కిరణ్ చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ పాల్గొన్నారు. నల్ల పోచమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించిన నైవేద్యం సమర్పించి అన్నప్రసాద వితరణ కార్యక్రమం మొదలు పెట్టారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ 'అమావాస్య రోజున అన్నదానం చేయడం మహత్తర పుణ్యకార్యం. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, మానవత్వాన్ని పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. అన్ని దానాల కన్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం గొప్పది అని ఆయన అన్నారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గరపు దయానంద్, ఉప్పలబశ్రీశ్రీల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పరమేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఆర్య వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు పాండు గుప్త, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేశ్, కోశాధికారి శ్రవణ్, ప్రధాన కార్యదర్శి పబ్బా శేఖర్, కటకం శ్రీనివాస్, ఐవీఎఫ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాచం కృష్ణమూర్తి, కొత్త పేట ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వాసు, వారి టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధువు మృతదేహాన్ని.. తల్లిదండ్రుల ఇంటి బయట వదిలివేశారు

పాట్నా (జనంసాక్షి) : నూతన వధువు అనుమానాస్పదంగా మరణించింది. ఆమె మృతదేహాన్ని పోలీస్ అధికారి వాహనంలో తరలించారు. ఆమె తల్లిదండ్రుల ఇంటి బయట వదిలేశారు. వరకట్న వేధింపుల కారణంగా అత్తింటి వారు తన కుమార్తెను హత్య చేసినట్లు ఆమె తండ్రి ఫిర్యాదు చేశాడు. బీహార్‌లోని సరన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పేడియా బజార్ ప్రాంతానికి చెందిన జయప్రకాష్ మహతో కుమార్తె సరితకు తొమ్మిది నెలల కిందట వైశాలి జిల్లాలోని కర్తహాన్ బుజుర్గ్ గ్రామానికి చెందిన సత్యేంద్ర కుమార్‌తో వివాహం జరిగింది. జనవరి 16న తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో జయప్రకాష్ ఇంటి ముందు నల్లటి స్కార్పియో వాహనం ఆగింది. అందులో ఉన్న వ్యక్తులు సరిత మృతదేహాన్ని ఆ ఇంటి బయట వదిలేసి వెళ్లిపోయారు. ఉదయం ఇంటి బయట ఉన్న కుమార్తె మృతదేహాన్ని చూసి ఆమె కుటుంబం షాక్ అయ్యింది. అదనపు కట్నం డిమాండ్ చేస్తున్న అత్తింటి కుటుంబం తన కుమార్తెను హత్య చేసి తమ ఇంటి బయట వదిలేశారని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోవైపు పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. సరిత మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. సరిత మృతదేహాన్ని తరలించిన స్కార్పియో వాహనం ముజఫర్‌పూర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సంతోష్ రజక్ పేరుతో రిజిస్టర్ అయినట్లు గుర్తించారు. దీంతో సరిత మరణంతో పాటు ఆ వాహనానికి సంబంధించిన పోలీస్ అధికారి ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# మంచు కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలు ఢీ..

- మంటల్లో ఇద్దరు సజీవ దహనం




చండీగఢ్ (జనంసాక్షి) : మంచు కారణంగా ఎక్స్‌ప్రెస్ వేపై పలు వాహనాలు ఢీకొన్నాయి. మంటలు చెలరేగడంతో ఒక వాహనంలోని ఇద్దరు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆ జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. హర్యానాలోని నుహ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో పొగమంచు కారణంగా కుండ్లి-మనేసర్-పల్వాల్ (కేఎంపీ) ఎక్స్‌ప్రెస్‌వేపై పలు వాహనాలు ఢీకొన్నాయి.

ఒక భారీ వాహనం ఆకస్మికంగా బ్రేక్‌లు వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. దాని వెనుక ఉన్న వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. కంకర లోడ్ ఉన్న డంపర్, అమెజాన్ వస్తువులను రవాణా చేస్తున్న కంటైనర్‌లో మంటలు వ్యాపించాయి. డంపర్‌లో ఉన్న రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్, హెల్పర్ మంటల్లో కాలి సజీవ దహనమయ్యారు. గాయపడిన మరి కొందరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు గురుగ్రామ్ నుంచి లక్నో వెళు_న్న అమెజాన్ కంటైనర్‌లో బట్టలు, షూస్, మొబైల్ ఫోన్లు వంటి వస్తువులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మంటల కారణంగా సరుకు పూర్తిగా దగ్ధమైందని చెప్పారు. సుమారు రూ.1.25 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన కొన్ని పార్సిల్‌ను కొందరు వ్యక్తులు ఎత్తుకెళ్లగా మిగతా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది మూడు గంటలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఆ తర్వాత క్రేన్ సహాయంతో దగ్ధమైన వాహనాలను రోడ్డు పక్కకు తొలగించారు. ఈ ప్రమాదం వల్ల సుమారు ఆరు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు నాలుగు గంటలకుపైగా శ్రమించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అయితే ఒక డంపర్, అమెజాన్ పార్సిల్ కంటైనర్, మూడు ట్రైలర్స్ ఈ ప్రమాదంలో ధ్వంసమైనట్లు పోలీస్ అధికారి తెలిపారు. సజీవ దహనమైన డంపర్ డ్రైవర్, హెల్పర్ మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు చెప్పారు. చలికాలంలో వాహన డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# మంచిర్యాల జిల్లాలో దారుణం..

- కొడుకును చంపి, తండ్రి ఆత్మహత్య

మంచిర్యాల (జనంసాక్షి) : జిల్లాలోని జన్నారం మండలంలో దారుణం చోటు చేసుకుంది. రాంపూర్ గ్రామానికి చెందిన పలగాని భూమయ్య(40), కుమారుడు కార్తిక్ (10) నివాసం ఉంటున్నారు. కుమారుడు పుట్టుకతోనే దివ్యాంగుడు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొడుకును పోషించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దారుణానికి ఒడిగట్టాడు. ముందుగా కుమారుడి గొంతుకోసి చంపి అనంతరం తండ్రి కూడా గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు కోసం చేసిన అప్పులు తీర్చలేక, పని దొరకక ఈ ఘాతుకానికి పాల్పడిన ట్లు గ్రామస్థులు వివరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# ప్రజాభిప్రాయం లేకుండానే మున్సిపాలిటీల విభజన

- ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపణ

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రజాభిప్రాయం లేకుండా మున్సిపాలిటీల విభజన జరుగుతోందని ఎంపీ కొండా విశ్వేశ్వర్?రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న గ్రామాలతో పాటు అదిభట్ల, మహేశ్వరం, తుక్కుగూడ మున్సిపాలిటీలను చార్మినార్‌లో విలీనం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వం గ్రేటర్ నగరానికి మూడు కార్పొరేషన్‌లుగా చేసేందుకు ఓవైసీ హిల్స్‌లో విభజన జరుగుతుందని, అధికారులది ఇందులో ఏమాత్రం ప్రమేయం లేదన్నారు. పాతబస్తీలో కార్పేటర్ సీట్లు పెంచుతూ విలీనం ప్రాంతాలను సీట్లు తగ్గిస్తున్నారని విమర్శలు చేశారు. గ్రేటర్ రంగారెడ్డి కమిషనర్ ఏర్పాటు చేసే బాగుంటుందని, లేకుంటే ఎల్బీనగర్, రాజేంద్రనగర్ లను మల్కాజిగిరి, మహేశ్వరం ప్రాంతాన్ని సైబారాబాద్‌లో కలపాలని పేర్కొన్నారు.

# వీకెండ్ డ్రైంక్అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ యువత

హైదరాబాద్ (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన 'వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ణ తనిఖీల్లో భారీగా మందుబాబులు పట్టుబడ్డారు. జనవరి 16 నుంచి 17 వరకు నిర్వహించిన ఈ దాడుల్లో మొత్తం 231 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కమిషనరేట్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. పోలీసులు వెల్లడించిన గణాంకాల ప్రకారం, పట్టుబడిన వాహనాల్లో ద్విచక్ర వాహనాలే అత్యధికంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు 187 మందిపై కేసులు, కార్లు 29 కేసులు, ఆటోలు 15 కేసులు నమోదు అయ్యాయి. ఈ తనిఖీల్లో పట్టుబడిన వారి వయస్సును గమనిస్తే ఆందోళనకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 21 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారే మద్యం మత్తులో ఎక్కువగా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. 21-30 ఏళ్ల లోపు వారు 92 మంది, 31-40 ఏళ్ల లోపు వారు 88 మంది ఉండటం గమనార్హం.

# హైదరాబాద్ పట్టణాభివృద్ధిలో లోపాలు

హైదరాబాద్, తెలంగాణ రాజధాని, భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరాలలో ఒకటి. 1591లో స్థాపించబడిన ఈ నగరం, ఇప్పుడు ఐటీ హబ్‌గా మారి, 7.7 మిలియన్ల జనాభాతో (2011 సెన్సస్ ప్రకారం) 2041 నాటికి 19 మిలియన్లకు చేరుకోనుంది. ఆర్థిక వృద్ధి, వలసలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటివి ఈ నగరాన్ని ఆకర్షణీ యంగా మార్చాయి. అయితే, ఈ వృద్ధి వెనుక లోపాలు ఎన్నో ఉన్నాయి. ట్రాఫిక్ జామ్‌లు, పర్యావరణ కాలుష్యం, నీటి కొరత, హౌసింగ్ సమస్యలు వంటివి నగరాన్ని అసమతుల్యంగా మారుస్తున్నాయి.

**ట్రాఫిక్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లోపాలు :** హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌లు ఒక సాధారణ సమస్య. 2023లో ప్రకటించిన (ఏ.ఆర్.సీ. జీఐఎస్) ArcGIS నివేదిక ప్రకారం, వేగవంతమైన వృద్ధి కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగింది, ముఖ్యంగా ఐటీ హబ్ ప్రాంతాలలో ఈ సమస్య చాలా ఎక్కువగా ఉంది. మెట్రో రైల్, 2017లో ప్రారంభమైనప్పటికీ, 2024 నాటికి దాని పొడవు స్థిరంగా ఉండిపోయింది, ఇతర నగరాలు (బెంగళూరు వంటివి) ముందుకు దూసుకుపోతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో 4వ స్థానంలో ఉంది, 2026 నాటికి 6వ స్థానానికి పడిపోనుంది. దాని పొడవు బెంగళూరు మెట్రో పొడవులో సగం మాత్రమే. రైదుర్గ్ మెట్రో స్టేషన్ వంటి ప్రాంతాలలో రద్దీ కారణంగా రోజువారీ ప్రయాణీకులు 5 లక్షలు మాత్రమే ప్రయాణం చేయగలుగుతున్నారు., అయితే ప్రాజెక్ట్ లక్ష్యం మాత్రం 24 లక్షలు.

విమర్శనాత్మకంగా చూస్తే, మెట్రో రూట్‌లు రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయి. ప్రయాణీకుల అవసరాల కోసం మాత్రం కాదు.(ఎస్.ఆర్.డీ.పీ) ఫ్లై ఓవర్‌లు మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నాయి. బస్సులు, సైకిల్ ట్రాక్‌లు, పెడెస్ట్రియన్ సదుపాయాలను పూర్తిగా దృష్టిలో పెట్టుకొని చేయలేదు.నిర్లక్ష్యం చేయబడ్డాయి. ఫలితంగా, ప్రైవేట్ వాహనాలు పెరిగి, రోజువారీ సమయం వృథా అవుతోంది, ఉత్పాదకత తగ్గుతోంది. గత రెండేళ్లలో హెచ్ - సిటీ, మెట్రో ఫేజ్-2 వంటి ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి. ఇది పాలనా వైఫల్యాన్ని, రాజకీయ పార్టీ మార్పు వల్ల ఏర్పడిన స్పర్థను చూపిస్తుంది. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సౌకర్యార్థం కాకుండా రాజకీయ కోణంలో చూడటం వల్ల ఎక్కడా పనులు అక్కడే ఆగిపోతున్నాయి. ప్రజలకు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.



**పర్యావరణ కాలుష్యం, సస్టైనబిలిటీ సమస్యలు**

హైదరాబాద్‌లో వేగవంతమైన నిర్మాణాలు, నియంత్రణ లేని విస్తరణ కారణంగా పర్యావరణ సమస్యలు తీవ్రమవుతున్నాయి. భారతదేశంలో 44 శాతం నగరాలు దీర్ఘకాలిక గాలి కాలుష్యాన్ని ఎదుర్కొంటున్నాయి, హైదరాబాద్‌లో ఈ నూతన నిర్మాణాలు దీనికి ప్రధాన కారణం. నదులు 50 శాతం కాలుష్యం చెందాయి, పైప్‌లైన్‌లలో 40-50 శాతం నీరు వృథా అవుతోంది. రాతి మైదానాలు, రోడ్లు వంటి అపారగమ్య ఉపరితలాలు(డాంబర్, సిమెంట్ రోడ్లు) భూగర్భజల రీఛార్జ్‌ను తగ్గిస్తున్నాయి. సామాజిక సస్టైనబిలిటీ సూచిక - 148.614 శాతం, ఇది నివాసితుల అసంతృప్తిని చూపిస్తుంది. నెట్‌వర్క్ కనెక్టివిటీ, గ్రీన్ స్పేస్‌లు, సేఫ్టీ లోపాలు ఉన్నాయి.

విమర్శనాత్మకంగా పరిశీలించి చూస్తే, అన్‌లిమిటెడ్ (ఎఫ్.ఎస్.ఐ.) పాలసీ ఐటీ హబ్‌ను "డేంజర్ జోనుగా మారుస్తోంది, హీట్ ఐలాండ్‌లు సృష్టిస్తోంది. మూసాపేట్, కూకట్‌పల్లి వంటి ప్రాంతాలలో హై-రైజ్‌లు 25,000 అపార్ట్‌మెంట్‌లకు చేరుకోనున్నాయి. కానీ రోడ్లు సన్నగా, భూగర్భజలం లేకుండా ఉన్నాయి. ఈ పట్టణం ఒక ప్రణాళిక లేకుండా అడ్డగోలుగా విస్తరణల వల్ల సరస్సుల(లేక్‌ల)కు ముప్పు తెస్తోంది, సీవేజ్ డంపింగ్ పెరుగుతోంది.

**నీటి సరఫరా,సీవరేజ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇబ్బందులు :** నీటి కొరత హైదరాబాద్‌కు పెద్ద సమస్య. హెచ్.ఎం.డబ్లు.ఎస్.ఎస్.బీ. ఒత్తిడిలో ఉంది, రాకీ టెర్రైన్ కారణంగా భూగర్భజలం తక్కువ. గత రెండేళ్లలో మల్లన్న సాగర్ నుండి నీటి సరఫరా ప్రాజెక్టు మంచిదే, కానీ అమలులో విపరీతమైన ఆలస్యం జరుగుతుంది. సీవరేజ్ వ్యవస్థలు పాతవి, వరదల సమయంలో వాటర్ లాగింగ్ సాధారణం (ఎస్.ఎన్.డీ.పీ.-2.0), అండర్‌గ్రౌండ్ పవర్ కేబుల్స్ వంటివి మరచిపోయారు. ముసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కూడా బ్యాక్‌లాష్ కారణంగా ఆగిపోయింది. ఆర్.ఆర్.ఆర్.సౌత్ అలైన్‌మెంట్ ఇంకా పూర్తి కాలేదు, ల్యాండ్ అక్విజిషన్ ఆలస్యం అవుతుంది. ఈ ఆలస్యాలు ఖచ్చితంగా పాలనా అసమర్థతను చూపిస్తాయి, నగరాన్ని అసమతుల్యంగా మారుస్తాయి.

**హౌసింగ్, సామాజిక సమస్యలు**

జనాభా వృద్ధి కారణంగా హౌసింగ్ సంక్షోభం. స్లమ్‌లు పెరుగుతున్నాయి, ప్రాపర్టీ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణ జనం కొనలేకున్నారు. మెగా మాస్టర్ ప్లాన్ 2050 (హెచ్‌ఎండీఏ)ను 13,000 చ.కి.మీకి విస్తరిస్తుంది. కానీ, అమలు సందేహాస్పదం గానే ఉంది. ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు మాస్టర్ ప్లాన్ లేకుండా ముందుకు సాగుతున్నాయి. సామాజికంగా, వలసలు సాంస్కృతిక గుర్తింపును నాశనం చేస్తున్నాయి. ఒంటరితనం (అనోసి యేషన్) పెరుగుతోంది. మాస్టర్ ప్లాన్‌లు స్థానిక అభివృద్ధి మోడల్‌లకు సున్నితత్వం లేకుండా ఉన్నాయి. పొలిటికల్-బిల్డర్ నెక్సస్ ధరలను పెంచుతోంది. సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌ను అడ్డుకుంటుంది.

**కొన్ని సూచనలు :** హైదరాబాద్ అభివృద్ధి ఆర్థికంగా ఆకట్టుకుంటుంది. కానీ లోపాలు నగరాన్ని అసమర్థంగా మారుస్తున్నాయి. 2025 బడ్జెట్ 17,677 కోట్లు కేటాయించింది, హచ్-సిటీ, మెగా మాస్టర్ ప్లాన్ వంటివి ప్రకటించింది. కానీ అమలులో లోపం అరిగే కొనసాగుతుంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ విస్తరణ జరగాలి. స్ట్రిక్ట్ (ఎఫ్.ఎస్.ఐ.)నిబంధనలు పాటించాలి, గ్రీన్ స్పేస్‌లు పెంచాలి, హైడ్రా వంటి ఇనిషియేటివ్‌లలో రాజకీయాలకు అతీతంగా నిష్పాక్షికంగా విధివిధానాలు పాటిస్తూ, సిస్టమాటిక్ రిఫార్మ్‌లను సీసుకు రావాలి. సస్టైనబుల్ ప్లానింగ్ లేకుంటే, హైదరాబాద్ డిజాస్టర్‌కు దారితీస్తుంది.

**డాక్టర్ కేఆర్‌కే**

# మత అసహనం ఇరుదేశాల దుర్గతి

ప్రపంచవ్యాప్తంగా మతాల మంచి చెడుల గురించి బహిరంగ చర్చలు తగ్గిపోతున్నాయి. అదే సమయంలో మత భావాలను రెచ్చగొట్టి రాజకీయ లాభాలు పొందే ప్రయత్నాలు మాత్రం విస్తరిస్తున్నాయి. ఇది నమ్మశక్యం కాని వాస్తవమే అయినా, చాలా దేశాల్లో మత రాజకీయాలు పెరిగిపోతుండటం వల్ల మతాల పట్ల సద్వివేచన మరియు సమాన దృక్పథం కనుమరుగవుతున్నాయి. మత ఆధారిత రాజకీయాల్లో ఎదుటి మతాలను దూషించటం, విద్వేషాలు పెంచటం, కొందరు చేసిన తప్పులకు మొత్తం మతానుయాయులను బాధ్యులను చేయటం సర్వసాధారణమవుతోంది. ఇలాంటి పరిస్థితులు సాధారణ పౌరులను బలిపశువులుగా మారుస్తున్నాయి, వారే ఈ విద్వేషాలకు మూల్యం చెల్లిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం కనిపిస్తున్న చిత్రం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ప్రతి రోజూ హిందువులపై దాడులు, హత్యల వార్తలు వస్తూనే ఉన్నాయి. జమాత్-ఇ-ఇస్లామీ వంటి సంస్థలు దేశాన్ని ఇస్లామీకరణ చేస్తామని, చట్టాలను షరియా మత చట్టాలకు అనుగుణంగా మారుస్తామని ప్రకటిస్తూ అధికారం కోసం పావులు కదుపుతున్నాయి. ప్రతి రాజకీయ సంక్షోభాన్ని తమ లాభానికి ఉపయోగించుకోవటంలో మతతత్వ శక్తులు ఎప్పుడూ ముందుంటాయి. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత, మతతత్వ సంస్థల రాజకీయ చురుకుదనం మరింత పెరిగింది. స్వచ్ఛమైన ఇస్లామిక్ పాలన తెస్తామనే నినాదాలు మాత్రమే కనిపిస్తాయి, కానీ ప్రజా జీవితాలను మార్చే సామాజిక, ఆర్థిక, సంక్షేమ విధానాలు ఈ సంస్థలకు ఎప్పుడూ లేవు. వాటికి కావలసింది ఒక మతాన్ని శత్రువుగా చూపి విద్వేషాలు పెంచే రాజకీయాలు మాత్రమే. హిందువులను భారత అనుకూలులుగా, ఏజెంట్లుగా ముద్రవేసి దాడులు చేస్తూ మతప్రాతిపదికన బలం పెంచుకోవటం వాటి లక్ష్యం. మూకదాడులు, దేవాలయాల విధ్వంసాలు వాటి దృష్టిలో నేరాలు కావు, మతం లేని పౌర హక్కులకు విలువ లేదు. మతాతీత పౌర హక్కుల భావనకు ఇలాంటి సంస్థలు వ్యతిరేకం. వచ్చే నెలల్లో ఎన్నికలు ఉండటంతో మత విద్వేషాలు మరింత రెచ్చగొట్టబడుతున్నాయి. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) మరియు అవామీ లీగ్ పార్టీలు మతతత్వ సంస్థల అండదండలను సమయానుకూలంగా ఉపయోగించు కున్నాయి. ఈ ప్రధాన పార్టీలు మతతత్వానికి దూరంగా ఉండి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది, కానీ అధికారం కోసం మతాన్ని ఆధారం చేసుకున్నాయి. బంగ్లాదేశ్ రాజ్యాంగంలో మొదట్లో లౌకికవాదాన్ని మూలస్తంభంగా పేర్కొన్నారు, మత ఆధారిత పార్టీలను నిషేధించారు, సోషలిజాద్భున్ని మౌలిక సూత్రంగా చేశారు. కానీ అధికారాన్ని కాపాడుకోవటానికి లౌకికవాదం నుంచి వైదొలిగారు, ఇది ప్రస్తుత విద్వేష వాతావరణానికి ప్రధాన కారణం. అవామీ లీగ్ భారత అనుకూలంగా వ్యవహరించినంత మాత్రాన లౌకిక పార్టీ కాదు, అది కూడా జమాత్‌తో జట్టుకట్టిన చరిత్రను కలిగి ఉంది. 1977లో మిలిటరీ పాలకులు లౌకికవాదాన్ని తొలగించి, "అల్లా పట్ల విశ్వాసం" అనే పదాన్ని చేర్చారు. 1988లో ఇస్లాంను రాజ్య మతంగా ప్రకటించారు. షేక్ హసీనా అధికారంలోకి వచ్చినా ఆ మార్పులను తీసేయలేదు. 2011లో లౌకికవాదాన్ని మళ్లీ చేర్చినా, ఇస్లాం రాజ్య మతం మరియు అల్లా విశ్వాసం వ్యక్తీకరణలను అలాగే ఉంచారు. 2014లో హసీనా ప్రకటనతో లౌకికవాదం అవకాశాలు ముగిశాయి: మహమ్మద్ ప్రవక్త మదీనా ప్రసంగం ఆధారంగా పాలన ఉంటుందని, ఖురాన్-సున్నీలకు భిన్న చట్టాలు రావని చెప్పారు. అవామీ లీగ్ మతానికి పెద్దపీట వేయటం బంగ్లాదేశ్‌కు చెడ్డ మలుపు. దాన్నుంచి తిరిగి వచ్చే కొత్త రాజకీయాలు ఇప్పుడు లేవు. బంగ్లాదేశ్‌లో మూకదాడులు, మత ప్రేరిత హత్యలు ఘోరమైనవి, మానవతా వ్యతిరేకమైనవి. కానీ భారత్ ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, లౌకికవాదానికి నిబద్ధమైన దేశంగా ఈ అకృత్యాలను బలంగా ఖండించలేని నైతిక సందిగ్ధతలో ఉంది. సామాజిక మాధ్యమాల్లో హిందూ మతాభిమాన ఉద్వేగాలతో ఖండనలు వస్తున్నాయి.




కానీ విశ్వమానవ పౌర హక్కుల దృష్టితో చూస్తే అవి పరిమితమైనవి, పాక్షికమైనవి. పౌర హక్కుల స్పృహ మనసుల్లో పాతుకుపోతే అన్ని మత విద్వేష దాడులపై ఆగ్రహం కలుగుతుంది, ఆవేశం పెల్లుబుకుతుంది, వివేచనతో కూడిన ఆచరణ పురిగొల్పుతుంది. దేశంలోపలా, బయటా విద్వేషాలకు ఎదురొడ్డి నిలబడితేనే పౌర హక్కులు సార్థకమవుతాయి. అలా చేయలేకపోతే నైతిక శక్తి కొరత ఏర్పడుతుంది, బంగ్లాదేశ్ అకృత్యాలపై బలహీన గొంతులకు కారణం అదే.

ఇక్కడే భారత్‌లోని పరిస్థితులతో పోల్చి చూడాలి. బంగ్లాదేశ్‌లో ముస్లిం మెజారిటీ మతతత్వం హిందువులను లక్ష్యంగా చేసుకుంటుంది, అదే విధంగా భారత్‌లో హిందూ మెజారిటీ మతతత్వం ముస్లింలు, క్రిస్టియన్లు మరియు ఇతర మైనారిటీలపై అసహనాన్ని పెంచుతోంది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం 2014 నుంచి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ నేషనలిజం బలపడింది. ఇది మత సామరస్యాన్ని దెబ్బతీసి, మైనారిటీలపై దాడులను ప్రోత్సహిస్తోంది. ఉదాహరణకు, ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం 'లవ్ జిహాద్' పేరుతో అంటి-కన్వర్షన్ చట్టాలు తెచ్చింది. 2020లో పాసైన ఉత్తర ప్రదేశ్ ప్రొహిబిషన్ ఆఫ్ అన్‌లాఫుల్ కన్వర్షన్ ఆఫ్ రెలిజియన్ ఆర్డినెన్స్ ప్రకారం ఇంటర్‌ఫెయిత్ మ్యారేజ్‌లను లక్ష్యంగా చేసుకుని ముస్లిం పురుషులను జైలు పాలు చేస్తున్నారు, ఇది 10 సంవత్సరాల జైలు శిక్షకు దారితీస్తుంది. ఇలాంటి చట్టాలు మధ్య ప్రదేశ్, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో కూడా అమలవుతున్నాయి, ఇవి మత స్వేచ్ఛను హరిస్తున్నాయి. బుల్డోజర్ డెమాలిషన్స్ ముస్లిం హౌసెస్ మీదే జరుగుతున్నాయి, కమ్యూనల్ వయలెన్స్ తర్వాత ముస్లింలను శిక్షించే విధంగా ఉపయోగిస్తున్నారు.

కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ముస్లిం మెజారిటీ ప్రాంతంలో అసహనం పెరిగింది. బీజేపీ హిందూ నేషనలిజాన్ని ప్రోత్సహిస్తూ కాశ్మీరీ పండిట్లను తిరిగి రప్పించటం పేరుతో ముస్లింలను ఒంటరి చేస్తోంది, కానీ వాస్తవంలో ఆర్టికల్ 370 రద్దు ముస్లిం సెపరటిజాన్ని ప్రోత్సహిస్తుందని విమర్శలు ఉన్నాయి.

గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్లు బీజేపీ నాయకత్వంలోని మత విద్వేషానికి చిహ్నం. అప్పటి సీఎం నరేంద్ర మోదీ పాలనలో 1,000 మందికి పైగా ముస్లింలు హత్యలయ్యారు, మోదీపై నిర్లక్ష్యం ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి సంఘటనలు ఇప్పుడు మరింత పెరిగాయి, 2014 తర్వాత కమ్యూనల్ వయలెన్స్ రేట్ పెరిగింది.మణిపూర్లో క్రిస్టియన్ చర్చిలను కూల్చి వేయటం, మైనార్టీ తెలుగుపై దాడులు, రేపులు, శాంతి భద్రతల క్షీణత మత ద్వేషపూరిత విధానాలకు అద్దం పడుతుంది.

**ఇరు దేశాల మధ్య సమానతలు స్పష్టం:**

బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ మతతత్వం హిందువులను టార్గెట్ చేస్తుంటే, భారత్‌లో హిందూ మతతత్వం ముస్లింలను టార్గెట్ చేస్తోంది. బంగ్లాదేశ్‌లో 2025 మొదటి ఆరు నెలల్లో 258 దాడులు జరిగాయి, 27 హత్యలు, 20 రేప్ కేసులు, 59 ఆలయ దాడులు. డిసెంబర్ 2025 నుంచి జనవరి 2026 వరకు 15 హిందువుల హత్యలు జరిగాయి. అదే విధంగా భారత్‌లో బీజేపీ రాష్ట్రాల్లో అంటి-కన్వర్షన్ చట్టాలు మైనారిటీలను హరాస్ చేస్తున్నాయి, మధ్య ప్రదేశ్‌లో 2021లో అమెండ్మెంట్ బిల్ పాస్ అయింది.

చివరిగా... ఈ మత అసహనాలు రెండు దేశాల్లోనూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయి, పౌర హక్కులను హరిస్తున్నాయి. ఇవి ఖండనీయం, మానవతా వ్యతిరేకం. లౌకికవాదం, సమానత్వం మాత్రమే మార్గం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## కలల పక్షుల్లో

పడుకున్నాను
ఓ కల నా కన్నుల్లో దూరింది
గుర్రమెక్కి స్వారీ చేస్తున్నట్టు నేను
కొద్ది సేపటికి మళ్ళీ
ఓ కల నా కన్నుల్లో చేరింది
రథం మీద కూర్చొని
తోల్తున్నట్టు నేను
చాపమీద మరోపక్కకి మళ్ళీ

దుప్పటి కప్పుకొని -
తెల్లవారు ఝామున ఓ కల
పాడెమీద పడుకొని వెళ్తున్నట్టు -
టపీమని లేచి పట్టిన చెమట
తుడిచి
ఇలలోనే కాదు కలలోనూ
మరణం భయమే -
జీవితంలో వివిధ మజిలీలలో
తనకెదురైన
అనుభవించిన సంఘటనలకి
చలించలేదు కాని ఇదేమిటి?

రేపు ఎలా పడుకుంటాను
నిద్రంటే ఆసక్తి పైగా కుతూహలం
ఈ క్షణం నుండే నా కళ్ళల్లోంచి
దూకే

వెలుగే క్షీణమైంది
కలలు బుసకొడ్తాయా?
డబ్బు పోగొట్టుకున్న ట్టు
ఉత్సాహం పోగొట్టుకొని -
ఐనా
కలల పక్షులన్నీ

కలకలారావంతో
సందడికే ఇంత అలజడా!
నిద్రలేస్తేనే తుర్రంటూ
జారుకొంటవి
కళ్ళుతెరిస్తేనే బుర్రంటూ
ఎగిరిపోతవి
నిజమై జీవిస్తా
కవితై విరుస్తా

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

## సినిమా టికెట్ ధరల పెంపు...
# వినోదమా లేక దోపిడీయా?

తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల పెరిగిన సినిమా టికెట్ ధరలు కేవలం సామాన్యుడి జేబుకు భారంగా మారడమే కాకుండా, ఒక తీవ్రమైన సామాజిక ఆర్థిక చర్చకు దారితీశాయి. అసలు సినిమా అనేది ఒక ప్రజా వినోద సాధనమా లేక లాభమే పరమావధిగా సాగే వ్యాపారమా? అనే ప్రాథమిక ప్రశ్న ఇక్కడ తలెత్తుతోంది. సినిమా ఒక సృజనాత్మక కళగా పుట్టినప్పటికీ, కాలక్రమేణా భారీ పెట్టుబడులతో కూడిన హై-స్టేక్స్ పరిశ్రమగా రూపాంతరం చెందింది. ప్రేక్షకుడికి ఇది రెండున్నర గంటల కాలక్షేపం అయితే, నిర్మాతకు వందల కోట్ల పెట్టుబడికి రెట్టింపు లాభం వెనక్కి తెచ్చే రేసు. ఈ రెండు దృక్పథాల మధ్య సమతుల్యత దెబ్బతిన్నప్పుడే ఈ ధరల వివాదం మొదలవుతోంది.

**సమస్య మూలాలు :** భారీ బడ్జెట్ చిత్రాల పేరుతో ధరలను పెంచడాన్ని విశ్లేషిస్తే, ఇక్కడ నాణేనికి రెండు పార్శ్వాలు కనిపిస్తాయి. అంతర్జాతీయ స్థాయి విజువల్స్, భారీ తారాగణాన్ని అందించడానికి వందల కోట్లు ఖర్చు చేస్తున్నామని నిర్మాతలు వాదిస్తారు. ఫలితంగా, పంపిణీదారులు థియేటర్ యాజమాన్యాలు మొదటి పది రోజుల్లోనే ఆ పెట్టుబడిని రాబట్టుకోవాలనే ఒత్తిడికి లోనవుతున్నారు.

?అయితే, ఒక చేదు నిజం ఏమిటంటే బడ్జెట్‌లు పెరగడానికి ప్రధాన కారణం కేవలం తెరపై కనిపించే "విజువల్ గ్రాండియరు మాత్రమే కాదు, నటీనటులు, సాంకేతిక నిపుణుల భారీ రెమ్యూనరేషన్లు కూడా. నిర్మాత తీసుకునే ఈ రిస్క్ భారాన్ని నేరుగా ప్రేక్షకులపై మోపడం ఎంతవరకు న్యాయం? భారీ బడ్జెట్ అనేది ప్రతిష్ట కోసం తీసుకునే నిర్ణయం తప్ప, అది ప్రేక్షకుల అవసరం కాదు. అగ్ర హీరోల ఇమేజ్ కోసం సామాన్యుడి జేబుకు చిల్లు పడటం నైతికంగా సమర్థనీయం కాదు. లాభాల్లో సింహభాగం కేవలం నిర్మాత,పంపిణీదారులు నటీనటులు, దర్శకుని చేతుల్లోకి వెళ్తున్నప్పుడు, ఆ ఖర్చును సామాన్య కార్మికుడి కష్టార్జితంతో భర్తీ చేయాలనుకోవడం చర్చించాల్సిన అంశం.

**ఈ ధోరణి ఎక్కడ మొదలైంది? :** దీనికి ఒక నిర్దిష్ట వ్యక్తిని బాధ్యుడిని చేయలేకపోయినా, 'భారీ చిత్రాలు' సంస్కృతి ద్వారా ఇది టాలీవుడ్‌లోకి ప్రవేశించింది. పాన్-ఇండియా సినిమాల వెల్లువతో బడ్జెట్ పరిమితులు దాటిపోవడంతో, ప్రభుత్వాల నుండి ప్రత్యేక అనుమతులు తెచ్చుకుని ధరలు పెంచడం ఒక ఆనవాయితీగా మారింది. గతంలో కేటగిరీల వారీగా స్థిరమైన ధరలు ఉండేవి. కానీ ఇప్పుడు అది లాబీయింగ్ ఆధారిత ధరల నమూనాగా మారింది. అగ్ర హీరోలు, దర్శకుల సినిమాలతో మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు మధ్యస్థ బడ్జెట్ సినిమాలకు కూడా పాకుతోంది.

**భారీ బడ్జెట్ అంటేనే గొప్పదా? :** ఒక సామాన్య ఉద్యోగి తన కుటుంబంతో కలిసి నెలకు రెండు సినిమాలు చూడలేని స్థితికి చేరుకున్నప్పుడు, ఆ పరిశ్రమ పతనం మొదలైనట్టే. నేడు భారీ బడ్జెట్ పేరుతో జరిగే ఖర్చులో ఎక్కువ భాగం కృత్రిమమైన 'హైప్ష సృష్టించడానికే పోతోంది. దీనిని రికవరీ చేయడానికి ధరలు పెంచడం అనేది ప్రేక్షకులపై మోపుతున్న 'బలవంతపు పన్ను' వంటిది. ?అధిక ధరలు మధ్య తరగతి ప్రేక్షకులను థియేటర్లకు దూరం చేసి ' ఓటిటి ' వైపు మళ్ళిస్తున్నాయి. పైగా మొదటి వారం పెంచే ఈ రేట్ల వల్ల పైరసీ కూడా పెరుగుతోంది. నేడు థియేటర్‌లో టికెట్ దగ్గర నుండి స్నాక్స్ వరకు ప్రతి రూపాయి భారం అవుతోంది. ఇక్కడ ఒక విరుద్ధమైన అంశం ఉంది: నిర్మాతలు విడుదల ముందే డిజిటల్ రైట్స్ ద్వారా వందల కోట్లు పొందుతున్నారు. అలాంటప్పుడు టికెట్ ధరలు తగ్గించి ఎక్కువ మందిని థియేటర్లకు రప్పించే ప్రయత్నం ఎందుకు జరగడం లేదు?

**పరిష్కార మార్గం :** ప్రస్తుతం బడ్జెట్‌లో దాదాపు 60 నుండి 70 శాతం కేవలం హీరోలు, దర్శకుల పారితోషికాలకే వెచ్చిస్తుండటం వల్ల ఆ భారం ప్రేక్షకులపై పడుతోంది. దీనికి బదులుగా అగ్ర నటీనటులు 'లాభాల్లో వాటా' పద్ధతికి రావాలి. దీనివల్ల ప్రాథమిక నిర్మాణ వ్యయం తగ్గి, టికెట్ ధరలను పెంచాల్సిన అవసరం ఉండదు. తక్కువ మంది ప్రేక్షకుల నుండి ఎక్కువ వసూలు చేయడం కంటే, తక్కువ ధరతో ఎక్కువ మంది ప్రేక్షకులను థియేటర్లకు చేరవేయడమే వ్యాపారపరంగా లాభదాయకం. అలాగే, ప్రతి థియేటర్‌లో కనీసం 30% సీట్లు సామాన్యులకు అందుబాటులో ఉండేలా అతి తక్కువ ధరకే విక్రయించాలనే నిబంధన ఉండాలి. **జనక మోహన రావు దుంగ, 8247045230**

# యోగి వేమన ఆదర్శరాజ్యం కోసం రెడ్లు పాటుపడాలి

భారతదేశ సాహిత్య చరిత్రలో సామాజిక రాజకీయ సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించి సమానత్వం కోసం ప్రజాస్వామ్య గణతంత్ర విలువల రక్షణ కోసం పాటుపడిన ఎందరో ప్రముఖ కవులలో మహానుభావులు యోగి వేమన సుప్రసిద్ధులు. ఇతను కడప జిల్లాకు చెందిన కవిగా చరిత్ర చెప్తున్నది, వేమన ప్రజాకవి, సంఘసంస్కర్త విప్లవకారుడు." విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటంతో వేమన రాసిన పద్యాలు తెలుగు వారికి సుపరిచితాలు. వేమన సుమారు క్రీ.శ 1367బి1478 మధ్య కాలములో జీవించాడు. వేమన ఏ కులానికి చెందినవాడు అనే దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికిని వేమన బంధు వర్గులు చెప్తున్నా వివరాలను బట్టి చూస్తే మెజార్టీగా రెడ్డి కులానికి చెందిన వ్యక్తిగా చరిత్ర బోధిస్తున్నది.జూ బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు 1839లో పుస్తకం రూపంలో తొలిసారిగా వెలుగులోకి వచ్చాయి. పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి, ప్రజల్ని వేమన మెప్పించాడు. ఆటవెలదితో అద్భుతమైన కవిత్వం, అనంతమైన విలువ గల సలహాలు, సూచనలు, విలువలు, తెలుగు సంగతులు ఇమిడ్చాడు.వేమన కాలం గురించీ, జీవితం గురించీ సి.పి. బ్రౌన్, వంగూరి సుబ్బారావు, వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి, బండారు తమ్మయ్య, ఆరుద్ర, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వేమూరి విశ్వనాథశర్మ, కొమర్రాజు వేంకటలక్ష్మణరావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఎన్. గోపి పరిశోధనలు చేశారు.

యోగి వేమన భూస్వామ్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి కాగా తన యుక్త వయసులో వైశ్యకి ఆకర్షితుడై తన యవ్వనాన్ని అంతా కూడా పాడు చేసుకున్నాడు. శృంగారం పట్ల విరక్తి చెందిన వేమన సమాజంలోని అసమానతలు పట్ల కలత చెంది, స్వయం కృషితో జ్ఞానవంతుడై యోగిగా మారి, సమాజానికి మంచి సందేశత్మక జ్ఞానాన్ని ఇచ్చాడు. భారతదేశంలో ఉన్న కుల అసమానతల కారణంగా తరతరాలుగా కులం మూలంగా సమాజంలో సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన రాకుండా కులం అడ్డుపడుతున్నదనే సత్యాన్ని గ్రహించిన వేమన కుల మత లింగ ప్రాంత వర్గ అసమానతల పట్ల విరక్తి చెంది, కలకి చెంది సంఘాన్ని సంస్కరించడం కోసం సాహిత్య మార్గం ఎంచుకొని గొప్ప పద్యాలని సమాజానికి అందించి కుల మత లింగ బేధలు లేకుండా మనుషులంతా సమానంగా స్వేచ్ఛ సమానత్వ సోదరభావ విలువలతో జీవించాలని కలలు కని వాటిని పద్యరూపంలో బోధించి అమరుడుగా చరిత్రలో నిలిచిపోయాడు.వేమన జీవిత చరిత్రకి నేటి సమకాలీన సామాజిక రాజకీయ అంశాలని జోడించి గత చరిత్ర ఆధారంగా, నేటి చరిత్రని పరిశీలిస్తూ, భవిష్యత్తు చరిత్ర గొప్పగా ఉండాలని ఒక వ్యాసకర్తగా భావిస్తున్న. అందులో భాగంగానే అసలు యోగి వేమన కలలు కన్న రాజ్యం కోసం ఏ రాజకీయ పార్టీలు కూడా ఏ ప్రభుత్వాలు కూడా కృషి చేయడం లేదు.నిజంగానే వేమన కోరుకున్న సమ సమాజం కోసం ప్రభుత్వాలు నిబద్ధతతో పనిచేస్తే కులం తన రూపాన్ని మార్చుకొని ఆధునిక యుగంలో కూడా కులం సమాజంపై ప్రభావం చూపలేదు.! కానీ ఎంతటి టెక్నాలజీ సాధించినప్పటికీ భారతీయుల మధ్య ఉన్న కుల అసమానతల మూలంగా ఉన్నత కులాలు మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ, 10% అగ్రకులాల చేత పీడిత కులాలైన 90% బీసీ ఎస్సీ ఎస్టీలు సామాజికంగా రాజకీయంగా సాంస్కృతికంగా వెనుకబాటుకి గురవుతున్నట్లుగా అనేక గణాంకాల ద్వారా నిరూపితం అవుతున్నది. అందుకు నిదర్శనమే ప్రపంచ అసమానతల నివేదిక 2026 ప్రకారం భారత దేశంలో 10% వ్యక్తుల దగ్గర 40% సంపద ఉండగా, జాతీయ ఆదాయంలో దాదాపు 60% సంపద వీళ్ళ దగ్గరే ఉన్నదని, 50% వ్యక్తుల దగ్గర 15% సంపద ఉన్నది. అందుచేతనే భారతదేశంలో కుల మత అసమానతల మూలంగా ప్రజలకి మౌలిక సదుపాయాలు కల్పనలో భారత ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నట్లుగా నిరూపణ అవుతుంది.భారతదేశానికి స్వాతంత్రం, గణతంత్రాన్ని సాధించుకొని 75 వసంతాలు పూర్తి అవుతున్న కూడా మరి ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం నాలుగు నుండి ఐదు శాతం ఉన్న రెడ్ల ఆధిపత్యమే సామాజికంగా రాజకీయంగా ఎక్కువగా ఉన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మెజార్టీగా రెడ్డి కులాల నుండి అత్యధికంగా ముఖ్యమంత్రులు అయ్యారు. నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కూడా పార్టీలకతీతంగా దాదాపుగా 43 మంది రెడ్డి ఎమ్మెల్యేలు ఉండగా, అత్యధిక కార్పొరేషన్లు కూడా రెడ్డి సామాజిక వర్గ వ్యక్తులే భర్తీ చేశారు. కానీ ఒకపక్క కాంగ్రెస్ పార్టీ నుండి ముఖ్యమంత్రి అయినటువంటి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పేరుతో ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా పరిపాల కొనసాగిస్తానని అనేక సందర్భాల్లో చెబుతు, చట్టం అమలులో ఆచరణలో మాత్రం రేవంత్ రెడ్డి పక్కా రెడ్డి సామాజిక వర్గాలకి మేలు చేసేలా పాలన కొనసాగించడం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలని కూని చేయడమే. రేవంత్ రెడ్డి పిసిసిగా ఉన్న సందర్భంలో ఏ రాజకీయ పార్టీ ఐన మనుగడ కొనసాగించాలంటే రెడ్లకి ఆయా పార్టీల పగ్గాలని ఒప్పు చెప్పాలని, రెడ్లకు మాత్రమే పాలన కొనసాగించే శక్తి ఉన్నదని బహిరంగంగా చెప్పడం రేవంత్ రెడ్డి ఒక రెడ్డి ధర్మ ప్రచారక్ ప్రవర్తించడం అసమానత విలువలకి పెంచి పోషించడంతో సమానం. కానీ ఇక్కడ రెడ్లు గ్రహించాల్సిన చారిత్రక సత్యం ఏంటంటే భారతీయ హిందూ కుల వ్యవస్థలో రెడ్లు కూడా శూద్రులే అని గ్రహించాలి. భారత స్వాతంత్రానికి ముందు నిజాం నవాబు పరిపాలన కాలంలో భూమిశిస్తు వసూలు చేసే అధికారులుగా ఉంటూ, ఇంకా ప్రముఖ ఉన్నత ఉద్యోగ స్థానాల్లో ఉంటూ నిజాం నవాబుల అండుదండలతో రెడ్లు అత్యధిక వ్యవసాయ భూములను ఆక్రమించుకోగలిగారు. అంతేకానీ ప్రకృతి ప్రసాదించినటువంటి భూమి ఏ ఒక్క కులాల ఆధీనంలో ఎక్కువగా ఉండకూడదు, ప్రతి తలకి భారతీయ భూమిలోను సంపదలోను రాజ్యాధికారం లోను సమాన వాటా ఉండడమే స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యానికి నిదర్శనం, అదే యోగి వేమన రెడ్డి కోరుకున్నది..!



**వ్యవసాయ భూమిని కల్పించి సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తనను సాధించాలి, అదే యోగి వేమనకి నేడు రెడ్డి పాలకులు ఇవ్వాల్సిన ఘనమైన నివాళి**

స్వాతంత్రానంతరం అగ్రకుల బ్రాహ్మణుల సహకారంతో రెడ్లు సామాజికంగా రాజకీయంగా బలాన్ని పుంజుకొని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తమ ప్రాబల్యాన్ని చూపగలుగుతున్నారు. కానీ గ్రామీణ వ్యవస్థలో వాస్తవంగా ఉండే సత్యం ఏంటంటే నిరుపేద కులానికి చెందిన రెడ్లు ఐన కుటుంబాలకి, ధనికులైన రెడ్లు ఆ పేద కుటుంబ రెడ్లని తక్కువగా చూడడం అనేది నేడు సమాజంలో ఉన్న బహిరంగ సత్యం. శుభ అశుభ కార్యక్రమానికి ధనికులైన రేట్లు ఒకే సామాజిక వర్గానికి చెందిన పేద రెడ్లకి శుభ అశుభ ఆహ్వాన పత్రికలు ఇవ్వడానికి కూడా ఆలోచిస్తారు.? అంటే కుల వ్యవస్థ ఒకే కులాన్ని కూడా పేద ధనిక వర్గాలుగా విభజిస్తది అని చెప్పడానికి నిదర్శనం. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఫౌండర్ ఐన డా. విశారదన్ మహారాజ్ యోగి వేమన రెడ్డి తనకు ఆదర్శమంటూ వారు కోరుకున్న సమ సమాజం కోసం దశాబ్ద కాలంగా సామాజిక రాజకీయ సాంస్కృతిక విప్లవాన్ని కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే ధనిక రెడ్లు నిరుపేద రెడ్ల బ్రతుకులు మార్చారని, నిరుపేద రెడ్లు పీడిత కులాలైన బీసీ ఎస్సీ ఎస్టీల నాయకత్వంలో పనిచేయడం మూలంగా పేద రెడ్ల బ్రతుకులు కూడా ఉన్నతంగా మారుతయాని నూతన విప్లవాత్మక సామాజిక రాజకీయ విలువలకి విశారదన్ మహారాజ్ జీవం పోస్తున్నారు. కాబట్టి అంతిమంగా యోగి వేమన స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణలోని రెడ్డి నాయకులు సమాజంలో అత్యంత అంటరానితననికి గురైన మాదిగ కులానికి చెందిన నాయకులైన విప్లవకారుడైన విశారదన్ మహారాజ్ లాంటి గొప్ప నాయకులని కలుపుకుంటూ వేమన కోరుకున్న ఆదర్శవంతమైన స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి, ఎలాంటి కుల మత భేదాలు లేని సమాజాన్ని నిర్మించడానికి, శూద్రులైన బీసీలతో పంచములైన ఎస్సీ సామాజిక వర్గం కుటుంబంతో ఆదివాసీలతో సహపంక్తి భోజనాలు చేస్తూ, కుల భేదాలని అంతం చేసేలా ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ లని ప్రోత్సహిస్తూ నేటి సమకాలీన రెడ్డి పాలకులు కృషి చేయాలి.

అందులో భాగంగానే 75 సంవత్సరాల స్వాతంత్ర భారతంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా రెడ్డి సామాజిక వర్గం నుండి ముఖ్యమంత్రులు అయినప్పటికీ ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనలో ఘోరంగా విఫలం అవ్వడం మూలంగానే నేడు పేదరికంలో ఎక్కువగా 90% బీసీ ఎస్సీ ఎస్టీలే ఉండడం, 5% లోపు అగ్రకుల పేదలు ఉండడం గమనార్హం.! ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగం ప్రకారం జనాభా దామాషా ప్రకారం అన్ని సామాజిక వర్గాలకు రాజ్యాధికారంలో సంపదలో భూమిలో సమస్త రంగాల్లో సమాన వాటా ఉండాలి. కాబట్టి ఇకపై రెడ్డి పాలకులు ఆదిపత్య ప్రాబల్యాన్ని వదులుకొని ప్రజాస్వామ్య వాదులుగా పరివర్తన చెంది, సమానత్వం కోసం సామాజిక న్యాయం కోసం ప్రజాస్వామ్య రక్షణ కోసం యోగి వేమన రెడ్డి స్ఫూర్తితో బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులతో మమేకమై ప్రజలకి మౌలిక సదుపాయాలైన ఉచిత విద్యని ఉచిత వైద్యాన్ని ఉచిత ఉపాధిని సౌకర్యవంతమైన ఇల్లుని సాగు చేసుకుని బ్రతకడానికి తగిన వ్యవసాయ భూమిని కల్పించి సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తనను సాధించాలి, అదే యోగి వేమనకి నేడు రెడ్డి పాలకులు ఇవ్వాల్సిన ఘనమైన నివాళి అని మేధావులు విద్యావంతులు సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.!



**పుల్లెంల గణేష్**
**(సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)**
**9553041549**

# హాకీ క్రీడకు తెలంగాణ రాష్ట్రం హబ్‌గా మారాలి

**• పిఏసి చైర్మన్ అరికెపూడి**



**శేరిలింగంపల్లి, జనవరి 18 (జనంసాక్షి) :** ప్రపంచ ప్రధాన క్రీడలలో ఒకటైన హాకి క్రీడకు దేశంలో అత్యున్నత స్థానం ఉందని, ఈ తరుణంలో అంతర్జాతీయ హాకి క్రీడా పోటీలకు హైద్రాబాద్ గచ్చిబౌలి వేదిక కావడం ఏంతో గర్వ కారణం అని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో తెలంగాణ హాకీ సంఘం అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్రంలో హాకి క్రీడా గణనీయమైన పురోగతిని సాధించిందని, రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల నుంచిసైతం వివిధ స్థాయిలలో క్రీడాకారులు ఎంపిక కాబడి అత్యుత్తమ శిక్షణతో రాటుదేలుతున్నారని అన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిధి గచ్చిబౌలి ప్రాంతం అంతర్జాతీయ హాకి క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం చాలాగొప్ప విషయం అని వారు హర్షం వ్యక్తంచేశారు. గచ్చిబౌలి స్టేడియం అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం ఇది ప్రప్రథమం కాకపోయినా... హాకి క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం ఇదే ప్రథమమని, ఇది తప్పకుండా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నామన్నారు. అంతర్జాతీయ పోటీలకు గచ్చిబౌలి వేదిక అవడం ద్వారా ఈ ప్రాంత ప్రజా ప్రతినిధిగా, రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ గా తన బాధ్యత మరింత పెరిగిందని, తప్పకుండా తన వంతు సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తానని అరికపూడి ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ ఏడాది మార్చి 8 నుండి 14 వ తేది వరకు గచ్చిబౌలి స్టేడియంలో హాకి క్రీడలో వరల్డ్ కప్ పోటీలను నిర్వహించనున్న నేపథ్యంలో తెలంగాణ హాకి క్రీడాసంఘం అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ తో కలిసి స్టేడియం ను సందర్శించడం జరిగిందని అరికపూడి వివరించారు. ఇండియాతోపాటు అస్ట్రేలియా, ఇంగ్లాండ్, వెల్స్, ఉరేగ్వే, స్కాట్లాండ్, కొరియా, ఇటలీ తదితర దేశాలు పోటీలలో పాల్గొనున్నట్లు అరికపూడి కొండా విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పోరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పాత క్వార్టర్ల స్థానంలో నూతన క్వార్టర్ల నిర్మాణం

**• నాలుగవ బెటాలియన్‌లో క్వార్టర్స్‌ను ప్రారంభించిన డిజిపి శివధర్ రెడ్డి**



**వరంగల్ బ్యూరో, జనవరి 18 (జనం సాక్షి) :** నగరంలోని మామునూర్ నాల్గవ బెటాలియన్ నందు పోలీస్ అధికారులకు, సిబ్బందికి నూతనంగా నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ (నివాస గృహాలు) ను ఆదివారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి శివధర్ రెడ్డి, బెటాలియన్ల అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీజీపీకి కమాండెంట్ డి శివప్రసాద్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అధునాతన వసతులతో నిర్మించిన ఈ నివాస సముదాయంలో అసిస్టెంట్ కమాండెంట్స్ క్వార్టర్స్-3, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ క్వార్టర్స్-2, రిజర్వ్ సబ్-ఇన్‌స్పెక్టర్ క్వార్టర్స్-2, కానిస్టేబుల్ అండ్ హెడ్ కానిస్టేబుల్ క్వార్టర్స్-12 ఉన్నాయి. బెటాలియన్ ప్రాంగణంలో డీజీపీ రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం క్వార్టర్లలో కల్పించిన సౌకర్యాలను స్వయంగా పరిశీలించి, నాణ్యత విషయంలో రాజీ పడకుండా తక్కువ వ్యయంతోనే మెరుగైన వసతులు కల్పించిన అధికారులను అభినందించారు. పోలీసు సిబ్బంది విధుల నిమిత్తం తమ కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని, వారికి మెరుగైన నివాస సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని డీజీపీ అభిప్రాయపడ్డారు. బెటాలియన్‌లో శిథిలావస్థకు చేరిన పాత క్వార్టర్ల స్థానంలో నూతన క్వార్టర్ల నిర్మాణం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస రావు, వీరన్న, పోలీస్ ఉన్నతాధికారులు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐ లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయానికి కొత్త భాష్యం చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్



**కుత్బుల్లాపూర్, జనవరి 18 (జనం సాక్షి) :** కేవలం సినీ రంగమే కాకుండా రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇచ్చిన గొప్ప నేత నందమూరి తారక రామారావని కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కటకం జయరాం అన్నారు.ఆదివారం ఎన్టీఆర్ 30 వ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిది ఆదర్శ్ నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తంగా లక్ష్మా రెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు సింహాద్రి కనకాచారి మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు తోపాటు హాలో టిడిపి శ్రేణులతో కలిసి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొడ్డు అశోక్ రావు,ఎం.నర్సింగ్ రావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించాలి



**మహేశ్వరం, జనవరి 18 (జనం సాక్షి) :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు.ఆదివారం మహేశ్వరం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు.అనంతరం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మహేశ్వరం సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను రోడ్డు భద్రతను పాటించాలన్నారు.ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయకూడదన్నారు.వాహనాలను అతివేగంతో నడపడం,సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపకూడదన్నారు.మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నయన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే లైసెన్స్ రద్దు,జరిమాన,జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు.ప్రతి ఒక్కరికి లైసెన్స్,ఇన్సూరెన్స్ ఉండాలన్నారు.మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు.ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతను పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వరరావు,ఎస్ఐ పాండు,ఎస్ఐలు ప్రసాద్, రాఘువేంద్ర,ధనుంజయ్,పోలీసులు,వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి భారతీయుడికి అంబేద్కర్ ఆరాధ్యుడు

**• అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య**



**బోడుప్పల్, జనవరి 18 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 361వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా ఐద్వా అధ్యక్షురాలు సృజన పాల్గొని అంబేద్కర్ కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి ఫలితంగానే భారతీయులందరికీ స్వేచ్ఛ, సమానత్వంతో ఓటు హక్కు హక్కుతోపాటు మహిళలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని, ఆయన త్యాగ ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాలలో మగవారితో సమానంగా రాణిస్తున్నారని, ఇలాంటి తరుణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ఒక వర్గానికో, ఒక కులానికో చెందిన వ్యక్తిగా చూడడం మానుకోవాలని, ప్రతి భారతీయుడికి అంబేద్కర్ ఆరాధ్యుడని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒకరి బాధ్యత అని ఆమె అన్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలితంగా ఉద్యోగాలు పదవులు, అనుభవిస్తు కూడా కొందరు అంబేద్కర్ ను ఒక కులానికి పరిమితం చేయడం సిగ్గుచేటని, అంబేద్కర్ కొందరి వాడు కాదని అందరివాడు అని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, రఘు రూపుల మల్లేష్, బండారి సాయి, జై భీమ్ అజయ్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలి



**యాచారం, జనవరి 18 (జనం సాక్షి) :** యాచారం మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నవీన్ రెడ్డి యువసేన అధ్యర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పోటీలలో మెరుగైన ప్రతిభను కనబరచాలన్నారు. క్రీడలతో స్నేహభావం, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని, క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. క్రీడలు ఆడటం వల్ల అనేక రుగ్మతలు తొలగిపోతాయని అన్నారు. క్రీడల వల్ల స్నేహ,సంబంధాలు పెరుగుతాయని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్,గంజాయి, చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని సూచించారు. యువత క్రీడలవైపు ఆసక్తి చూపుతూ క్రీడల్లో రాణించి, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కేశమోని రాజు, ఉప సర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు, ఆర్గనైజర్స్ కొమ్ము సురేష్, ఆనంద్, రాజు, కృష్ణా రేడ్డి, క్రికెట్ ప్లేయర్స్ పాల్గొన్నారు.

# నార్సింగిలో ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం



**రాజేంద్రనగర్, జనవరి 18 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, నార్సింగి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం శ్రీ మల్లికార్జున స్వామి సహిత కేతకి భ్రమరాంబ అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ సభ్యుడు, ఆలయ నిర్మాణకర్త, మాజీ సర్పంచ్ గండిపేట మండల మాజీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం సాయంత్రం గంగతెప్ప, ఆదివారం ఉదయం గణపతి పూజ, గణపతి హవనం, రాత్రి అగ్ని గుండాలు, గొలుసు తెంపుట, సౌడమ్మ బోనాలు, మల్లన్న ఒగ్గు కథ వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కళ్యాణ మహోత్సవానికి మాజీ సర్పంచ్ అశోక్ యాదవ్ దంపతులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం నాగవల్లి, మంగళవారం ఉదయం ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం కూడా ఘనంగా జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్, జెల్లి వెంకటేష్ ముదిరాజ్, కిరణ్, మాజీ ఎంపీటీసీ సాయి ముదిరాజ్, రాజీవ్ గాంధీ ముదిరాజ్, దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ముగిసిన కేరెల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-1



**వికారాబాద్, జనవరి 18 (జనంసాక్షి) :** 2026 సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా ధారూర్ మండలంలోని కేరెల్లి యువత, కేరెల్లి ప్రీమియర్ లీగ్ సీజన్ - 1 నిర్వహించడం జరిగింది. ఇందులో మొత్తం 8 జట్లు పాల్గొనగా విజేతలుగా నిలిచిన మొదటి బహుమతి గణపతి రెడ్డి టీం, రెండవ బహుమతి ఇంద్ర రెడ్డి టీం లకు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు, యువత విద్యతో పాటు, వ్యాపార, ఉద్యోగ రంగాల్లో రాణించాలని, వృత్తిరీత్యా ఏ రంగంలో రాణించిన క్రీడలు అనేవి జీవితంలో ఎదురయ్యే గెలుపు ఓటములను స్వీకరించి ఎలా ముందుకు వెళ్లాలో జీవిత పాఠ్యాంశాన్ని నేర్పిస్తాయని, శారీరక దృఢత్వంకు ఉపయోగకరంగా ఉంటాయని, గ్రామంలోని మరియు చుట్టుపక్కల గ్రామాల యువత అంతా స్నేహపూర్వకంగా ఎలా మెసులుకోవాలో మంచి స్నేహపూర్వక వాతావరణాన్ని అలవాటు చేస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడలను ఆదరిస్తూ ప్రోత్సహించాలన్నారు, కేరెల్లి గ్రామంలో ఈ సీజన్ 1 విజయవంతంగా సాగడానికి సహకరించిన కొత్తపల్లి విజయ భాస్కర్ రెడ్డి, కొత్తపల్లి జగన్నాథ్ రెడ్డి, కొత్తపల్లి నరసింహ రెడ్డి, కుంచారం హరిప్రసాద్ రెడ్డి, బాపనొల్ల మహేందర్ రెడ్డి, బాపనొల్ల మహిపాల్ రెడ్డి లకు అభినందనలు తెలిపారు, ఈ కార్యక్రమానికి అతిథులు గా హాజరైన అంపల్లి బాలకృష్ణ, సింగం హరికృష్ణ లకు సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వికారాబాద్ జిల్లాలో గంజాయి కలకలం

**• మోమిన్‌పేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో గంజాయి పట్టివేత**



**మోమిన్‌పేట, జనవరి 18 (జనం సాక్షి) :** జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సరఫరా మరియు సాగు చేస్తున్న వ్యక్తులు. పసుపు, కంది సాగులో గంజాయి మొక్కలను పెంచుతున్నారన్న సమాచారం మేరకు వికారాబాద్ డిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది, ఎక్సజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పంటచేల్లలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పసుపు, కంది పంటలో 2.572 కేజీల ఎండు గంజాయి లభించింది. పంట చేలలో గంజాయిని పండిస్తున్న రైతులకు రైతుబంధును నిలిపివేయాలని వికారాబాద్ ఎక్సైజ్ సూపర్డెంట్ విజయ భాస్కర్ గౌడ్ కలెక్టర్‌కు లేఖ రాశారు. మోమిన్ పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్పల్లి మండలం కుడుగుంట గ్రామంలో బోయిని రవి అనే వ్యక్తి తమ పంట పొలంలో గంజాయి మొక్కలను పెంచుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా కంది,పసుపు పంటలో ఈ గంజాయిని పండిస్తున్న సమాచారం మేరకు ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఏపుగా పెరిగిన కొన్ని గంజాయి మొక్కల నుంచి గంజాయిని తీసి పసుపు కంది పంటలో ఎండబెట్టినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ దాడిలో ఏఈఎస్ శ్రీనివాసరెడ్డి, డిటిఎఫ్ సిఐ కె.శ్రీనివాస్,ఎస్సై రేఖ డీటీఫ్ వికారాబాద్ సిబ్బంది మోమిన్ పేట్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# చలో ఖమ్మం శతాబ్ది ఉత్సవాలను సీపీఐ జయప్రదం చేయాలి

**• సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే.రామస్వామి**



**చేవెళ్ల, జనవరి 18 (జనంసాక్షి) :** చలో ఖమ్మం శతాబ్ది ఉత్సవాలను సిపిఐ జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే.రామస్వామి అన్నారు. సిపిఐ పార్టీ భారీ బహిరంగ సభకు విచ్చేయుచున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీ100 వసంతోత్సవ వారోత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు చేవెళ్ల నియోజకవర్గం సిపిఐ పార్టీ శ్రేణులు బయలుదేరారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే.రామస్వామి చలో ఖమ్మం శతాబ్ది ఉత్సవాలను సిపిఐ జయప్రదం చేయాలని చేవెళ్ల నుంచి నియోజకవర్గం సీపీఐ కార్యకర్తలు బయలుదేరుతున్న సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజవర్గం ఇంచార్జ్ కే.రామస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులఅబ్రశ్రీ ఎం.ప్రభు లింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో బయలుదేరుతున్న బృందానికి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ కే.రామస్వామి చలో ఖమ్మం కు బయదేరే వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సిపిఐ 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల చరిత్ర గలిగిన పార్టీ అని వారు పేర్కొన్నారు. సిపిఐ పార్టీ భారీ బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీ100 వసంతోత్సవ వారోత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు హాజరవుతారని తెలిపారు. చేవెళ్ల నుంచి నియోజకవర్గ నుంచి ఐదు మండలాల పరిధిలోని సిపిఐ నాయకులు, మండల కార్యదర్శులు, చేవెళ్ల మండల కార్యదర్శి మల్గారి సత్తిరెడ్డి, షాబాద్ కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, మొయినాబాద్ మండల కార్యదర్శి కే.శ్రీనివాస్, శంకర్ పల్లి మండల కార్యదర్శి సుధీర్, జీకేఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం.సుధాకర్ గౌడ్, సుబ్బారెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, జిల్లా మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, జనసేన కార్యకర్తలు గ్రామ కార్యదర్శులు ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు కర్షకులు, రైతులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఖమ్మం బయలుదేరారు.

## బొంరాస్ పేట పెద్ద చెరువు సమీపంలో పర్యాటక శోభ

**బొంరాస్‌పేట, జనవరి 18 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని హైదరాబాద్ బీజాపూర్ 163వ జాతీయ రహదారి పక్కన అటవీ ప్రాంతంలోని చెరువు సమీపంలో రూ.10 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఏకో అర్బన్ టూరిజం పార్కు పనులలో భాగంగా ఒక గజేబో ( గుడిసెల మాదిరిగా ఉండేవి) పూర్తి కావడంతో పర్యాటకుల సందడి రోజు రోజుకు పెరుగుతుంది.ఆదివారం సెలవు దినం కావడంతో ఆయా గ్రామాలకు చెందిన పర్యాటకులు కుటుంబ సమేతంగా వచ్చి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.మరోవైపు పెద్ద చెరువులో సోలార్ సహాయంతో వాటర్ స్పోర్ట్స్ ప్రారంభించడంతో పర్యాటకులు అటువైపు సందడి చేస్తూ కనిపించారు.రానున్న రోజుల్లో మరొక్క గజేబో,ఏకో టూరిజం పార్కు ఏర్పాటు చేసి ఈ సందర్శకులు నడవడానికి వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం,మరిన్ని నిర్మాణాలు చేపట్టి ఆహ్లాదకరంగా మార్చేందుకు సిద్ధం చేస్తున్నారు.



# అక్రమ మైనింగ్ దందాపై మెరుపుదాడులు

- కొనసాగుతున్న కూల్చివేతలు, వాహనాల స్వాధీనం
- స్వాధీనం చేసుకున్న వాహనాలపై మొక్కుబడిగా జరిమానాలు



**న్యాల్‌కల్, జనవరి 18 (జనం సాక్షి) :** జిల్లాలోనే అక్రమ మైనింగ్ మాఫియా దందాకు అడ్డాగా మారిన మండలాలు న్యాల్ కల్, జిన్నారం, జహీరాబాద్. న్యాల్ కల్ మండలంలోని గణేష్ పూర్, హద్నూర్, మల్గి, మిర్జాపూర్ (ఎన్), రేజింతల్, మల్కంపాడ్, న్యామతాబాద్, గ్రామాల శివారులోని పట్టా, ప్రభుత్వ, అసైన్డ్, జాతీయ ఉత్పాదక మండలి (నిమ్జ్)కు కేటాయించిన వేలాది ఎకరాల్లో రేయింబవళ్లు అక్రమ దందాను కొనసాగిస్తూనే ఉంటారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ నేతల కనుసైగలోనే మైనింగ్ మాఫియా దశాబ్దల కాలంగా కొనసాగుతూనే ఉంది. తరచుగా మైనింగ్, రెవెన్యూ, నిమ్జ్ శాఖలకు చెందిన జిల్లా, మండల అధికారుల బృందం పోలీస్ ల సహకారంతో దాడులు చేయడం, జరిమానా విధించడం, మొక్కుబడిగా జరిమానా విధించి వదిలేయడం మండలంలో శర మామూలుగా మారింది. అక్రమ దందాపై పలువురు స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్తులు, యువకులు పలుమార్లు ఫిర్యాదు చేసిన అక్రమ దందాను పూర్తిస్థాయిలో అడ్డుకోవడంలో మైనింగ్, రెవెన్యూ శాఖ విఫలం అయ్యారని ఆరోపణలు వెల్లు వెత్తుతూనే ఉన్నాయి. అంతర్ రాష్ట్ర వాహనాలు, సరైన పత్రాలు లేని వాహనాల్లో అక్రమంగా రవాణా కొనసాగిస్తున్న నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో కట్టడి చేయడంలో అధికారుల బృందం విఫలమయ్యారనే ఆరోపణలు బాహటంగానే వెల్లువిరుస్తున్నాయి.

**వారం రోజుల వ్యవధిలో దాడులు, కూల్చివేతలు....**

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం మండలంలో కొనసాగుతున్న అక్రమ దందా, మైనింగ్ మాఫియాపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్ అధికారుల బృందం తాజాగా వారం రోజుల వ్యవధిలో పలుచోట్ల దాడులు చేసి కూల్చివేతలు, పలు వాహనాల స్వాధీనం, కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వారం రోజుల క్రితం మండలంలోని గుంజేట్టి, శంషాల్లాపూర్ గ్రామ శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. జేసిబీ, టిప్పర్ ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం స్థానిక తహసిల్దార్ ప్రభు టిప్పర్ పై రూ:10000 జరిమాన విధించారు. ఈ నెల 16న కేఏ56 /5698, టీఎస్ 15 విఏ/8620 రెండు లారీల్లో గణేష్ పూర్ నుండి ఇతర ప్రాంతానికి ఎర్రరాయిని తరలిస్తుండగా స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఎర్రరాయిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎర్రరాయిని తరలిస్తున్న వాహనాల పత్రాల పరిశీలన అనంతరం రెవెన్యూ అధికారుల ఆదేశం మేరకు చర్యలు చేపట్టనున్నట్లు స్థానిక ఎస్సై సుజిత్ తెలిపారు. ఈ నెల15న మండలంలోని హద్నూర్ గ్రామ శివారులోని జాతీయ ఉత్పాదక మండలికి చెందిన సర్వే నెంబర్ 145 లోని 3.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు స్వాధీనం చేసుకొని గుంటలు, ప్లాట్లుగా మార్చి దందా కొనసాగిస్తున్నారు. రూ: కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని దాదాపు మీ సంవత్సరాలుగా అక్రమార్కులు దందా కొనసాగిస్తున్నారు. ఇండ్ల నిర్మాణాల కోసం పనులను సైతం ప్రారంభించారు. ఇటీవల స్థానిక గ్రామానికి చెందిన పలువురు యువకులు తహసిల్దార్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, నిమ్జ్, గ్రామ పంచాయతీ అధికార బృందం స్థానిక పోలీసులతో కలిసి దాడులు చేసి తాత్కాలికంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చి వేశారు. తరచుగా మండలంలో కొనసాగుతున్న అక్రమ దందాపై దాడులు, కూల్చివేతలు, వాహనాల స్వాధీనం, కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగడంతో అక్రమార్కుల్లో భయాందోళన మొదలైంది.

## శ్రీతిమ్మప్ప స్వామి దేవాలయంలో పోటెత్తిన భక్తులు



**మల్దకల్, జనవరి 18 (జనంసాక్షి) :** కోరిన కోరికలు తీర్చే కలియుగ ప్రత్యక్ష దైవం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య రావడంతో వేలాది మంది భక్తులు క్యూలైన్ ద్వారా శ్రీతిమ్మప్ప స్వామిని దర్శించుకున్నారు. దేవాలయంలో ఉదయం అభిషేకాలు అర్చనలు అనంతరం ఆలయ అర్చకులు వాల్మీకి పూజారులు భక్తులకు స్వామివారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేశారు. అమావాస్య సందర్భంగా దేవాలయ ఆవరణలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర హరికథను ప్రముఖ భాగవతార్ ఆంజనేయులు ఆలపించగా తమల బండలయ్య హార్మోని సుధాకర్ సహకారం అందించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు గద్వాల కాకతీయ టెక్నో స్కూల్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, రాత్రి భక్తులకు శాంతినగర్ శివ శివాని స్కూల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర రావు, బాబురావు, సీతారాం రెడ్డి, తాటికుంట రామచంద్రారెడ్డి, నరేందర్ చంద్రశేఖర్ రెడ్డి,రాముడు, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ శతాబ్ది ఉత్సవాల సభకు తరలిన చేర్యాల నాయకులు



**చేర్యాల, జనవరి 18 (జనంసాక్షి) :** సీపీఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్సార్అండ్ బీజీఎన్ ఎస్ఆర్ కళాశాల మైదానంలో జరిగే సిపిఐ వందేళ్ల ఉత్సవాల బహిరంగ సభకు ఆదివారం చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల నుండి వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు. భారతదేశ గడ్డపై కమ్యూనిస్టు పార్టీకి వందేళ్ల సుదీర్ఘమైన పోరాటాల చరిత్ర సిపిఐ కి మాత్రమే దక్కిందన్నారు. రాబోయే భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలను పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఈ సభలు ఎంతగానో దోహదపడతాయని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ తెలిపారు. ఈ సభలకు ఐదు లక్షల మంది కార్యకర్తలు, 40 దేశాల అగ్ర నాయకులు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. తరలి వెళ్లిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, వలబోజు నరసింహాచారి, కత్తుల భాస్కర్ రెడ్డి, నంగి కనకయ్య, సుకోజు రజిత, కత్తుల జానకి, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, ఎగుర్ల ఎల్లయ్య, బంగారు ప్రేమ్ కుమార్, జి. నర్సయ్య, సత్తయ్య, మల్లేశం, నర్సిరెడ్డి, యాదగిరి, శ్రీకాంత్, మహేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# కష్టజీవులకు ప్రశ్నించటం, పోరాటం నేర్పిందే ఎర్రజెండా నేతలు



**వనపర్తి బ్యూరో, జనవరి 18 (జనంసాక్షి) :** దేశంలో శ్రమజీవులకు ప్రశ్నించటం , పోరాడటం,సాధించటం నేర్పిందే ఎర్రజెండా అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. ఆదివారం ఖమ్మం లో సిపిఐ వందేళ్ళ ఆవిర్భావ పండుగకు వనపర్తి టౌన్ పానుగల్ వీపనగండ్ల మండలాల నుంచి కార్యకర్తలు నేతలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వనపర్తి అంబేద్కర్ చౌక్ లో మాజీ సర్పంచ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ జండా ఊపి బస్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నోరులేని పేదల పక్షాన వారి గొంతుకగా సిపిఐ పనిచేస్తుందన్నారు.డిసెంబర్ 26, 1925 లో భారత గడ్డపై సిపిఐ ఆవిర్భవించి డిసెంబర్ 26, 2025 వరకు 100 ఏళ్ళు పూర్తి చేసుకొని 101వ ఏడాదిలోకి అడుగుపెట్టిందన్నారు. స్వాతంత్రం కోసం తెలంగాణ యూత్ కోసం ప్రత్యేక రాష్ట్రానికి కోసం అనేక పోరాటాలను ఉద్యమాలను చేపట్టి విజయాలను సాధించిందన్నారు. పోరాటానికి చిరునామా సిపిఐ ఎర్రజెండా, ఎన్నో పోరాటాలు ఉద్యమాలతో కష్టజీవులకు ఎన్నో హక్కులను చట్టాలను సాధించిందన్నారు. కష్టం కలిగిన కార్మికుడికి అన్యాయం జరిగిన పేదవాడికి సిపిఐ అండగా నిలుస్తూ వస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో బయట పేదల పక్షాన పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. అన్యాయం జరిగితే ప్రశ్నించాలని, హక్కుల కోసం పోరాడాలని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని చరిత్రలో సిపిఐ నిరూపించిందన్నారు. పేదల కోసం వందేళ్లుగా పోరాడుతున్న చరిత్ర దేశంలో సిపిఐ కి మాత్రమే ఉందని, అలాంటి పార్టీ శతాబ్ది ఉత్సవాలు ఖమ్మంలో జరుగుతున్నాయని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గత పోరాటాలను సాధించడం చేయాలని సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ ఖమ్మం సభలో తీసుకుంటారన్నారు. సిపిఐ ఎర్ర జెండా కింద ప్రజలు ఏకమై కాంగ్రెస్ బిజెపి ఇచ్చిన హామీల అమలుకై పోరాడాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ , శ్రీరామ్ ,పానగల్ మండల కార్యదర్శి దంగు కుర్మయ్య, వీపనగండ్ల మండల కార్యదర్శి ఎం కుర్మయ్య ,వార్డు సభ్యులు సుజాత దంగు లక్ష్మి ,సహదేవ్ ,మాజీ ఉప సర్పంచ్ బాలస్వామి, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణ, కాకం చిన్న నారాయణ,రమణ, పెద్ద హనుమంతు, కుర్వ హనుమంతు,వంశీ, శివ, కాశన్న, ఎలగోడ్డు రాముడు,మహిళా నేతలు జయమ్మ, శిరీష, జయశ్రీ, పావని, వెంకటమ్మ, లావణ్య, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## యువకులు క్రీడల పై ఆసక్తి పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి



**మెదక్, జనవరి 18 (జనం సాక్షి) :** యువకులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం కోనాపూర్ గ్రామంలో కోనాపూర్ ప్రీమియర్ లీగ్ 2 క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు టాస్ వేసి ఎమ్మెల్యే బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా కోనాపూర్ గ్రామ సర్పంచ్ మోత్కు నిర్మల మల్లేశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ క్రీడలతో యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. కొల్చారం మండలంలో క్రీడలను ప్రోత్సహించే యువ నాయకుల కృషి అభినందనీయమన్నారు. యువత, ఉద్యోగస్తులు ఆన్లైన్ మోసాల పట్ల ఆకర్షితులు కాకుండా క్రీడలు దోహదం చేస్తాయన్నారు. కోనాపూర్‌తో పాటు మండల వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు కొల్చారం మండలం బిఆర్ఎస్ యువత అధ్యక్షుడు సంతోష్ రావు కృషి చేయడం పట్ల ఎమ్మెల్యే హర్షత్రేఖాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌర్శంకర్ గుప్తా, మండల టిఆర్ఎస్ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, పైత్తర సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు దొడ్ల ఆంజనేయులు, మోత్కు నిర్మల మల్లేశం, పుర్ర కాంతమ్మ ప్రభాకర్, మాజీ జెడ్పిటిసిలు శ్రీనివాస్ రెడ్డి, ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ మురళీధర్ రావు, మాజీ ఉపసర్పంచ్ సుకన్య మధుసూదన్ రెడ్డి, విజయ నర్సింలు, మాజీ సర్పంచ్ రమేష్ గ్రామ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భాగయ్య, నర్సాపూర్ మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమామహేశ్వరాలయంలో వైభవంగా మౌని అమావాస్య వేడుకలు



**మక్తల్, జనవరి 18 (జనంసాక్షి) :** మౌని అమావాస్య పర్వదినం సందర్భంగా మక్తల్ పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో వెలిసిన శ్రీ ఉమామహేశ్వరాలయం లో అమావాస్య వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు సిద్ధరామయ్య స్వామి, మహేష్ స్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటల నుండి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు చేయించి మొక్కలు చెల్లించుకున్నారు. అభిషేకం విశేష పూజలు అనంతరం స్వామివారికి విశేష అలంకరణ గావించారు. అలంకరణ అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహించారు. తదుపరి మహా మంగళహారతి అనంతరం దాసరి రాములు దంపతులు అన్నదాన కర్తలుగా వ్యవహరించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.ఆంజనేయులు సూర్య, చిన్న కృష్ణయ్య, పోలేపల్లి అనంత కుమార్, నారాయణ రెడ్డి, జానమొల్ల పాపిరెడ్డి, నవీన్, పి .నాగరాజు, సివి.నాని, పెద్ద వెంకటయ్య, వంశీ, రవి, గుడిగండ్ల నర్సింహారెడ్డి, బి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం, శ్రీ బాలాంజనేయ స్వామి దేవాలయం, శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం, శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద గ్రామ దేవత శ్రీ మారెమ్మ దేవాలయం వద్ద కూడా అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి.

## సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్ 2026కు అన్ని ఏర్పాట్లు

- 19 నుంచి 23 వరకు సైన్స్ ఫెయిర్
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 18 (జనం సాక్షి) :** దక్షిణ భారతదేశంలో విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ – 2026కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈనెల 19 నుంచి 23 వరకు రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఈ సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. దక్షిణ భారతదేశానికి చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి ఎంపికైన 210 నూతన శాస్త్రీయ ఆవిష్కరణలు ఈ సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.బాల శాస్త్రవేత్తలు తమ ప్రతిభను చాటిచెప్పేలా 210 ఎగ్జిబిట్స్ తో పాటు ఎన్ జి ఓల ద్వారా 40 సైన్స్ స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన ఆలోచనలు, పరిశోధనలతో రూపొందిన ఈ ఆవిష్కరణలు శాస్త్ర సాంకేతికతకు చేయూతనిస్తూ, విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సైన్స్ ఫెయిర్‌ను జనవరి 19న (సోమవారం) ఉదయం 10 గంటలకు రాష్ట్ర మంత్రులు,ప్రజా ప్రతినిధులు,ఉన్నత స్థాయి అధికారులు అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు.సైన్స్ ఫెయిర్‌ను పకడ్బందీ ఏర్పాట్లతో, భద్రత, వసతులు, సందర్శకుల సౌకర్యాల పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం కల్పించనున్నట్లు వెల్లడించారు. సైన్స్ ఫెయిర్‌ను అధికారులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు,ఉపాధ్యాయులు, బాల మేధావులు, శాస్త్ర సాంకేతిక అభిమానులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు, ఆసక్తి గల ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా తిలకించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీపురందరదాసుల ఆరాధన ఉత్సవాలు



**మల్దకల్, జనవరి 18 (జనంసాక్షి) :** కర్ణాటక వాగ్గేయకారులు నారదాంషులైన శ్రీ పురందరదాసుల ఆరాధన మహోత్సవాలు ఆదిశీలా క్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో శ్రీశేష దాసుల వంశస్తులైన దీరేంద్ర దాస్,ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు ఆధ్వర్యంలో వేద పాఠశాలలోని శ్రీ పురందరదాసులవిగ్రహానికి పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో దాసుల వారి ఉత్సవ విగ్రహంతో రథోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మధుసూదనాచారి,రవి, చంద్రశేఖర రావు,బాబురావు, చక్రధర్,కైలాసరావు,శ్రవణ్, సీతారాంరెడ్డి, రామచంద్రారెడ్డి,నరేందర్, సవారన్న,పద్మా రెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పురందర దాసుల విగ్రహ దాత రామచంద్రారెడ్డిని సన్మానించారు.

# గొల్లపల్లి రిజర్వాయర్‌పై బీఆర్ఎస్ రాజకీయాలు

- రిజర్వాయర్ కమిషన్ల కోసమా..? రైతుల కోసమా..?
- వనపర్తి వరప్రదాయినిగా మారనున్న గొల్లపల్లి చీరకపల్లి రిజర్వాయర్
- భూ నిర్వాసితులకు రూ.20 లక్షలకు పైగా పరిహారం ఇస్తాం
- మీడియా సమావేశంలో ఉమ్మడి మండలాల ఇంచార్జ్ సత్య శీలా రెడ్డి



**రేవల్లి, జనవరి 18 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గ సాగునీటి కలగా మారనున్న గొల్లపల్లి–చీర్కపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో బిఆర్ఎస్ నాయకులు నీతిమాలిన రాజకీయాలకు తెరలేపారని కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం గొల్లపల్లి, చీర్కపల్లి గ్రామస్తులు, గొల్లపల్లి గ్రామ సర్పంచ్ అనసూయ, చీర్కపల్లి గ్రామ సర్పంచ్ రవి రెండు గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి మండలాల ఇన్‌చార్జ్ సత్యశీలా రెడ్డి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ద్వంద్వ నీతిని ఎండగట్టారు. ?నాడు కమిషన్ల కోసం నేడు కుట్రల కోసం.. ?2016లోనే అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం గొల్లపల్లి, చీర్కపల్లి ప్రాజెక్టుతో పాటు మరో 20 రిజర్వాయర్ల ఏర్పాటుకు జీవో నెం. 941 జారీ చేసిన విషయాన్ని సత్యశీలా రెడ్డి గుర్తు చేశారు. 2018లో సర్వేలు, మ్యాపింగ్ పూర్తి చేసి, భూములు కోల్పోయే రైతులకు కేవలం రూ. 6.50 లక్షల పరిహారం ఇస్తామని అప్పట్లో రైతులను ఒప్పించారని ఆరోపించారు. నాడు తామే స్వయంగా మంజూరు చేసిన ప్రాజెక్టును, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1100 కోట్లతో నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఓర్వలేక అమాయక రైతులతో ధర్నాలు చేయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ?కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కొనియాడారు. బిఆర్ఎస్ హయాంలో ప్రకటించిన దానికంటే మూడు రెట్లు అధికంగా, కొడంగల్ తరహాలో ఎకరాకు రూ. 20 లక్షల కంటే ఎక్కువే నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని 42,663 ఎకరాలకు సాగునీరు అందుతుందని, వనపర్తికి ఇది వరప్రదాయినిగా మారుతుందని స్పష్టం చేశారు. ?లక్షల కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరాన్ని పూర్తి చేసిన బిఆర్ఎస్ నేతలు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. వేల కోట్ల కమిషన్ల కోసం ప్రాజెక్టులను వాడుకున్నారే తప్ప, వనపర్తికి చుక్క నీరు కూడా తీసుకురాలేదని విమర్శించారు. గొల్లపల్లి, చీర్కపల్లి రిజర్వాయర్ వల్ల గ్రామాలకు ఎలాంటి ముప్పు లేదని నిపుణులు తేల్చి చెప్పినప్పటికీ, రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని దుయ్యబట్టారు.? మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిని ఇక్కడికి పిలిపించి, ఈ ప్రాజెక్టు కమిషన్ల కోసమా? లేక రైతుల కోసమా? అని సమాధానం చెప్పాలని సత్యశీలా రెడ్డి సవాల్ విసిరారు. ఎన్ని కుట్రలు చేసినా, బెదిరింపులకు దిగినా రిజర్వాయర్ నిర్మాణం జరిగి తీరుతుందని, రైతుల కల సాకారం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రేవల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాడల పర్వతాలు, ఉమ్మడి రేవల్లి, ఏదుల మండలాల్లోని స్థానిక సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గొల్లపల్లి చీరకపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నిర్మల్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, జనవరి18 (జనంసాక్షి) : నిర్మల్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నేటి నుంచి 23 వరకు ఐదు రోజులపాటు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మల్ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక, సంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల వేదిక, స్టాల్స్, మరుగుదొడ్లు, సెల్ఫీ పాయింట్స్, పార్కింగ్, చిన్నపిల్లల ఆట విడుపు ప్రదేశం, ఎల్ఈడి తెరలు ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు. అధికారులకు ముఖ్యమైన సూచనలు చేశారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి హాజరయ్యే సందర్శకులకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సరిపడినన్ని కుర్చీలు, సరైన మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, త్రాగునీరు, లైటింగ్ వంటి వసతులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వివరించారు. నిర్మల్ జిల్లా చరిత్ర, సంస్కృతిక వారసత్వం ఉట్టిపడేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో ఆర్డిఓ రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, డివైస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దొంతి అండదండలతోనే మైనింగ్ దందా

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణ



నర్సంపేట. జనవరి 18 (జనం సాక్షి) : నర్సంపేట నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అండతో, పోలీస్ అధికారులు, మైనింగ్ అధికారుల సహకారంతో మైనింగ్ మోరం దంద చీకటి దందా యదేచ్ఛగా కొనసాగుతున్నది. మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం. రాయి డి రవీందర్ రెడ్డి. ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకర్ సమావేశంలో అన్నారు ఆయన మాట్లాడుతూ రాజుపేట ఏజెన్సీ శివారు ముత్యాలమ్మ తండా గ్రామపంచాయతీ పరిధిలో మట్టిని తోడి సొమ్ము చేసుకుంటున్నారు. మున్సిపాలిటీ అధికారులు, మైనింగ్ అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు కూడా ఇందులో వాటాలు ఉన్నాయి. పేర్కొన్నారు. రాత్రంతా ఇతర ప్రాంతాలకు కూడా వందల టిప్పర్ల తరలిస్తూ దందా సాగిస్తున్నారన్నారు. పిశాచట్టం వన్ ఆఫ్ సెవెన్ టీ చట్టాలకు తూట్లు పొడుస్తూ అధికార పార్టీ నాయకులు దందా కొనసాగిస్తున్నారు. తెలిపారు. ఒకే సిండికేట్ ద్వారానే జరగాలని చెప్పి మిగతా వాళ్లను మనం తరలించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నార. దాడులు చేయడం, మహిళలను కొట్టడం, దూషించడం, పోలీసులు బెదిరించడం చేస్తున్నారన్నారు. దామెర చెరువులో లోతుగా మట్టి తవ్వడం వల్ల ఊటలు వచ్చి భవిష్యత్తులో మెడికల్ కళాశాలకు సమస్య ఉంది అని ఎన్ఐఏ అధికారులు చెప్పినప్పటికీ పట్టించుకునే నాథుడే లేడు అన్నారు. నిబంధనల ప్రకారం ఎంత లోతు, ఎంత వెడల్పు తీసినటువంటి వివరాల సేకరణ కూడా చేశారని, నిబంధనలకు విరుద్ధంగా మట్టి ని తవ్వుతున్నారు. దీనిపై ప్రత్యేక విచారణ జరగాలని, ఈ విచారణ ప్రభుత్వానికి ఎన్ని చెప్పినా వాళ్ళు పట్టించుకోవడం లేదన్నారు. కలిసి దోపిడీ అరాచకాలకు తెలియజేయడంతో వీరి ఆగడాలను అడ్డుకునే నాథుడే కరువయ్యాడని తెలిపారు. హైకోర్టులో వీళ్ళందరి పైన బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ ద్వారా ఆధారాలతో పిల్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందరమ్మ ఇల్లు పేర్లతో కోట్ల రూపాయలు మట్టి దందా. చేస్తున్నారని ఆధారాలతో బయట పెడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మాజీ ఎంపీపీ, జిల్లా నాయకులు,పట్టణ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, జిల్లా అధ్యక్షులు, క్లస్టర్ బాధ్యులు పట్టణ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## జనంసాక్షి దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



ఏటూరు నాగారం, జనవరి 18(జనం సాక్షి) : ఏటూరు నాగారం మండలం కోయగూడ ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ పోరిక సరిత, వార్డ్ నెంబర్లు గద్దె జయకృష్ణ, కరోబార్ ఇర్సవడ్ల రాజు,తో కలిసి జనంసాక్షి దినపత్రిక 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు మరియు అధికారులకు మధ్య వారధిగా ఎప్పటికప్పుడు సమాచారం అందించే పత్రిక జనం సాక్షి పత్రిక అన్నారు జనంతో కలిసి జనాల సమస్యల మీద ప్రత్యేక దృష్టి పెట్టి పనులు వెతికి తీసే పత్రిక జనంసాక్షి దినపత్రిక అని అన్నారు. గ్రామ పెద్దలు అందరు కలిసి జనంసాక్షి దిన పత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోరిక సరిత, వార్డ్ నెంబర్ గద్దె జయకృష్ణ కరోబార్ ఇర్సవడ్ల రాజు, గ్రామ పెద్దలు గార నీలం, అల్లి వెంకటేష్, సంపటి దామోదర్, కొడాలి శ్రీనివాస్, గార రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం : సీపీఎం




స్టేషన్ ఘన్ పూర్, జనవరి18 ( జనం సాక్షి ) :స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఎన్నికల్లో నాలుగు వార్డులలో సిపిఎం పోటీ చేయడానికి సిద్ధమవు తున్నట్లు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యు డు రాపర్తి రాజు పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో శాఖ సమావేశం ఈరోజు మాజీ వార్డు సభ్యులు చిలుముల్ల భాస్కర్ అధ్య క్షతన జరిగింది ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా రాపర్తి రాజు హాజరై మాట్లాడుతూ స్టేషన్ ఘన పూర్ పట్టణంలో ప్రజాసమస్యల పరిష్కారంకోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు జరిగాయ న్నారు. ఇండ్లు ఇళ్ల స్థలాలు లేని పేదల కోసం పోరాటంచేసినామని అన్నారు. కార్మికుల హక్కుల కోసం మున్సిపల్, అంగన్వాడీ, ఆశ మధ్యాహ్నం భోజనం,హామాలి కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో, ట్రాన్స్పోర్ట్ రంగాల కార్మిక సమస్యలపై ఉద్యమం చేపట్టామన్నారు. వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వృత్తిదారుల సమస్యలపై వారి హక్కుల కోసం ఉద్యమించామ న్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి యువజన మహి ళ మైనార్టీ సామాజిక తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పనిచేసిన పార్టీ సిపిఎం అని అన్నా రు. గతంలో సిపిఎంపార్టీ చాగల్ గ్రామంలో సర్పం చ్ గా స్టేషన్ ఘనపూర్, శివునిపల్లి గ్రామపంచాయ తీలలో వార్డు మెంబర్లుగా గెలిచి ప్రజలకు సేవలు అందించిన చరిత్ర సిపిఎంకుఉందన్నారు. వార్డుల లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఎం పార్టీ నుండి పోటీచేస్తున్న వార్డులు, అభ్య ర్థులపేర్లను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఎంపార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేష్,పార్టీ మండల కమిటీ సభ్యులు సిద్దుల సుదర్శన్, పార్టీ పట్టణ నాయకులు గుర్రం వెంకటనర్సు,నాయకులు బూశెట్టి రాంబాబు, మునిగెల వెంకన్న, అమరాజు బాబు, దామోదర్ రెడ్డి, ఎం సతీష్ పాల్గొన్నారు.

# అసంపూర్తి రోడ్‌తో నరకయాతన

- ప్రాణాలు అర చేతిలో ప్రయాణం
- ఏళ్ల తరబడి ప్రజల కష్టాలు



కౌటాల జనవరి 18 (జనంసాక్షి) : పార్ది రోడ్ గుంతల మయంతో వాహన దారులు నరక యాతన పడుతున్నారు. కొమరం భీం జిల్లా కౌటాల మండలం లోని పార్ది ప్రధాన రహదారి గుండా వాహనాలు నడిచే పరిస్థితులు లేవు, నిత్య కంకర లారీలు,ట్రాక్టర్, ఆటోలు ద్విచక్ర వాహనాలతో రద్దీగా ఉండే రహదారి ఇప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు చేస్తున్నారు. వరి బస్తాలు, పత్తి బోలేర లతో వెళ్లే వాహనాల పరిస్థితి అధ్వానంగా మారింది. అదుపు తప్పి గుంతలో ఒరిగితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎన్నికల్లో రోడ్ బాగుచేయిస్తా అంటూ తీర ఎన్నికలు ముగిసే సరికి 5సంవత్సరాలు తిరిగి చూసే వారు దిక్కు లేకుండా పోయింది. గతంతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఎన్నికల చివరి సమయంలో ముత్తంపేట్ నుండి పార్ది గ్రామానికి 2.9కిలోమీటర్ల బీ టీ రోడ్ మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ వచ్చింది. ఆ తరువాత ఎమ్మెల్యే హరీష్ బాబు వల్లభనేని కన్స్ట్రక్షన్ కు కాంటాక్ట్ వారికి రోడ్ అప్పగించారు.వారు ముత్తంపేట్ నుండి పార్ది వరకు వేయాల్సిన రోడ్, పార్ది నుండి ముత్తంపేట్ వరకు అసంపూర్తిగా వేశారు.బోర్డ్ మాత్రం ముత్తంపేట్ నుండి వేసినట్టు పెట్టారు.

### వర్షా కాలంలో విద్యార్థులు నరక యాతన

ప్రతి సంవత్సరం వర్షా కాలంలో పార్ది నుండి విద్యార్థులు పాఠశాలకు, కాలేజ్ వెళ్ళడానికి మండల కేంద్రానికి వెళ్ళే సమయంలో నరక యాతన పడుతున్నారు. విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి వస్తుంది. ఆటో లో వెళ్లాలంటే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి బురద మయంగా మారుతుంది. ద్విచక్ర వాహన దారులు జారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు పార్ది కి వెళ్లాలంటే బయపడుతున్నారు.

ప్రతి రోజు కంకర లారీలు నడవటం తో విపరీతమైన దుమ్ము లేస్తుంది. ఆ దారిలో వెళ్ళే రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి వెళ్లాలంటే వేరే దారి లేక దుమ్ములో వెళ్లడం వల్ల శ్వాస కోశ వ్యాధుల బారిన పడుతున్నారు. క్రసర్ యాజమాన్యం రోడ్ కు నీళ్లు కొడుతున్నప్పటికీ వాహనాల రద్దీతో రోడ్ ఆరిపోతుంది. దాంతో దుమ్మును నివారించ లేని పరిస్థితి ఉంది. పంట పొలాల్లో పండించిన వరి ధాన్యాన్ని ఇంటికి చేర్చాలన్న ఇబ్బంది పడుతున్నారు. ట్రాక్టర్ లో తీసుకొచ్చే సమయంలో గుంతల కారణంగా వరి బస్తాలు కిందపడి పోతున్నాయి. పత్తి బోలేర వాహనాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వరి గడ్డి ఎడ్ల బండ్లు ఒరిగిపోతున్నాయి. నిత్యం పార్ది నుండి ముత్తంపేట్, కౌటాల ఇతర పట్టణాలకు ఆటో లో వెళ్ళే ప్రయాణికులు బయపడుతున్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో సంత కు నిత్యవసర సరుకులు కొనడం కోసం ప్రైవేట్ వాహనాల్లో ప్రమాద కరంగా ప్రయాణం చేయాల్సి వస్తుంది.

### రహదారి పూర్తి చేయండి



అసంపూర్తిగా వేసిన బీటీ రోడ్‌ను పూర్తి చేయాలి. మండల కేంద్రానికి వెళ్ళడానికి ఇబ్బంది పడాల్సి వస్తుంది. తప్పని సరి పరిస్థితి లో వెళ్తున్నారు. ఇంకో 1కిలో మీటర్ రోడ్ వేస్తే మాకు ప్రయాణం సులభం అవుతుంది. అంబులెన్స్ వారు కూడా రావడానికి ఇబ్బంది పడుతున్నారు.

ఎడ్ల విజయ్ కుమార్, గ్రామం పార్ది

### ఇండ్లలో చేరుతున్న దుమ్ము



కంకర లారీలు ప్రతి రోజు నడవడం వల్ల దుమ్ము భారీగా లేస్తుంది. రోడ్ కు ఇరు వైపుల నివసిస్తున్న కుటుంబాల ఇండ్ల పై దుమ్ము చేరి.కుటుంబ సభ్యులు అనారోగ్యాలకు గురవుతున్నారు.ట్యాంకర్ తో రోడ్ కు నీళ్లు కొడితే దుమ్ము లేవకుండా ఉంటుంది.

చిలుముల సాయి, గ్రామం ముత్తంపేట్

### ఎమ్మెల్యే చొరవ చూపాలి..



రాత్రి సమయంలో ఇంటికి వెళ్ళాలంటే ప్రజలు బయపడుతున్నారు. ఎన్నికల్లో రోడ్ వేయిస్తా మంటూ హామీలు ఇస్తూ తరువాత పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే హరీష్ బాబు చొరవ తీసుకుని పార్ది, సాంగ్వాం, కౌటీ, గ్రామాల ప్రజ లు పడుతున్న కష్టాలు చూసి రోడ్ మంజూరు చేయించాలి.

ఎకోన్ కార్ దామోదర్, మాజీ సర్పంచ్ సాండ్ గాం

## కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు

- డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్



మరిపెడ జనవరి 18 (జనంసాక్షి) : కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఆరు గ్యారెంటీలు అటుకెక్కినట్లు మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్ ఆరోపించారు. ఆదివారం మరిపెడ మున్సిపల్ కేంద్రం లోని వివిధ వార్డుల్లో ఆయన పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పల నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశం లో ఆయన లిజిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావులి తో కలిసి ఆయా వార్డుల ప్రజలు , పార్టీ శ్రేణులతో మాట్లాడారు. రెండేళ్ల పాలన ఎలా ఉందో ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. కళ్యాణ లక్ష్మి ద్వారా తులం బంగారం ఎంత మందికి అందిందని...? ప్రతి ఇంటి ఆడబిడ్డకు రూ.2500లు ఆసరా పింఛన్లు రూ4వేలు, అంగవైకల్యం కలిగిన వారికి రూ.6000వేలు ఎక్కడైనా ఇచ్చారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దీంతో మహిళలు లేదంటూ సమాధానం ఇచ్చారు. రైతు బంధు పథకం రూ.15000వేలు ఇవ్వటం లేదని పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదని రెడ్యా నాయక్ విచారం వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల పాలన లో కాంగ్రెస్ తన అసమర్ధత ను నిరూపించు కున్నారు. అధికారం కోసం అలవికాని 420 హామీలు ఇచ్చి అమలు చేయలేక అపసో పాలు పడుతుందన్నారు. డోర్నకల్ నియోజక వర్గం స్థానికేతురుల పాలన లో వెనుకబాటుకు గురైందని విచారం వ్యక్తం చేశారు. మరిపెడ పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో పురపాలక కేంద్రం గా ఏర్పాటు చేసి కోట్లాది నిధులు మంజూరి చేసి సుస్థిరమైన ప్రగతి సాధించేలా కృషి చేసినట్లు తెలిపారు. పట్టణ కేంద్రలో వంద పడకల ఆసుపత్రి మంజూరి చేయించి అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు తో శంకు స్థాపన చేయించినట్లు పేర్కొన్నారు. మరిపెడ సబ్ కోర్టుమంజూరి చేసి స్థల పరిశీలన చేశామని పేర్కొన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటు లో ఉండి అభివృద్ధి లక్ష్యంగా పని చేశానని స్పష్టం చేశారు. డోర్నకల్ పరాయి పాలనలో అన్ని వర్గాల్లో వెనుకబాటుకు గురవుతుందని ఇది తనకెంతో ఆవేదన కలిగిస్తుందన్నారు. రానున్న పురపాలిక ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మన పాలన మనం చేసుకుందని ఓటర్లను అభ్యర్థించారు. అందుబాటు లో ఉండేది అభివృద్ధి చేసేది ఎవరో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, జిల్లా నాయకులు గు గు లోతు రాంబాబు, తేజావాతు రవీంద్ర నాయక్, ఉగ్గంపల్లి సర్పంచ్ ఆయుబ్ పాషా, పానుగోతు వెంకన్న, జాతోటు బాలాజీ, మాచర్ల భద్రయ్య, ఎల్వి వెంకన్న, సయ్యద్ లతీఫ్, మక్స్ ద్, దిగజర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తొర్రూరు మున్సిపాలిటీ పై గులాబీ జెండా ఎగరవేస్తాం

- మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




తొర్రూరు, జనవరి 18 (జనం సాక్షి) : త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగు వేళ తొర్రూరు మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసిన లిమాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

తొర్రూరు పట్టణ కేంద్రంలో దుబ్బతండ సమీపంలో డబుల్ బెడ్ రూంలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించగా ఈ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అధికారం అండతో నిరుపేదలకు మంజూరు చేయాల్సిన డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వకుండా ఆ కుటుంబాలను ఇబ్బందులు పెడుతున్నారు. పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో ముందు ఉందంటే దానికి కారణం కేసీఆర్ అని అన్నారు. తొర్రూరు మండలాన్ని మున్సిపాలిటీ చేసి అభివృద్ధి చేసిన మహానీయుడు కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలు కాలంలో ప్రజలకు చేసింది ఏమీ చేసింది లేదు. ప్రజలు ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ కి బుద్ధి చెప్తాము అని బహిర్గతంగానే చర్చించుకుంటున్నారు. ఈ మున్సిపాలిటీలో ఉన్న 16 వార్డులకు 16 బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుంది. దానికి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి మున్సిపాలిటీ పై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం కొంత మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులకు గులాబీ కండువా కప్పుకొని బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు .బీఆర్ఎస్ పార్టీలోకి చేరిన వారు తొర్రూరు పట్టణ మాజీ ఎంపీటీసీ తూర్పాటి. సుభద్ర – శంకర్కాంగ్రెస్ సీనియర్ నాయకులు నమిళ్ళ. విజయ భాస్కర్ ,జాటోత్. వీరన్న, జాటోత్.వెంకన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి స్వచ్ఛందంగా చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, తొర్రూరు, పాలకుర్తి ,రాయపర్తి, కొడకండ్ల, పెద్దవంగర మండలాల నుండి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.350 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం

- మున్సిపాలిటీ అభివృద్ధికి ఇంకా నిధులు తీసుకువస్తాం
- అభివృద్ధి కోసం ధృడ సంకల్పంతో రెండేళ్లలో ముందుకెళ్తున్నా
- మరో రూ.150 కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు తీసుకొచ్చాను
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.350 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, అంచెలంచెలుగా ఇంకా నిధులు మంజూరు చేయించి, సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మరికొంత మంది ముఖ్య నేతలు, మాజీ కౌన్సిలర్లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల సమయంలో భూపాలపల్లి మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల్లో సుమారు రూ.350 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అదేవిధంగా మరో రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఇటీవలె నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలే వారికి బుద్ధి చెబుతారని చెప్పారు. భూపాలపల్లి పట్టణంలో చేస్తున్న అభివృద్ధి పనులు, పేద ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు చూసి, మున్సిపల్ ఎన్నికల్లో, 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. గత ప్రభుత్వ హాయంలో ప్రతిపా దనలు పంపి కాగితాలకే పరిమితమయ్యాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ పనులన్నీ రద్దు అయ్యాయని వివరించారు. తిరిగి తాను మళ్లీ ఆ పనులకు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అది తెలియని కొంతమంది రాజకీయ లబ్దికోసం దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు.

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో అంచెలంచెలుగా అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వివరించారు. ఈ మేరకు ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో చేసిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. పెండింగ్ లో ఉన్న స్టేడియం ఆడిటోరియం నిర్మాణానికి రూ.4కోట్లు, వెజ్ మార్కెట్ సముదాయం నిర్మాణం కోసం రూ.6 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో సమస్యల పరిష్కారం కోసం రూ.10కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ పరికరాల ఏర్పాటుకు ఒక కోటి, 80లక్షలు మంజూరు చేయించి, పనులు చేపట్టడం జరిగిందని, ఆసుపత్రిలో ఖాళీ ఉన్న పోస్టులను భర్తీ చేయించడం జరిగిందన్నారు. రూ.9కోట్లతో అంబేద్కర్ కళాక్షేత్రం పనులు చేపట్టడం జరిగిందని, వివిధ ఆలయాలకు, సీసీ రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలు మంజూరు చేయించి పనులు యుద్ధప్రాతిపదికన చేయించడం జరుగుతుందని చెప్పారు.

జయశంకర్ భూపాలపల్లిని జిల్లాగా తొలగిస్తారనే దుష్ప్రచారాలను నమ్మవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. జిల్లాలో వస్తున్న ఆరోపణలపై స్పందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కావాలనే కొంతమంది పనిగట్టుకొని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను ఎట్టి పరిస్థితుల్లోను తొలగించేది ఉండదని, అలాంటి పరిస్థితి వస్తే, తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు జిల్లాను కాపాడుకోవడం జరుగుతుందని తెలియ జేశారు. రాజకీయ పబ్బం గడుపుకోవాడానికి కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ లీడర్లు బుర్ర కొమురయ్య, ముంజాల రవీందర్, అప్పం కిషన్, మహేందర్, సమ్మయ్య, రమేష్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
19 జనవరి 2026

# జేఈఈ మెయిన్స్ పరీక్షకు సర్వం సిద్ధం



**కోదాడ, జనవరి 18 (జనం సాక్షి) :** దేశంలో ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటి, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కొరకు మరియు జేఈఈ అడ్వాన్స్ ప్రవేశ పరీక్షకు హాజరు కావాలంటే జేఈఈ మెయిన్స్ అర్హత సాధించడం తప్పనిసరి. దీనికి సంబంధించి ఈ ఏడాది మొదటి సెషన్ పరీక్ష జనవరి 21వ తేదీ నుండి ప్రారంభమవుతుంది. ఈ పరీక్షకు సుమారు 13 లక్షల మంది విద్యార్థులు వ్రాసే అవకాశం ఉంది. అభ్యర్థులకు వచ్చిన స్కోరును బట్టి 2లక్షల మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్సుడ్ రాయడానికి అర్హత సాధిస్తారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ పరీక్ష నిర్వహిస్తుంది. పరీక్షకు మూడు రోజులు ముందు అడ్మిట్ కార్డు కొరకు అభ్యర్థులు తమ అప్లికేషన్ నెంబర్, పుట్టిన తేదీ ద్వారా ఎన్టిఏ వెబ్సైట్ ద్వారా పొందవచ్చు. పేపర్ 1( బిఈ ,బిటెక్) ఇంజనీరింగ్ కోర్సుల కొరకు ఉంటుంది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుండి ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.75 ప్రశ్నలు ఇవ్వడం జరుగుతుంది. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. సరైన సమాధానం ఇస్తే 4 మార్కులు ఇస్తారు. తప్పుడు సమాధానం ఇవ్వడం ద్వారా 1 మార్క్ ఉన్న స్కోర్ నుండి తగ్గించడం జరుగుతుంది పేపర్2 ఏ( బి ఆర్క్), 2 బి( బి ప్లానింగ్) కొరకు రెండో పేపర్ ఉంటుంది. అభ్యర్థులు తమ వెంట ఆధార్, పాన్ కార్డు, ఓటర్ ఐడి కార్డ్ ఏదైనా ఒకటి ఒరిజినల్ తీసుకెళ్లాలి. అటెండెన్స్ షీట్ కొరకు ఒక పాస్ ఫోటో తీసుకువెళ్లాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్స్, క్యాలిక్యులేటర్, వాచీలకు అనుమతి లేదు. అడ్మిట్ కార్డులో ఉన్న రిపోర్టింగ్ సమయానికి కంటే ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి వెళ్లాలి. "గత 5 సంవత్సరాల నుండి ఫిజిక్స్, కెమిస్ట్రీసబ్జెక్టులలో ప్రశ్నలు కొద్దిగా సరళంగా ఉన్నాయి.మ్యాథ్స్ నుండి ప్రశ్నలు కఠినంగా వస్తున్నాయి. అభ్యర్థులు మాథ్స్ పై దృష్టి సారించాలి. ఎగ్జామ్ 3 గంటల సమయంలో మొదటి గంటన్నర ఫిజిక్స్ ,కెమిస్ట్రీ పూర్తిచేసి, తర్వాత గంటన్నర మ్యాథమెటిక్స్ చేయాలి. కెమిస్ట్రీ సబ్జెక్ట్ స్కోరింగ్ కొరకు ఎన్సీఈఆర్టీ బుక్స్ చదివితే మంచిది.

## అధికార కాంగ్రెస్, పోలీసుల వేధింపులు తాళలేక ఉద్యమకారుడు ఆత్మహత్యాయత్నం

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



**హాలియా, జనవరి 18 (జనం సాక్షి) :** మిర్యాలగూడలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమ నాయకుడు ఉన్నం విజయ్ భాస్కర్‌ను నల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యుడు యం.సి కోటిరెడ్డి మాజీ ఎమ్మెల్యే నోముల భగతు పరామర్శించాడు. నాగార్జునసాగర్ నియోజకవర్గం, నిడమనూరు మండల కేంద్రానికి చెందిన ఉన్నం విజయ్ భాస్కర్ అధికార కాంగ్రెస్ పార్టీ ఆగడాలు.. పోలీసుల వేదింపులు భరించలేక పురుగుల మందు సేవించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాజీ ఎమ్మెల్యే నోముల భగతు వైద్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిపై సమాచారాన్ని సేకరించాడు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించాడు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనపై స్పందించాడు. ఎమ్మెల్సీతో పాటు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, రాష్ట్ర ఉద్యమ నాయకులు బొల్లేపల్లి శ్రీనివాస్ చారి, యువ నాయకులు నల్లమోతు సిద్ధార్థ్, మాజీ డిసిసిబి డైరెక్టర్ విరిగినేని అంజయ్య, హాలియా మాజీ మార్కెట్ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్‌వి రాష్ట్ర కార్యదర్శి ఎం.డి షోయబ్, వింజం శ్రీధర్, బొల్లం సైదులు యాదవ్, ఉన్నం ఈశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల దరఖాస్తుల ఆహ్వానం



**బూర్గంపహాడ్, జనవరి 18 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక మైనారిటీ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో 2026/27 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరానికి గాను ప్రవేశాల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె. జ్యోతి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సి ఈ సి, హెచ్ ఈ సి గ్రూపుల కొరకు ఇంగ్లీష్ మీడియం లో ముస్లిం మైనారిటీ సీట్లు సి ఈ సి గ్రూపులో 30, బీసీ-5, ఎస్ సి-2, ఎస్ టి-2, ఓ సి - 1 సీట్లో ఉన్నాయని, ఈవిధంగానే హెచ్ ఈ సి గ్రూపులో కుడా సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అత్యున్నత మైన అధ్యాపకులచే ఉచితంగా సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు, గ్రూప్స్ ఉద్యోగాలకి, సిఏ, లా సెట్, డైట్ సెట్ కోచింగ్ ఇస్తున్నామని, నాణ్యమైన విద్యతో పాటు ఉచిత భోజనం, ఉచిత వసతి సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 7331125355 ఈ నెంబర్ ని సంప్రదించాలని, నాన్ మైనారిటీ సీట్ల కొరకు వెబ్ సైట్ gmreistelangana సంప్రదించవలసిందిగా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి కోరారు.

## చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**మర్రిగూడ, జనవరి 18 (జనం సాక్షి) :** యువత చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడలు యువకుల మధ్య స్నేహ భావాలు పెంపొందించడమే కాకుండా ఐకమత్యానికి అన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయస్థాయిలో ఉత్తమ స్థానంలో ఉన్నారని గుర్తు చేశారు. ఆటల్లో గెలుపోటములు సహజమని క్రీడాకారులు స్ఫూర్తిగా కోరుకుంటూ స్నేహభావంతో మెలగాలని సూచించారు. అనంతరం సర్పంచ్ సంతోష్ యాదవ్ మాట్లాడుతూ శ్రీ ముత్యాలమ్మ రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో ఇక నుంచి ప్రతి ఏట మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు ప్రకటించారు. క్రీడాకారులు సహకరించి టోర్నమెంటును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రాష్ట్ర నాయకులు అనంతరాజు గౌడ్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్,సర్పంచ్లు కమ్మ చిచ్చు వెంకటేష్, ఆమ్బోతు సీతారాం నాయక్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి శ్రీపాద కప్ 2026 మెగా క్రికెట్ టోర్నమెంట్



**మంథని, జనవరి 17 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోనీ ప్రభుత్వ కాలేజీ మైదానంలో రాష్ట్ర ఐటీ,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టి పి సి సి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ఆశీస్సులతో ఆర్గనైజర్లు పోలు శివ, పెంటరి రాజు,పెరుగు తేజ పటేల్, టి.రాజు, మారుపాక పవన్, కెక్కర్ల సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి రాష్ట్ర స్థాయి శ్రీపాద కప్ 2026 మెగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆసక్తిగా సాగింది. జుబేర్ 11 టీమ్ కరీంనగర్ విన్నర్ టీమ్ కు రూ.లక్ష రూపాయలు, ఆల్ రహీం 11 టీమ్ రన్నరప్ కు రూ. యాభై వేల నగదు అందించారు. ఈ సందర్భంగా విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, ఆర్టిఐ మెంబర్ మంథని సురేష్,కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే,మాజీ పిఎసిఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి శంకర్,మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజీమ్ ఖాన్,జిల్లా సోషల్ మీడియా ఇంచార్జీ ఆరెల్లి కిరణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తాచాటిన లాల్‌గడి మలక్‌పేట్



**శామీర్‌పేట్, జనవరి 18 (జనం సాక్షి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గంలోని అలియాబాద్, మూడు చింతలపల్లి, మున్సిపాలిటీలో యువత కోసం నిర్వహిస్తున్న సిఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలోని గ్రౌండ్ లో నిర్వహించిన సిఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ లో విన్నర్లకు, రన్నర్ లకు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బహుమతులు అందజేశారు. మొదట నిర్వ హించిన ఫైనల్ మ్యాచ్ ముడుచింతలపల్లి మున్సి పల్ లో లింగాపూర్ తండా టీమ్ విజయం సాధించగా అనంతారం టీమ్ రన్నర్ గా నిలిచింది. విన్నర్ టీమ్ కు 25వేల నగదు తో పాటు, కప్, రన్నర్ కు 15 వేలతో పాటు కప్ ను అందజేశారు. అదేవిధంగా సెకండ్ నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ అలియాబాద్ మున్సిపల్ లో లాల్ గడి మలక్ పేట్ టీమ్ విన్నర్ గా నిలువగా, అలియాబాద్ టీమ్ రన్నర్ గా నిలిచింది. విన్నర్ టీమ్ లాల్ గడి మలక్ పేట్ కు 25 వేల నగదుతో పాటు కప్, రన్నర్ టీమ్ అలియాబాద్ కు 15 నగదు తోపాటు కప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రారెడ్డి,నాయకులు మధుకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సగ్గు శ్రీనివాస్ యాదవ్, మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఇద్దరు వెంపటి విద్యార్థులు ఎంపిక



**తుంగతుర్తి జనవరి 18 (జనం సాక్షి) :** మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రాం నరసమ్మ తెలిపారు, తెలంగాణ క్రీడ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రం జేఎన్ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయిక్రీడా పాఠశాలకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 4వతరగతి ప్రవేశానికి రాష్ట్రస్థాయిలో జరిగిన ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరిచి చిర్రకీర్తన, గౌరు అక్షయ్ కుమార్ ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారిని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి మెమొంటో అందజేసి అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా పాఠశాలలోఒకే దగ్గర పాఠాలు,క్రీడా నైపుణ్య శిక్షణ ఉంటుందని, 11 క్రీడాంశాలు అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్మింటన్, స్విమ్మింగ్, టెన్నిస్, క్రికెట్ విభాగాలలోశిక్షణ ఇస్తారని తెలిపారు తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మల్లెపాక రవీందర్, బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రం, మాలోతు కృష్ణ, గుండ్ల ఆంజనేయులు,రామణబోయిన మౌనిక, అబ్బగాని మంజుల, శీలోజు రమాదేవి పాల్గొన్నారు.

## అత్యంత మహిమాన్వితురాలు కట్టమైసమ్మ



**తాండూరు, జనవరి 18 (జనంసాక్షి) :** కోరిన కోరికలు తీరుస్తూ కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో మౌని అమావాస్య పురస్కరించుకొని ఆలయంలో భక్తులను దృష్టిలో పెట్టుకొని ప్రతి అమావాస్యకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగానే ఆదివారం మౌని అమావాస్య సందర్భంగా పట్టణంలోని పాత కుంట ఆదర్శనగర్‌లో కోలువుదీరిన శ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో మౌని అమావాస్య పురస్కరించుకొని విఠల్ నాయక్ ఆలయంలో కొలువుదిరిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన భక్తుడు అయ్యప్ప ఆలయ శివకుమార్ భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వర్త్య విఠల్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో సర్వం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మౌని అమావాస్య అత్యంత శక్తివంతమైందని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక కార్యక్రమాలచే పునీతులవుతారని తెలిపారు. మౌని అమావాస్య రోజు త్రివేణి సంఘంలో స్నానమాచరిస్తే ఎన్నో జన్మల పుణ్యఫలం లభిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లంపల్లి ప్రకాష్, కుమ్మరి నర్సింలు, వేణుగోపాల్, నరేష్, నవీన్ కంఠం, సుధాకర్, అంజిలయ్య, పాపయ్య, ఆలయ అర్చకులు ఎస్బిఐ రిటైర్డ్ ఉద్యోగి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలి



**దోమ, జనవరి 18 (జనం సాక్షి) :** గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్ రూల్స్ గోడ రాతలు శాశ్వత బోర్డులు ఏర్పాటు చేయాలనీ దోమ మండల సర్పంచు ల సంగం మాజీ అధ్యక్షులు కె. రాజిరెడ్డి పోలీస్ రవాణా శాఖ విజ్ఞప్తి చేసారు.ఆదివారం దోమ బస్టాండ్ దగ్గర దోమ పోలీస్ ల ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ-ట్రాఫిక్ రూల్స్ విషయం పై వాహన దారులకు ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పాల్గొన్న మాజీ సర్పంచ్ రాజిరెడ్డి సైతం పలు సూచనలు చేసారు. ప్రమాదాల నివారణకు పోలీస్ డిపార్ట్మెంట్ తీసుకుంటున్న అనేక చర్యల్లో భాగంగా ప్రధాన కూడళ్ళలో గోడ రాతలు బోర్డ్స్ లాంటివి ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా సెల్ ఫోన్ వాడుతు వాహనాలు నడిపించే వారిపై చలన్లు డ్రైవింగ్ లైసెన్స్ పాయింట్స్ కాకుండా కఠిన చర్యలు తీసుకు రావాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ భీమ్ రెడ్డి సైతం వాహన దారులకు ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేసారు.

## వెల్చాల్ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం



**మోమినిపేట, జనవరి 18 (జనం సాక్షి) :** మోమిన్ పేట మండల పరిధిలోని వెలిచాల గ్రామంలో నూతన సర్పంచిగా ఎన్నికైన కావలి శ్రీనివాస్ మొట్టమొదటిసారి సంపూర్ణ మద్య నిషేధం కోసం శ్రీకారం చుట్టి,గ్రామస్తులందరి సమక్షంలో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు కోసం గ్రామస్తులందరూ సామూహిక ప్రతిజ్ఞ చేసి తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కావలిశ్రీనివాస్ మాట్లాడుతూ మన గ్రామంలో బెల్టు షాపుల్లో మద్యం అమ్మిన వారికి 25 వేలు, అలాగే మద్యం కొన్నవారికి 5000 రూపాయలు జరిమానా విధించి, చట్టరీత్యా శిక్ష విధించడం జరుగుతుందని అన్నారు. మద్యం సేవించి, కుటుంబ సభ్యులతో, గాని, గ్రామస్తులతో, గ్రామ పరిధిలోని దేవాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో సేవించిన, ఇతరులతో ఏదైనా గొడవ చేసినచో జరిమానా విధించి చట్ట రీత్యా శిక్ష విధించడం జరుగుతుంది సామూహికంగా తీర్మానించ నైనది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు యువజన సంఘాలు, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## బాన్సువాడ ఎఫ్‌సీసీ టీం ఘన విజయం



**పెద్దకొడపగల్, జనవరి 18 (జనంసాక్షి) :** పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో కాటేపల్లి క్రికెట్ బోర్డు ఆధ్వర్యంలో 11 రోజులుగా కొనసాగిన 'కాటేపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్ 3' క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. సుమారు 42 టీములు క్రికెట్ పోటీలో పాల్గొన్నాయి. చివరి ఆటలో సంగోజీపేట్ టీంపై బాన్సువాడ ఎఫ్‌సీసీ టీం 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 10 ఓవర్లలో బాన్సువాడ ఎఫ్‌సీసీ టీం 107 పరుగులు చేసింది. సంగోజీపేట్ టీం 77 పరుగులుతో రన్నరప్‌గా నిలిచింది. నిర్వాహకులు విజేతలకు నగదుతో పాటు ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. అదేవిధంగా చివరి మ్యాచ్ లో 60 పరుగులు తీసిన మహేష్ కాంబ్లేకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ ను దత్తు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు, గ్రామస్తులు ఉన్నారు.

# చేవెళ్లలో ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం



**చేవెళ్ల, జనవరి 18 (జనంసాక్షి) :** చేవెళ్లలో ప్రతి ఏడాది ఎంతో సంప్రదాయపద్ధతిలో నిర్వహించే శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివార చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ లక్ష్మి వేం కటేశ్వర స్వామి వారి రథోత్సవంలో భాగంగా దేవాయలం నుంచి చేవెళ్ల గ్రామంలోని రచ్చబండ వద్ద వరకు దాదాపు రెండు కిలో మీటర్ల దూరం వరకు స్వామి వారి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పూల రథంపై స్వామివారిని ఊరేగింపుగా మధ్యహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు సాగింది. అయితే దారి పొడువునా స్వామివారి రథంను లాగేందుకుగాను భక్తులు, యువకులు పోటిపడ్డారు. అలాగే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్వామివారికి దేవాలయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి రథోత్సవంలో పాల్గొని భక్తులతో పాటు తాను కూడా స్వామి వారి రథంను లాగారు. అయితే బ్యాండ్ మేళం, డప్పు చప్పుళ్లతో స్వామి ఊరేగింపు వైభవంగా సాగింది. దారి పొడువునా గోవిందా గోవిందా అనే నమస్మరణతో మారుమోగింది. స్వామి రథోత్సవంను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో చేవెళ్ల పట్టణ కేంద్రంకు తరలివచ్చి తిలకించి స్వామి వారిని దర్శిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం దేవస్థానం దర్మకర్తలు దేవుని వామనా చార్యులు, అనంత్ చారీ, శ్రీపాదు, పూజారులు శ్రీకాంత్, కన్న, వైభవ్, శ్రీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగి రెడ్డి, సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు ఆనం తరెడ్డి, మాజీ ఎంపీపీలు విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బాల్ రాజ్, సర్పంచ్ రామచంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్లు వెంకటమ్మ విఠలయ్య, మల్గారి మల్లా రెడ్డి, మంగలి యాదగిరి, రవీందర్ రెడ్డి చేవెళ్ల మున్సిపాలిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




# పెద్ద కంపెనీలకే ప్రయోజనం

- రాబోయే బడ్జెట్‌లో తేలనున్న ఈవీల భవిత..
- పీఎల్ఐలో మార్పులు అవసరం పెట్టుబడి పరిమితులు
- తగ్గిస్తేనే అంకురాలకు ఊరట
- డెలాయిట్ ఇండియా నివేదిక



హైదరాబాద్:దేశంలో విద్యుత్ వాహన (ఈవీ) రంగం కొన్నేళ్లుగా వృద్ధి చెందుతున్నప్పటికీ, 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ప్రస్తుత విధానాల్లో సమూల మార్పులు అవసరమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) పథకం నిబంధనలు, జీఎస్టీ రేట్లు, ఫేమ్ సబ్సిడీ కొనసాగింపు వంటి అంశాలపై 2026-27 కేంద్ర బడ్జెట్‌లో స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని డెలాయిట్ ఇండియా విడుదల చేసిన నివేదిక పేర్కొంది. పెట్రోలు, డీజిల్ వాహనాలతో సమానంగా ఈవీలు నిలబడాలంటే, ప్రభుత్వ చేయూత అవసరమని పరిశ్రమ పేర్కొంటోంది. రాయితీలతో పాటు మరికొన్ని విధానపరమైన నిర్ణయాలూ అవసరమని పేర్కొంటోంది. కేంద్రం వాహన రంగాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన పీఎల్ఐ పథకం ఉద్దేశం మంచిదే. అయితే ఈ నిబంధనలు ఈవీ రంగానికి పూర్తిగా మేలు చేయడం లేదని డెలాయిట్ నివేదిక తేల్చింది. ఈ పథకం కింద అర్హత సాధించాలంటే వాహన తయారీ కంపెనీలు అయిదేళ్లలో కనీసం రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టాలి. ఇది పెద్ద కంపెనీలకు సాధ్యమే. కానీ, కొత్త ఆలోచనలతో వస్తున్న అంకురాలు, మధ్యతరహా పరిశ్రమలకు అంత తేలిక కాదని నివేదిక వివరించింది.

ద్విచక్ర వాహన ప్రయోగాలన్నీ అంకురాల్లోనే దేశంలో ఈవీ విప్లవానికి నాంది పలికింది.. ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలోని అంకురాలే. కొత్తగా వస్తున్న స్టార్టప్‌లు బ్యాటరీ సాంకేతికతలో, మోటార్ల తయారీలో వినూత్న ప్రయోగాలు చేస్తున్నాయి. కానీ, రూ.2,000 కోట్ల పెట్టుబడి నిబంధన కారణంగా అవి పీఎల్ఐ ప్రయోజనాలకు దూరమవుతున్నాయి. అందుకే ఈ పరిమితిని తగ్గించాలని, లేకపోతే కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం పెరిగే అవకాశం ఉందని నివేదిక తెలిపింది.

**50% సమీకరణ ఎలా?**

పీఎల్ఐ పథకంలో మరో ప్రధాన అంశం.. వాహనంలో ఉపయోగించే విడిభాగాల్లో కనీసం 50% దేశీయంగా తయారై ఉండాలి. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఇది సరైనదే అయినా, క్షేత్ర పరిస్థితులు వేరేగా ఉన్నట్లు డెలాయిట్ పేర్కొంది. ఈవీలో అత్యంత కీలకమైన బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రానిక్ చిప్స్ కోసం చైనా, తైవాన్, కొరియా వంటి దేశాలపై మనం ఆధారపడుతున్నాం. దేశీయంగా గిగా ఫ్యాక్టరీలు ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. విడిభాగాలూ దొరకడం లేదు. ఫలితంగా 50% నిబంధన పాటించడం కష్టంగా మారుతోంది. అందుకే చాలా కంపెనీలు పీఎల్ఐకి అనర్హులవుతున్నాయి. దేశీయంగా సరఫరా వ్యవస్థ బలపడేవరకు ఈ నిబంధనను 50% నుంచి తగ్గించాలని డెలాయిట్ సూచించింది. వాహన తయారీదార్ల సంఘం సియామ్ కూడా ఇదే విషయాన్ని సూచించింది.

**ఐటీసీ రావడం లేదు..**

ప్రస్తుతం విద్యుత్ వాహనాలపై 5% వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ఉంది. కానీ, ఈ వాహనాలకు గుండెకాయ వంటి లిథియం అయాన్ బ్యాటరీలపై 18% జీఎస్టీ ఉంది. విడిభాగాలపైనా 18-28% జీఎస్టీ వర్తిస్తోంది. దీనివల్ల తయారీదారులకు 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)' సమస్య వస్తోందని నివేదిక తెలిపింది. ముడిసరకుపై ఎక్కువ పన్ను కట్టి, తుది ఉత్పత్తిని తక్కువ పన్నుకు అమ్మడం వల్ల కంపెనీల వద్ద పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇది వారి వర్కింగ్ క్యాపిటల్‌ను దెబ్బతీస్తోంది.పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లలో వాహనాన్ని ఛార్జింగ్ చేసుకుంటే, దాన్ని సేవ కింద పరిగణించి 18% జీఎస్టీ విధిస్తున్నారు. ఇది వినియోగదారుడికి భారంగా మారుతోంది. బ్యాటరీలు, ఛార్జింగ్ సేవలపై జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేయాలని పరిశ్రమ కోరుతోంది.

**మరో కొత్త పథకం రావాలి**


ఫేమ్-2 పథకం ముగియడం, మరో దీర్ఘకాలిక భరోసా లేకపోవడంతో వాహన కంపెనీలు కొత్త మోడళ్లను విడుదల చేసేందుకు వెనకాడుతున్నాయని నివేదిక పేర్కొంది. సబ్సిడీలు పూర్తిగా ఎత్తివేస్తే ఈవీల ధరలు 20-30% పెరగొచ్చు. పెట్రోలు, డీజిల్ వాహనాలతో పోలిస్తే, ఈవీల ధరలు అధికం. కాబట్టి, మరో మూడేళ్లయినా రాయితీలు కొనసాగించేందుకు కొత్త పథకం తేవాలని పరిశ్రమ వర్గాలూ ఆశిస్తున్నాయి. పీఎం ఇ-డ్రైవ్ వంటి పథకాలను భారీ నిధులతో ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.19,807 కోట్లు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.19,807 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.17,657 కోట్లతో పోలిస్తే ఇది 12.17 శాతం అధికం. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ లాభం 11.46 శాతం పెరిగి రూ.18,653.75 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం రూ.30,650 కోట్ల నుంచి 6.4 శాతం పెరిగి రూ.32,600 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం రూ.13,250 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 3.35 శాతంగా నమోదైంది. నిర్వహణ వ్యయాలు రూ.18,770 కోట్లకు చేరాయి. కొత్త కార్మిక చట్టాల అమలుతో ఉద్యోగుల ప్రయోజనాల కోసం బ్యాంక్‌పై అదనంగా రూ.800 కోట్ల ప్రభావం పడింది. ఇది లేకపోతే నిర్వహణ వ్యయాలు రూ.17,110 కోట్ల నుంచి రూ.17,970 కోట్లకు చేరాయి.ఆస్తుల నాణ్యతకొస్తే స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2025 డిసెంబరు 31 నాటికి రూ.35,179 కోట్లుగా నమోదయ్యాయి. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇవి రూ.36,019 కోట్లుగా ఉన్నాయి. స్థూల ఎన్‌పీఏలు 1.42 శాతం నుంచి 1.24 శాతానికి మెరుగయ్యాయి. నికర ఎన్‌పీఏలు రూ.11,588 కోట్ల నుంచి రూ.11,982 కోట్లకు పెరిగినా, నిష్పత్తి ప్రకారం చూస్తే 0.46 శాతం నుంచి 0.42 శాతానికి మెరుగయ్యాయి. ఆకస్మిక నిధి, కేటాయింపులు 10 శాతం తగ్గి రూ.2,840 కోట్లకు పరిమితమయ్యాయి.2025 డిసెంబరు 31కి బ్యాంక్ మొత్తం పరిమాణం రూ.40.89 లక్షల కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇది రూ.37.59 లక్షల కోట్లుగా ఉంది. డిపాజిట్లు 11.6 శాతం పెరిగి రూ.28.6 లక్షల కోట్లకు చేరాయి. కాసా (కరెంట్ ఖాతా, పొదుపు ఖాతా) డిపాజిట్లు 10.1 శాతం పెరిగి రూ.9.61 లక్షల కోట్లకు చేరాయి.

## దక్షిణాసియా వృద్ధికి చుక్కాని భారత్

**న్యూఢిల్లీ:**ముఖ్య ఆర్థిక వేత్తలతో డబ్ల్యూఈఎఫ్ సర్వే ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ఈ ఏడాది బలహీనంగా ఉంటాయని.. అయితే వృద్ధిపరంగా దక్షిణాసియా వెలుగు చుక్కలా మారుతుందని, ఇందులో భారత్ కీలకపాత్ర వహిస్తుందని ముఖ్య ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. అమెరికా అధిక సుంకాల ప్రభావం వంటివి ఇబ్బంది పెడుతున్నా, భారత్ రాణిస్తుందనే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సర్వే తేల్చి చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వరంగ, ప్రైవేటు కంపెనీల్లోని ముఖ్య ఆర్థిక వేత్తల అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించినట్లు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. దావోస్ ఆర్థిక సదస్సుకు ముందుగా 'చీఫ్ ఎకనామిస్ట్స్ అవుట్‌లుక్' పేరిట శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం..కొన్ని అంశాల్లో మెరుగుపడినా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి కొనసాగుతోంది. రుణాలు పెరిగిపోతుండటం, భౌగోళిక-ఆర్థిక ఉద్రిక్తతలు అధికమవ్వడం, కృత్రిమమేధ సాంకేతికత (ఏఐ) వల్ల కొత్త అవకాశాలు వస్తుండగా, ఉద్యోగాల్లో కోతల వంటి నష్టభయాలను ఎదుర్కోవాల్సి వస్తుండటం ఇందుకు కారణం.



ప్రపంచ ఆర్థిక పరిస్థితులు మరింత బలహీనపడతాయని 53% మంది ఆర్థిక వేత్తలు అంచనా వేశారు. 2025 సెప్టెంబరులో ఈ సంఖ్య 72 శాతంగా ఉంది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణాసియా వృద్ధి పటిష్ఠంగా ఉంటుందని 60% మంది, అత్యంత పటిష్ఠంగా ఉంటుందని 6% మంది పేర్కొన్నారు. ఇందుకు భారత్ కారణమవుతుందని తెలిపారు. గత సెప్టెంబరులో ఇలా అంచనా వేసినవారు 31% మందే. అమెరికా పరిస్థితులు మెరుగవుతాయని 69% మంది, వృద్ధి పటిష్ఠంగా ఉంటుందని 11% మంది అంచనా వేశారు. ఐరోపా వృద్ధి బలహీనంగానే ఉండొచ్చని 53% మంది అంచనా వేశారు. ఒకమాదిరి వృద్ధితో సాగొచ్చని 44% మంది వివరించారు.

అమెరికా సుంకాలు ఇబ్బంది పెడుతున్నా, భారత ఆర్థిక వ్యవస్థ సెప్టెంబరు త్రైమాసికంలో 8.2% వృద్ధి చెందడాన్ని నివేదిక ప్రస్తావించింది. కార్మిక సంస్కరణలకు తోడు అమెరికా టెక్నాలజీ సంస్థల పెట్టుబడుల ఫలితంగా ఏఐ వినియోగం పెరుగుతోందని వివరించింది. రాబోయే 10 ఏళ్లలో వృద్ధిపై ఏఐ పెట్టుబడుల ప్రభావం గణనీయంగా సానుకూలంగా ఉంటుందని 36% మంది అంచనా వేశారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నా, పరపతి విధానాల్లో మార్పు ఉండకపోవచ్చని 85% మంది పేర్కొన్నారు. క్రిప్టోలు, బంగారంపై క్రిప్టోకరెన్సీల భవిత ఆశాజనకంగా ఉండకపోవచ్చని, మార్కెట్ ఒడుదొడుకులు ఇందుకు కారణమవుతాయని 62% మంది అంచనా వేశారు. బంగారం ధర గరిష్ఠస్థాయిలకు చేరిందనే 54% మంది పేర్కొన్నారు. కృత్రిమ మేధతో స్వల్పంగా ఉద్యోగ కోతలుంటాయ్ కృత్రిమమేధ వల్ల ఉత్పాదకత అమెరికా, చైనాల్లో రాబోయే రెండేళ్లలో మెరుగవుతుందనే అంచనాను ప్రతి అయిదుగురు ఆర్థిక వేత్తల్లో నలుగురు వ్యక్తం చేశారు. ఈ సాంకేతికతను స్వీకరించడంలో ఐటీ రంగం వేగంగా ఉంది. తరవాత స్థానాల్లో ఆర్థిక సేవలు, సరఫరా వ్యవస్థలు, ఆరోగ్య సంరక్షణ, ఇంజినీరింగ్, రిటెయిల్ రంగాలుంటాయి. ఏఐ వల్ల ఉద్యోగ కోతలు రాబోయే రెండేళ్లలో కొంతమేర ఉంటాయనే మూడింట రెండు వంతుల మంది ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. 10 ఏళ్ల పాటు ఉద్యోగ కోతలుంటాయని 57% మంది, దీర్ఘకాలంలో ప్రయోజనాలుంటాయని 37% మంది అంచనా వేస్తున్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
| --- | --- |
| ₹ 1,31,450 (22 క్యారెట్లు) | ₹ 1,43,400 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 3,06,000

# నోబెల్‌ను సొమ్ముచేసుకున్నారు

**వదులుకున్న గ్రహీతలు చాలా మందే.. • కొందరు వేలం వేస్తే.. ఇంకొందరు అమ్మేశారు**

జనంసాక్షి:నోబెల్ ప్రైజ్.. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోవాలని ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శాస్త్రవేత్తలు, రచయితలు కలలు కంటారు. ఈ అవార్డు అందుకోవడాన్ని అత్యంత గౌరవంగా భావిస్తారు. అలాంటి పురస్కారాన్ని వెనెజువెలా విపక్ష నేత మారియా కొరీనా మచాడో.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇచ్చేశారు. ఇది చర్చనీయాంశంగా మారింది. ఇలా నోబెల్ పురస్కారాన్ని వదులుకోవడం కొత్తేం కాదు. గతంలో పలువురు గ్రహీతలు అనేక కారణాలతో వాటిని వేలం వేయడం, విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం చేశారు. ఆ సందర్భాలేంటో చూద్దాం..!2021లో రష్యా జర్నలిస్టు దిమిత్రి మురాతోవ్ నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. ఆ మరుసటి ఏడాదే దాన్ని వేలం వేశారు. రికార్డు స్థాయిలో 103.5 మిలియన్ డాలర్లు పలికింది. ఆ మొత్తాన్ని ఉక్రెయిన్ శరణార్థుల చిన్నారుల సంక్షేమం కోసం యునిసెఫ్‌కు విరాళంగా ఇచ్చారు.అమెరికా




శాస్త్రవేత్త జాన్ నాష్ 1994లో ఆర్థికశాస్త్రంలో నోబెల్ తీసుకున్నారు. 2019లో క్రిస్టీస్ ఆక్షన్ సంస్థ ఆ అవార్డును వేలం వేయగా.. 7,35,000 డాలర్లు పలికింది. ఈ మొత్తాన్ని జాన్ సి.ఎం.నాష్ ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చేశారు.1962లో అమెరికా శాస్త్రవేత్త జేమ్స్ డి.వాట్సన్ వైద్యశాస్త్రంలో నోబెల్ అందుకున్నారు. శాస్త్రీయ పరిశోధనల కోసం విరాళాలు సేకరించేందుకు ఆ పురస్కారాన్ని విక్రయించారు. దీన్ని రష్యా బిలియనీర్ అలిషెర్ ఉస్మనోవ్ కొనుగోలు చేశారు. అయితే ఆ పురస్కారాన్ని అలిషెర్ తన వద్ద ఉంచుకోకుండా తిరిగి వాట్సన్‌కే ఇచ్చేశారు. ఈ అవార్డు శాస్త్రవేత్త వద్ద ఉండటమే సరైందని ఉస్మనోవ్ పేర్కొన్నారు.1939లో సోవియట్ యూనియన్.. ఫిన్‌లాండ్‌ను ఆక్రమించింది. ఆ సమయంలో ఫిన్‌లాండ్ ప్రజల కోసం విరాళాలు సేకరించేందుకు డెన్మార్క్ శాస్త్రవేత్తలు నీల్స్ బోర్, ఆగస్ట్ క్రోగ్ తమ నోబెల్ పురస్కారాలను వేలం వేశారు. ఈ వేలంలో అవార్డు కొనుక్కున్నవారు కొంతకాలం తర్వాత డెన్మార్క్ మ్యూజియంలకు వాటిని ఇచ్చేశారు.నీల్స్ బోర్ కుమారుడు ఆగే బోర్ కూడా 1975లో ఫిజిక్స్‌లో నోబెల్ అందుకున్నారు. దాన్ని 2011లో వేలం వేశారు. 2019లో ఆయనకు మరోసారి నోబెల్ దక్కడం విశేషం.నాజీ సానుభూతిపరుడైన నార్వే రచయిత నట్ హామ్సన్‌కు 1920లో నోబెల్ సాహిత్య పురస్కారం దక్కింది. దాన్ని ఆయన రెండో ప్రపంచ యుద్ధం సమయంలో నాజీ జర్మనీ మంత్రి జోసెఫ్‌కు బహుమతిగా ఇచ్చేశారు.తన నోబెల్‌ను ట్రంప్‌నకు ఇచ్చిన మచాడో.. వెనెజువెలా ప్రజల స్వేచ్ఛ కోసం కృషి చేస్తున్న ట్రంప్‌నకు ఇది గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ పరిణామాలపై నోబెల్ కమిటీ కూడా స్పందించింది. ఇలా తన పురస్కారాన్ని మరొకరికి ఇవ్వడం చట్టబద్ధం కాదని స్పష్టంచేసింది. నోబెల్ కమిటీ నిబంధనల ప్రకారం.. ఒకసారి నోబెల్ ప్రకటించిన తర్వాత.. దాన్ని రద్దు, బదిలీ చేయడం లేదా ఇతరులతో పంచుకోవడం కుదరదు. అయితే గ్రహీతలు తమ మెడల్ లేదా నగదు బహుమతిని ఏదైనా చేసుకునేందుకు స్వేచ్ఛ ఉంటుంది. కానీ, అధికారికంగా మాత్రం పురస్కారం వారి పేరు మీదే ఉంటుంది.




## ఫిర్యాదుల పరిష్కారం మరింత వేగంగా..

### జులై 1 నుంచి అమల్లోకి: ఆర్‌బీఐ

హైదరాబాద్: బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులతో పాటు, ఇతర నియంత్రిత సంస్థల ఖాతాదారుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా 'రిజర్వ్ బ్యాంక్-సమగ్ర అంబుడ్స్‌మన్ పథకం -2026'ను తీసుకురానుంది. ఇందుకోసం 'రిజర్వ్ బ్యాంక్- అంబుడ్స్‌మన్ స్కీం 2025'కు కొన్ని సవరణలతో ముసాయిదాను శుక్రవారం విడుదల చేసి, ప్రజల అభిప్రాయాలు కోరింది. ఇవి కూడా వచ్చాక, క్రోడీకరించి, నిబంధనలు ఖరారు చేస్తుంది. కొత్త పథకం 2026 జులై 1 నుంచి అమల్లోకి రానుంది. ఫిర్యాదిదారులకు తక్కువ ఖర్చుతో, వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే దీని ప్రధాన లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. విచారణలు క్లుప్తంగా ఉంటాయని, ఇవి సాధారణ సాక్ష్యాధారాల నిబంధనలకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఈ బాధ్యతలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ తన అధికారుల నుంచి ఒకరు లేదా అంతకంటే ఎక్కువమందిని ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ డిప్యూటీ అంబుడ్స్‌మన్‌లుగా నియమిస్తుంది. సాధారణంగా వీరి నియామక కాలపరిమితి ఒకేసారి మూడేళ్ల వరకు ఉంటుంది.ఫిర్యాదుల స్వీకరణ, పరిశీలన కోసం ఆర్‌బీఐ ఒకటి లేదా పలు చోట్ల సీఆర్‌పీసీ (సెంట్రలైజ్డ్ రిసీప్ట్ అండ్ ప్రాసెసింగ్ సెంటర్)లు ఏర్పాటు చేయనుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా సులభంగా సమర్పించే వీలుంటుంది. నూతన విధానంలో వివాదానికి సంబంధించిన మొత్తంపై గరిష్ఠ పరిమితి విధించలేదు. అంబుడ్స్‌మన్ లేదా డిప్యూటీ అంబుడ్స్‌మన్ ఆ వివాదాలపై రాజీ కుదర్చడం లేదా తగిన తీర్పు (అవార్డు) ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరిస్తారు. ఖాతాదారులకు కలిగిన నష్టానికి సంబంధించి, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశించే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీనికి అదనంగా మరో రూ.3 లక్షల వరకు పరిహారం అందించే వీలుందని ఆర్‌బీఐ వెల్లడించింది.

## మౌని అమావాస్య వేళ.. 3.15 కోట్ల మంది భక్తుల పుణ్యస్నానాలు

లక్నో:మౌని అమావాస్య సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయా గ్‌రాజ్‌కు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ పరిసరాలు భక్తజనంతో సందడిగా మారాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి త్రివేణి సంగమంలో 3.15 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు. మాఘమేళా పవిత్ర స్నానాల కోసం మొత్తం 12,100 అడుగుల పొడవైన స్నానపు ఘాట్‌లను నిర్మించామని, ప్రజలకు అవసరమైన అన్ని ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సాధారణ, ట్రాఫిక్ పోలీసులతో పాటు ఏదైనా అత్యవసర కేసుల్లో సాయం అందించేందుకు వైద్య నిపుణుల బృందాలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. భద్రతా నియమాలు పాటిస్తూ, అధికారులకు సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.



## ఎవరినీ బాధ పెట్టాలనుకోలేదు

### ఏఆర్ రెహమాన్

**జనంసాక్షి:**బాలీవుడ్‌పై ఓ ఇంటర్వ్యూలో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన వివరణ ఇచ్చారు. కొన్ని సందర్భాల్లో ఒకరి ఉద్దేశాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. తన మాటలతో ఎప్పుడూ ఎవరినీ బాధ పెట్టాలని కోరుకోలేదన్నారు. ఈమేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ చేశారు. సంగీతమనేది ఎల్లప్పుడూ దేశ సంస్కృతిని అనుసంధానించేందుకు, వేడుకగా చేసుకునేందుకు, గౌరవించేందుకు ఒక మార్గంగా ఉందని తెలిపారు."భారత్ నాకు స్ఫూర్తి. ఈ దేశం నా గురువు, ఇల్లు కూడా. భారతీయుడిగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను. నా భావాలను స్వేచ్ఛగా ప్రకటించే, భిన్న స్వరాలతో పనిచేసే అవకాశాన్ని ఈ దేశం కల్పించింది. కొన్నిసార్లు ఒకరి ఉద్దేశాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని తెలుసుకున్నాను. సంగీతం ద్వారా ఉత్తేజపరచడం, గౌరవించడం, సేవ చేయడమే నా లక్ష్యం. ఎప్పుడూ ఎవరికీ బాధ కలిగించాలని కోరుకోలేదు. నా నిజాయతీని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. వేవ్స్ సమిట్‌లో ప్రధాని మోదీ ఎదుట ప్రదర్శించిన 'ఝాలా' సంగీతం నుంచి.. యువ నాగా సంగీతకారులతో కలిసి పనిచేయడం వరకు, దేశంలో మొట్టమొదటి మల్టీకల్చరల్ వర్చువల్ బ్యాండ్‌ను



సృష్టించడం నుంచి.. హాన్స్ జిమ్మర్‌తో కలిసి రామాయణం సినిమాకు సంగీతం అందించడం వరకు.. ప్రతి ప్రయాణం నా లక్ష్యాలను బలపర్చింది" అని ఏఆర్ రెహమాన్ పేర్కొన్నారు.

**అసలేం జరిగింది?**

రెహమాన్ ఇటీవల ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో 'బాలీవుడ్‌లో తమిళ్ లేదా మహారాష్ట్రేతరులపై పక్షపాతం ఉంటుందా?' అని ప్రశ్నించగా.. వ్యక్తిగతంగా తానెప్పుడూ ఎలాంటి వివక్షను ఎదుర్కొలేదని తెలిపారు. "ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో 'పవర్ షిఫ్ట్' నెలకొంది. సృజనాత్మకత లేని వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీనికి మతపరమైన అంశం ఓ కారణమై ఉండొచ్చు. అది నాకు నేరుగా ఎదురుకాలేదు గానీ.. గుసగుసలు వినిపించాయి. నేను పని కోసం వెతకను. చిత్తశుద్ధి ఉంటే పనే మన వద్దకు వస్తుందని విశ్వసిస్తా" అని రెహమాన్ అన్నారు.

## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

కొనుగోళ్లపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు స్థానిక వ్యవసాయ భూములను వాస్తవ ధర కంటే పది రెట్లు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి ధోరణులు అమెరికాలో ఆహార ధరల పెంపునకు కారణం కావొచ్చన్నారు.అమెరికాతో వాణిజ్యం, రష్యాతో కొనసాగిస్తున్న విధానాలపై భారత్‌ను లక్ష్యంగా చేసుకుని నవారో గతంలోనూ పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు. భారత్ అత్యధిక సుంకాలు విధించడం వల్ల అమెరికా ఉద్యోగాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. లాభం కోసమే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, ఉక్రెయిన్‌తో మాస్కో చేస్తున్న యుద్ధాన్ని పోషిస్తోందని నోరు పారేసుకున్నారు. భారత్ ఈ వ్యాఖ్యలను కొట్టిపారేసింది. రష్యా నుంచి తాము చమురు కొనుగోలు చేస్తోంది కేవలం ఇంధన భద్రత కోసమేనని పేర్కొంది.




## బంగారం ధరలను.. రోజంతా మార్చకూడదు

న్యూఢిల్లీ:దేశంలో బంగారం ధరల నిర్ణయంలో కొందరు వ్యాపారులు అనుసరిస్తున్న తీరు వల్ల, విశ్వసనీయత తగ్గుతుందని మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి. అహమ్మద్ పేర్కొన్నారు. బంగారం అంతర్జాతీయ ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ, బంగారంపై వర్తించే పన్నులు కలిపి దేశీయంగా పసిడికి ధర నిర్ణయించడం సంప్రదాయకంగా వస్తుంది. ముందురోజు రాత్రి సమయంలో ట్రేడింగ్ ముగిసేసమయానికి ఉన్న ధరకు అనుగుణంగా, ప్రతిరోజు ఉదయం 9.30 గంటల కల్లా, ఆయా ప్రాంతాల అసోసియేషన్లు బంగారం ధరను ప్రకటించడం సంప్రదాయంగా వస్తోందని అహ్మద్ గుర్తు చేశారు. ధరల్లో మరీ అధిక ఒడుదొడుకులు ఏర్పడకపోతే, ఉదయం ప్రకటించిన ధరనే రోజంతా ఆభరణాల వర్తకులు అనుసరించాల్సి ఉంది. అయితే ఇటీవలి కాలంలో కొందరు వ్యాపారులు ఏకపక్షంగా ఒక రోజులోనే పలు మార్లు బంగారం ధరలను పెంచేస్తున్నారని అన్నారు

# విద్యా వ్యవస్థ బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం





**షబ్బీర్ అలీ**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 18 (జనంసాక్షి):** ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే విద్యా రంగానికి పునాదులు పడ్డాయని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో విద్యా వ్యవస్థను పటిష్ఠ పరుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు.కామారెడ్డి పట్టణంలోని డైరీ టెక్నాలజీ కాలేజీలో రూ. 35 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.గత పదేళ్ల పాలనపై విమర్శలు గుప్పించారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి రాష్ట్రంలో రెండే రెండు డైరీ కాలేజీలు మంజూర య్యాయని ఆయన గుర్తు చేశారు. అందులో ఒకటి కామారెడ్డిలో కాగా, రెండోది తిరుపతిలో ఏర్పాటైందని తెలిపారు.పశుసంవర్ధక శాఖ మరియు పాల ఉత్పత్తి రంగంలో నిపుణులను తయారు చేయడంలో ఈ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.గత పదేళ్లలో అభివృద్ధి శూన్యమని,గత పదేళ్ల ప్రభుత్వ పాలనలో విద్యా రంగాన్ని మరియు ఉన్నత విద్యా సంస్థలను పూర్తిగా విస్మరించారని షబ్బీర్ అలీ విమర్శించారు. కామారెడ్డి డైరీ కాలేజీ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఏడాది నుంచే పీజీ కోర్సు ప్రారంభం డైరీ టెక్నాలజీ కాలేజీలో పీజీ కోర్సును తీసుకురావడానికి ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు.రాబోయే విద్యా సంవత్సరం నుండే తరగతులు ప్రారంభమయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని స్పష్టం చేశారు.మౌలిక సదుపాయాల కల్పన కళాశాల ఆవరణలో విద్యార్థులకు, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా రూ. 35 లక్షలతో సిసి రోడ్ల పనులకు శ్రీకారం చుట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో కళాశాలను అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకే కృషి చేస్తుంది. కామారెడ్డి డైరీ టెక్నాలజీ కళాశాలను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన విద్యా సంస్థగా తీర్చిదిద్దుతాం అని మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఈయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# రామగుండం మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగురవేద్దాం

- హ్యాట్రిక్ విజయాన్ని కేటీఆర్ కు కానుకగా ఇద్దాం
- ఎన్నికల సమరశంకం పూరించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, (జనంసాక్షి):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై మరోమారు గులాబీ జెండా ఎగురవేద్దాం.. ఈ హ్యాట్రిక్ విజయాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామన్నకు గిఫ్ట్ గా ఇద్దామని రామగుండం మాజీ ఎమ్మెల్యే జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. అదివారం గోదావరిఖని మార్కండేయ కాలనీ శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్లో రామగుండం బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు టిబిజికెఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజి రెడ్డి నాయకులు కౌశిక హరి మూల విజయ రెడ్డి గోపు అయులయ్య యాదవ్ పాల్గొన్నారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారు మాట్లాడుతూ.. రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులుంతా సైనికుల వలే పనిచేయాలని, మన లక్ష్యం మేయర్ పీఠం అన్నారు. ప్రతి డివిజన్ లో బీఆర్ఎస్ గెలుపు కోసం శ్రేణులు పని చేయాలన్నారు. 2 సంవత్సరాలుగా రామగుండం లో రాక్షస పాలన సాగుతుందని అభివృద్ధి సాకుతో కమీషన్ల కుల్చివేతల పర్వం సాగుతుందన్నారు. చిరు వ్యాపారులు దుకణాలు కుల్చి వారి జీవితాలను రోడ్డు పడవేసారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుర్మార్గపు పాలనకు ప్రజల్లోకి తీసుకువేళ్లాలని సూచించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ అభ్యర్థులను బారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు బీ ఆర్ ఎస్ కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి ప్రజలకు వివరించాలనీ అన్నారు. కాంగ్రెస్ రెండేండ్లలో చేసింది ఏమి లేదని బీ ఆర్ ఎస్ తలపెట్టిన పనులకు కొబ్బరికాయలు కొడుతూ ప్రచారాలు చేసుకుంటున్నారని అన్నారు. రామగుండం రాక్షస పాలన, కూల్చివేతల పాలన కొనసాగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మైసాలను బీ ఆర్ ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ బారీ మెజారిటీతో బీ ఆర్ ఎస్ అభ్యర్థులను గెలిపించాలనీ కోరారు. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపిక సర్వే సమన్వయ కమిటీలు నివేదిక అధారంగా టికేట్లు నిర్ణయించండం జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా ఎంటో చూపుదామని ఎన్నికల సమరశంకం పూరించామని అన్నారు. ఈ సమావేశంలో టిబిజికేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, నడిపెల్లి అభిషేక్ రావు, పి.టి స్వామి, అముల నారాయణ, పర్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల మందపై చిరుత పులి దాడి



**పెద్ద కొడప్గల్ జనవరి 18 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి తాండ గ్రామ శివారులో గొర్రెల మందపై ఆదివారం చిరుత పులి దాడి చేసింది. బర్దావల్ కిషన్ గొర్రెల మందను మేత మేపడానికి అడవికి తీసుకెళ్లగా ఊర గట్టు (అడవి) లొంక అనే ప్రాంతం వద్ద చిరుత పులి దాడి చేసినట్లు తెలిపారు. ఒక గొర్రెను గాయపరిచి, మరో సుమారు 15 వేల రూపాయల గొర్రెను ఎత్తుకెల్లినట్లు తెలిపారు. గాయపడిన గొర్రెకు గోపాలమిత్ర రవి చికిత్స అందించారు. గత 15 రోజుల క్రితం కూడా చిరుత పులి దాడిలో తన రెండు గొర్రెలు మృతి చెందినట్లు కిషన్ తెలిపారు.

# తెలుగుజాతి గౌరవాన్ని చాటిన మహానేత ఎన్‌టీఆర్..

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథని, (జనంసాక్షి) :** తెలుగుజాతి గౌరవాన్ని చాటిన మహానేత స్వర్గీయ ఎన్‌టీ రామారావు అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మంథని బొక్కలవాగుపై ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సినీ రంగంలో నటనకు కొత్త నిర్వచనం ఇచ్చిన ఎన్టీఆర్, రాజకీయాల్లో సామాన్యుడి స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికి తెలుగుప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప నాయకులు ఎన్‌టీఆర్ అని, ఆయన సేవలను మరిచిపోరని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అదృశ్యం



**తాండూరు, జనవరి 18 (జనంసాక్షి):** పట్టణంలోని తులసి నగర్ శ్రీ వినాయక ఆలయ సమీపంలో నివసించే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అరుణ అదృష్టమయ్యింది. ఆమె భర్త దేవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బడంగ్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అరుణ సైన్స్ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిం స్తూన్నారు.గత శనివారం ఉదయం విధులకు వెళ్లేందు కు గాను తాండూరు నుండి హైదరాబాద్ వెళ్లి ఇమ్లిబన్ బస్ స్టేషన్ నుండి కొంచెం మతిస్థిమితం లేక ఏ బస్సు ఎక్కి ఎటు పోయిందోనని, బంధువులు తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదని తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 919490269 308 నెంబర్ కి సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అత్తింటివారు అవమానించారని.. యువకుడు ఆత్మహత్య



**కడెం, జనవరి 18 (జనంసాక్షి):** ఉరి పెట్టుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కడెం మండలంలోని నవాబ్ పేట్ గ్రామంలో చోటుచేసుకుంది. కడెం ఎస్సై సాయి కిరణ్ తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని నవాబ్ పేట్ గ్రామానికి చెందిన చింతకుంట మహేష్ గత రెండు సంవత్సరాల క్రితం జన్నారం మండలంకి చెందిన అమ్మాయితో పెళ్లి అయ్యింది. అయితే మహేష్ తన భార్యతో సంక్రాంతి పండగరోజు అనివార్య కారణాలవల్ల గొడవ పడి తన భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని జన్నారం మండలంలోని అక్క పెళ్లి గూడెంలో ఇరువర్గాల పెద్దల మధ్యల పంచాయతీ నిర్వహించగా మాటమాట పెరిగి మహేష్ బామ్మర్దులు అతడిని కాలితో తన్ని చేతితో కొట్టారు. తన పెద్ద అత్త, మామ భార్య బూతులు తిట్టగా.. పంచాయతీలో అందరి ముందు అవమానపరిచి నందుకు మనస్థాపానికి గురై నవాబ్ పేటలోని తన ఇంట్లో సూసైడ్ నోట్ రాసుకొని ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.సాయికిరణ్ తెలిపారు.

## మంత్రి వెంకట రెడ్డి,

# సీఎస్ రామకృష్ణారావును కలిసిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి జనవరి 18 (జనంసాక్షి) :** మేడారంకు వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మార్గమధ్యంలో హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్క అందించి సాదరంగా స్వాగతం పలికారు. వరంగల్ ఎన్‌ఐటీ గెస్ట్ హౌజ్‌కు చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావును జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్క అందించి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు డాక్టర్ సంపత్ కుమార్ రాం రాం..!

## పార్టీలో తనకు ఆదరణ లభించడం లేదనే నిర్ణయం



**తాండూరు జనవరి 18(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీకి డాక్టర్ సంపత్ కుమార్ త్వరలో గుడ్ బై చెప్పనున్నారు. కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీలో తనకు ఆదరణ లభించడం లేదని ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరిస్తున్నారని వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు .ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ జనంసాక్షి ప్రతినిధితో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి గెలుపులో కీలక పాత్ర వహించాలని తెలిపారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రతి కార్యక్రమాల్లో ముందుండి కేవలం 15 రోజుల్లోనే ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి విజయానికి నాంది పలికామన్నారు. ఈ మధ్యకాలంలోనే కాంగ్రెస్ పార్టీలో ఆదరణ లభించడం లేదని ఎలాంటి కార్యక్రమాలకు తనకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షం వహిస్తున్నారని విమర్శించారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీని వీడి మరో పార్టీలకి చేరభోనని స్పష్టం చేశారు. నూటలుగా ఉంటూ తన మిత్రుడు సాయి పూర్ నర్సింహులు గెలుపే లక్ష్యంగా వ్యవహరిస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో డాక్టర్ సంపత్ కుమార్ కాంగ్రెస్ పార్టీని వీడితే పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే..

# ఇంటి స్థలం కోసం వ్యక్తి దారుణ హత్య

- పరారీలో నిందితులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నర్సింగ్ యాదయ్య



**తాండూరు జనవరి 18 (జనంసాక్షి) :** ఇంటి స్థలం కోసం ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవ హత్యకు దారితీసింది. ఈ సంఘటన తాండూర్ పట్టణంలో ఆది వారం చోటుచేసుకుంది. డీఎస్పీ నర్సింగ్ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపల్ పరిధి లోని మాణిక్ నగర్‌లో హత్య జరిగినట్లు బాధితుల నుంచి 100కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించగా రెహమాన్ (24) శరీరంపై కత్తి పోట్లతో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ విషయమై బాధితులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. మోసిన్, రెహమాన్ ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఇంటి స్థలం విషయమై గొడవ జరిగింది. ఫలితంగా మాట మాట పెరగ డంతో మృతుడి అన్న మోసిన్ తన బావమరిది గౌస్ సాయం తో బలమైన ఆయుధంతో రెహమాన్ తల, మెడ, కడుపు భాగంలో దాడి చేసి హత్యచేశారు. ఈ క్రమంలో నిందితులు ఇరువురు పరా రీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ వెల్లడించారు.

# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**వొడితల ప్రణవ్**



**హుజురాబాద్, జనవరి 18 (జనంసాక్షి) :** ప్రభుత్వానికి ప్రజలకు మంచి చేస్తున్న ప్రతి కార్మికునికి, ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా, వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర డైరీని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ... ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తాను కట్టుబడి ఉన్నానని, దాంతో పాటు కొన్ని సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని వాటిని పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందరికి అందేలా తాను చూసుకుం టానని, ఆ బాధ్యత నాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సహాయ కర్త వర్ధినేని రవీందర్ రావు, టీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంకు పూర్తి చేసి నీళ్లు అందించాలే..!



**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని, (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పథకంలో బాగంగా మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడలో చేపట్టిన వాటర్ ట్యాంక్‌ను ఆరుమాసాల్లో పూర్తి చేస్తామని చెప్పిన పాలకులు ఏడాదిన్నరైనా పూర్తి చేయ లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడలో 2024 జూలై 15న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారని అన్నారు. ఆదివారం అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను స్థానిక నాయ కులు, కాలనీవాసులతో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడు తూ.. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ వాడ, పోచమ్మవాడతో పాటు తదితర వీధులకు నీళ్లు అందించేందుకు కేంద్రం 50శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50శాతం నిధులతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంఖుస్థాపన చేసి ఆరుమాసాల్లో ట్యాంకును పూర్తి చేసి నీళ్లు అంది స్తామని అన్నారని ఆయన గుర్తు చేశారు. ఏడాదిన్నర అయినా ట్యాంక్ నిర్మాణానికి అతీగతీ లేదని ఆయన అన్నారు. నియోజకవర్గంలో 80 శాతం ఉన్న ఎస్సీ ఎస్టీబీసీ మైనార్టీ అగ్రవర్ణాల్లోని పేదల ఆకలి తీరాలంటే తాము నోరు తెరువాల్సిందేనని, ప్రతి విషయంలోనూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. ఈ ప్రాంత ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే వాటర్ ట్యాంక్‌ను పూర్తి చేసి తాగునీటిని అందించాలని ఈ సందర్బంగా డిమాండ్ చేశారు.

# ఎన్టీఆర్ తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీక

## ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన తెలుగు తమ్ముళ్లు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 18 (జనంసాక్షి) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగు ప్రజల ఆశాజ్యోతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి వేడుకలను కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో పార్లమెంట్ అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మానేరు బ్రిడ్జి వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. తర్వాత హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమం, వంచ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఒక కుటుంబ పార్టీ పాలనలో రాష్ట్రంలో అరాచకాలు, దాడులు, ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్న తరుణంలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల వారి అర్ధనాదాలు విన్న ఎన్టీఆర్ తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఆంధ్ర రాష్ట్రంలోని పేద ప్రజల కోసం కూడు, గూడు, నీడ నినాదంతో వారి రుణం తీర్చుకోవాలని ప్రజలే దేవుళ్ళు-సమాజమే దేవాలయం అనే నినాదంతో హైదరాబాదు నడిబొడ్డున తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల కాలంలోనే పార్టీని అధికారంలోకి తెచ్చిన గొప్ప యుగ పురుషుడు ఎన్టీఆర్, భౌతికంగా తెలుగు ప్రజలకు దూరమైన వారి గుండెల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదిం చుకున్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి పదవి చేపట్టాక పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం జరిగింది. అందులో భాగంగానే రెండు రూపాయలకు కిలో బియ్యం, జనతా వస్త్రాలు, సగం ధరకే దుస్తులు, మహిళలకు ఆస్తిలో హక్కు ఇలా అనేక పథకాలు పేద ప్రజల కోసం అందించడం జరిగింది. ఇంటింటికి దీపం పథకం అందించారు. పటేల్, పట్వారి వ్యవస్థ రద్దు చేయడంలో ఎన్టీఆర్ ప్రముఖ పాత్ర పోషించారు. పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా కోరుచున్నామని ఎన్టీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని అందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కరీంనగర్ టిడిపి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నాగుల బాల గౌడ్, దామర సత్యం, పర్లపల్లి రవీందర్, రొడ్డ శ్రీనివాస్, రొడ్డ శ్రీధర్,లొంకా భాస్కర్ శర్మ, తాటికొండ శేఖర్,సాయిల్లా రాజమల్లు, తాటికొండ శేఖర్, సందబోయిన రాజశం, ఎర్రవెల్లి వినీత్, బోలుమల్ల సదానందం, ఆకుల కాంత య్య, పెరుమాండ్ల సతీష్ గౌడ్, దాసరి రామకృష్ణ రెడ్డి,ఇట్టా మల్లేశం,నరేందర్ దత్తు, కళ్యాడపు నరేష్, బోగా సీతయ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చిన్నారుల క్యాన్సర్ చికిత్స కోసం..

- సినీ నటులు జగపతిబాబు, సంయుక్త మీనన్ చేతుల మీదుగా 9వ ద్వైవార్షికఅబశ్రీశ్రీ 'అపర్ణ క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిష్ణ ప్రారంభం
- పోటీలు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు



**హైదరాబాద్, జనవరి 18 (జనంసాక్షి):** క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం, ఆర్థికంగా వెనుకబడిన చిన్నారుల క్యాన్సర్ చికిత్సకు అండగా నిలవడం లక్ష్యంగా క్యూర్ ఫౌండేషన్, అపోలో క్యాన్సర్ సెంటర్స్ ఆధ్వర్యంలో 9వ ద్వైవార్షిక 'అపర్ణ క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిష్ణను గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్, కంట్రీ క్లబ్‌లో సినీ నటులు జగపతి బాబు, సంయుక్త మీనన్, క్యూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పీ విజయ్ ఆనంద్ రెడ్డి అధికారికంగా ప్రారంభించారు. ఈ పోటీలు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరగనున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో సుమారు 450 మందికి పైగా గోల్ఫర్లు, కార్పొరేట్ నేతలు, సెలబ్రిటీలు సామాజిక బాధ్యతతో నిధుల సేకరణకు మద్దతు తెలపనున్నారు. ఈ ఛాంపియన్‌షిప్ ద్వారా సమాజంలో క్యాన్సర్‌పై అవగాహనను పెంపొందించడం, ఆర్థికంగా వెనుకబడిన క్యాన్సర్ బాధితుల చికిత్సకు నిధులు సమీకరించడం ప్రధాన లక్ష్యం. మూడు రోజుల పాటు నాలుగు సెషన్లలో ఈ పోటీలు జరగనున్నాయి. దీంతో ఇది ఈ ప్రాంతంలో నిర్వహించబడుతున్న అతిపెద్ద దాతృత్వ గోల్ఫ్ ఈవెంట్లలో ఒకటిగా నిలవనుంది. ఈ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌ను స్టేబుల్‌ఫోర్డ్ ఫార్మాట్‌లో 100 శాతం హ్యాండిక్యాప్ విధానంతో నిర్వహించనున్నారు. దీని వల్ల ఈ పోటీలు ఆత్మీయతతో పాటు అందరికీ భాగస్వామ్యం కల్పించే ఉత్సాహభరిత వాతావరణంలో జరగనున్నాయి. ఇది కేవలం ఒక క్రీడా పోటీగా మాత్రమే కాకుండా క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడే శక్తివంతమైన వేదికగా రూపుదిద్దుకుంటుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటులు జగపతిబాబు మాట్లాడుతూ చికిత్స ఖర్చు భరించలేని రోగులకు కరుణతో ముందుకు వచ్చే మంచి మనుషులు ఉన్న చోటే ఆశకు అర్థం ఉంటుందన్నారు. క్యూర్ ఫౌండేషన్ దాతృత్వ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ రోగులను తమ జీవన పోరాటంలో విజేతలుగా మారుస్తుందన్నారు. ఈ సహాయం కేవలం రోగులకు పరిమితం కాకుండా, ఆయా కుటుంబాలకు ధైర్యం, భరోసా అందిస్తుందన్నారు. మనమంతా ఒక సమూహ శక్తిగా మారినప్పుడు.. ఈ ప్రపంచాన్ని మంచి నివాసంగా మార్చవచ్చన్నారు. వైద్యులను సాధారణంగా దేవతలతో పోలుస్తారన్నారు. బాధలో ఉన్న రోగులకు డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి ఒక ఋషిలా, ఆశకు దారి చూపించే దీపస్తంభంలా నిలుస్తున్నారని కొనియాడారు. ఇలాంటి మానవతావాదుల కరుణ, నిస్వార్థ సేవ వల్లే రోగులు కొత్త ఆశను పొందగలుగుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సినీ సంయుక్త మీనన్ మాట్లాడు తూ ఈ నెల 14వ తేదీన విడుదలైన నా సినిమా అద్భుతమైన విజయాన్ని సాధించిందన్నారు. ఆ విజయానికి కృతజ్ఞతగా మొత్తం తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామినిదర్శించుకున్నామని చెప్పారు.

# చెరువుల్లో మట్టిపోయడంపై హైడ్రా ఆగ్రహం

- అన్ని చెరువుల్లో ఫెన్సింగ్‌కు కమిషనర్ ఆదేశం
- బుల్కాపూర్ నాలా పునరుద్ధరణకు చర్యల

**హైదరాబాద్ జనవరి 18 (జనంసాక్షి):** చెరువుల ఎఫ్టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్), బఫర్ పరిధిల్లో మట్టి పోయడాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీరియస్‌గా పరిగణించారు. చెరువుల స్వరూపాన్ని మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మట్టి పోసి నింపడానికి అవకాశం లేకుండా ఫెన్సింగ్ వేయాలని నిర్ణయించారు. అలాగే మట్టి ఎవరు పోసారో వాళ్లతోనే తీయించాలని, వారిపై కేసులు పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో మట్టి పోసి చెరువులను నింపుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు, గండిపేట చెరువులను శనివారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెల్లచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోయడాన్ని స్థానికులు హైడ్రా కమిషనర్ కు చూపించారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని రాజు యాదవ్ ను ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలుంటాయని హెచ్చరించారు. గండిపేట చెరువులో హిమాయత్‌నగర్ విలేజ్ వైపు మట్టిపోయడాన్ని హైడ్రా కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. వేసిన మట్టిని వెంటనే తొలగించాలని అక్కడ మట్టితో నింపిన డా. ఖుర్షీద్‌ను ఆదేశించారు. 48 గంటల్లో మట్టిని తొలగించకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. తమకు గడువ కోరగా.. మరో 24 గంటల సమయాన్ని ఇచ్చారు. చెరువుల స్వరూపాన్ని మార్చితే ఏమాత్రం ఉపేక్షించమని హెచ్చరించారు.

**జూబ్లీహిల్స్‌లో పార్కు కబ్జాల తొలగింపు**

జీహెచ్ ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ –36 పరిధిలోని రోడ్డు నంబరు 32లో రెండు ఎకరాలకుపైగా ఉన్న పార్కులో ఆక్రమణలను జీహెచ్‌ఎంసీతో కలసి హైడ్రా తొలగించింది. పార్కు కబ్జాకు గురైందని, అందులో అక్రమ కట్టడాలు వచ్చాయని మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి వాచ్ మ్యాన్ కోసం, ఆవుల కోసం షెడ్డులు వేయడాన్ని కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. ప్రధాన గేట్‌ను ఏర్పాటు చేసి ప్రజలందరూ పార్కును సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ ఆదేశాలతో వెనువెంటనే ఆక్రమణలు తొలగించడం పట్ల అక్కడి స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

**బుల్కాపూర్ నాలను పునరుద్ధరిస్తాం**

హుస్సేన్ సాగర్‌కు మంచినీటిని తీసుకు వచ్చే



చారిత్రక బుల్కాపూర్ నాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు సూచించారు. మణికొండ ప్రాంతంలో బుల్కాపూర్ నాలా కబ్జాలకు గురౌతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. శంకరపల్లి లోని బుల్కాపూర్ చెరువు నుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పలగూడ, మణికొండ, దర్గా, షేకే పేట్, టోలి చౌకి , పోచమ్మ బస్తీ, చింతలబస్తీ మీ దుగా హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీరును తీసుకెళ్లే బుల్కాపూర్ నాలా పునరుద్ధరణతో చాలా ప్రాంతాలకు భూగర్భ జలాలు పెంచినట్టు అవుతుందని కమిషనర్ చెప్పారు. ఈ నాలా ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరించడానికి ప్రణాళి కలు సిద్ధం చేయాలని సూచించారు.

# పాత క్వార్టర్ల స్థానంలో నూతన క్వార్టర్ల నిర్మాణం



నాలుగవ బెటాలియన్ లో క్వార్టర్స్‌ను ప్రారంభించిన డిజిపి శివధర్ రెడ్డి

**వరంగల్ బ్యూరో, జనవరి 18 (జనంసాక్షి):** నగరంలోని మామునూర్ నాల్గవ బెటాలియన్ నందు పోలీస్ అధికారులకు, సిబ్బందికి నూతనంగా నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ (నివాస గృహాలు) ను ఆదివారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి శివధర్ రెడ్డి, బెటాలియన్ల అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీజీపీకి కమాండెంట్ డి శివప్రసాద్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అధునాతన వసతులతో నిర్మించిన ఈ నివాస సముదాయంలో అసిస్టెంట్ కమాండెంట్స్ క్వార్టర్స్–3, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ క్వార్టర్స్–2, రిజర్వ్ సబ్–ఇన్‌స్పెక్టర్ క్వార్టర్స్–2, కానిస్టేబుల్ అండ్ హెడ్ కానిస్టేబుల్ క్వార్టర్స్–12 ఉన్నాయి. బెటాలియన్ ప్రాంగణంలో డీజీపీ రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం క్వార్టర్లలో కల్పించిన సౌకర్యాలను స్వయంగా పరిశీలించి, నాణ్యత విషయంలో రాజీ పడకుండా తక్కువ వ్యయంతోనే మెరుగైన వసతులు కల్పించిన అధికారులను అభినందించారు. పోలీసు సిబ్బంది విధుల నిమిత్తం తమ కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని, వారికి మెరుగైన నివాస సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని డీజీపీ అభిప్రాయపడ్డారు. బెటాలియన్‌లో శిథిలావస్థకు చేరిన పాత క్వార్టర్ల స్థానంలో నూతన క్వార్టర్ల నిర్మాణం అభినందనీయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస రావు, వీరన్న, పోలీస్ ఉన్నతాధికారులు, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐ లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రూప్-3లో ప్రతిభను కనబరిచిన గిరిజన కుసుమం

- రెవెన్యూ విభాగం జూనియర్ అసిస్టెంట్ గా ప్రగతి విద్యార్థి నవీన్
- కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ ద్వారా నియామక పత్రం



**పాలకుర్తి, జనవరి 18 (జనంసాక్షి):** మారుమూల గిరిజన తండాలో విద్యాభ్యాసం చేసిన ధారావత్ నవీన్ ఉన్నత చదువులు చదివి ఇటీవలే వెలువడిన గ్రూప్ 3 ఫలితాల్లో ప్రతిభను కనబరిచి, రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికయ్యాడు. మండలంలోని పెద్ద తండ (1) గ్రామానికి చెందిన దారావత్ సరోజ, యాకూబ్ నాయక్ దంపతుల తృతీయ కుమారుడు ధారావత్ నవీన్ నాయక్ మారుమూల గిరిజన తండాలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి వరకు విద్యనభ్యసించారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు పాలకుర్తిలోని ప్రగతి విద్యాలయంలో విద్యనభ్యసించి, 2018లో 10 ఫలితాల్లో ప్రతిభను కనబరిచారు. ఉన్నత చదువుల కోసం పశ్చిమబెంగాల్లోని ఖరక్ పూర్ లో ఐఐటీ పూర్తి చేశారు. హైదరాబాద్ షాద్నగర్ ఫార్మా కంపెనీల అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న తన సోదరుడు ధరావత్ సందీప్ నాయక్ ప్రోత్సాహం తో ప్రయివేటుఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగాల కోసం అహర్నిశలు కృషిచేసిన నవీన్ 2024 నవంబర్ జరిగిన గ్రూప్ 3 పోటీ పరీక్షల్లో పాల్గొన్నాడు. పోటీ పరీక్షల్లో ప్రతిభను కనబరిచిన నవీన్ నాయక్ 2025 మార్చిలో లో జి ఆర్ ఎల్ ర్యాంకును సాధించాడు. 2025 జూన్ లో గ్రూప్ 3 ఉద్యోగానికి ఎంపిక కావడంతో, 2025 డిసెంబర్ 18న రెవెన్యూ డిపార్ట్మెంట్ ను కేటాయించారు. గ్రూప్ 3 రెవిన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికైన నవీన్‌ను శుక్రవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర కమర్షియల్ టాక్స్ కమిషనర్ గీత చేతుల మీదుగా నియామక పత్రాన్ని నవీన్ అందుకోవడంతో తండాలో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా శనివారం నవీన్ మాట్లాడుతూ కష్టపడి చదివితే ఫలితం తప్పక దక్కుతుందని తెలిపారు. తల్లిదండ్రులతో పాటు అన్నయ్య ధరావత్ సందీప్ ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివి పోటీ పరీక్షల్లో ప్రతిభను కనబరిచానని తెలిపారు. కలెక్టర్ కావాలన్నదే తన ఆశయమని తెలిపారు. సివిల్స్ పోటీ పరీక్షలకు హాజరయ్యానని తెలిపారు. తల్లిదండ్రుల కలను సాకారం చేసేందు కు ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షల్లో పాల్గొని ప్రతిభను కనబరుచుకోవాలని సూచించారు.

# శంషాబాద్‌లో రోడ్డు ప్రమాదం

### ఇద్దరు యువకులు మృతి



**రాజేంద్రనగర్, జనవరి18 (జనంసాక్షి):** శంషాబాద్ పీఎస్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శంషాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో గొల్లపల్లి నుంచి బహదూర్‌గూడ వెళ్తున్న బైక్ నెం. డబ్ల్యూ బి10ఈ4721 గొల్లపల్లి గ్రామం వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న అభిజిత్ దాస్ (25), సుజిత్ కుమార్ ముఖియా (20) అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు ఇద్దరూ బందారి ఏజెన్సీ లిమిటెడ్‌లో లేబర్లుగా పనిచేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు భావిస్తున్నారు.

# సమాజం మనుగడలో ప్రజలే కీలకం



**పోలీసింగ్ వ్యవస్థ పటిష్టంగా అమలు జరగాలి • శాంతి భద్రతల పరిరక్షణనే పోలీసు ప్రధాన మోటో**

### జవాబుదారీతనం ప్రతి ఒక్కరి బాధ్యత

- తమ పనితీరుతో సైబరాబాద్ కమిషనరేట్ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేస్తా..
- జనంసాక్షి వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణలో సిపి డాక్టర్ రమేష్

**సైబరాబాద్ కమిషనరేట్ ఔన్నత్యాన్ని మరింత ఇనుమడింప చేస్తా : సిపి డాక్టర్ రమేష్**

**శేరిలింగంపల్లి, జనవరి 18 (జనంసాక్షి) :** చెప్పడం కాదు గానీ... సామాన్య జీవితం గడిపి సమస్యలతో ఈ సమాజాన్ని చదివిన ఓ మారుమూల సగటు మనిషి భవిష్యత్తులో తానుకుంటున్న వ్యవస్థలో తనకు ఏదైనా నిర్మాణాత్మక పాత్రను పోషించాల్సి వస్తే... తప్పకుండా అలాంటి వ్యక్తి నిర్ణయాలు సమాజానికి హితోధికంగా దోహదపడడంతోపాటు భవిష్యత్ తరాలకు కచ్చితంగా మార్గదర్శకాలుగా నిలుస్తాయని అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు! ఇందుకోసం మనం గతాన్ని తిరగేస్తే అనేక సాక్షిభూతాలు సోదాహరణంగా నిలుస్తాయి. అలాంటి వ్యక్తుల వల్లనే ప్రతిసారి సమాజంలో అభ్యుద యమైన మార్పులు చోటుచేసుకొని సమాజం నిక్కచ్చిగా మరింత ప్రగతి వైపు పయనిస్తుంది. ఇది చరిత్ర చెబుతున్న సత్యం!

**పోలీసింగ్ వ్యవస్థ పటిష్టంగా అమలు జరగాలి**

ఎక్కడైనా సరే ఏదైనా ఒక కార్యక్రమం చేపడితే అది విజయవంతం కావాలంటే తప్పకుండా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక... పటిష్టమైన కార్యాచరణ... మొక్కవోని ఆత్మవిశ్వాసానికితోడు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే దృఢచిత్తం అవసరమవుతాయని ప్రగాఢంగా విశ్వసించే ప్రస్తుత సైబరాబాద్ కమిషనరేట్ నయా పోలీస్ బాస్ డాక్టర్ రమేష్ అలాంటి ఒక ఉత్కృష్ట ఆలోచనతోనే ప్రస్తుతం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ తమ ఆలోచనదోరణిని, ముందుకు సాగే విధానాన్ని కొనసాగించేందుకు కొంత విధివిధానాలలో మార్పులు, కొత్త పంథాను ఎంచుకున్నట్లు స్పష్టమవుతుంది. ఇందులో భాగంగానే సైబరాబాద్ సిపి గా తన బాధ్యతల స్వీకరణ అనంతరం ఈ కీలక మార్పులు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సుస్పష్టంగా గోచరిస్తున్నాయి. పోలీసులు అంటే చట్టాన్ని, న్యాయాన్ని పరిరక్షించే వారు మాత్రమే కాదని పరిస్థితులనుబట్టి సమాజ పోకడనుబట్టి సరిదిద్దే నిర్ణయాత్మక పాత్రలోసైతం ఇమిడి పోవాల్సిన ఆవశ్యకత ఉంటుందనే గట్టి సంకల్పంతో కంకణబద్ధులై ముందుకు సాగుతున్న పోలీసు అధికారుల పనితీరులో విస్పష్టంగా కనిపిస్తున్న మార్పు... ఇంకా చెప్పాలంటే పరిణతి. సైబరాబాద్ కమిషనరేట్ ఆవిష్కృతమైన ఎన్ని సంవత్సరాల కాలంలో ఒక్కో అధికారి తన ప్రత్యేక నిర్ణయాలతో కమిషనరేట్ పై తమదైన ముద్ర వేసినప్పటికీ " స్పీకింగ్ ఈజ్ సిల్వర్... బట్ సైలెన్స్ ఈజ్ గోల్డ అన్న నినాదాన్ని నిశ్శబ్ద విప్లవంగా కొనసా గిస్తూ ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలో, ప్రత్యేకించి ట్రాఫిక్ విభాగం పోలీసింగులో పోలీసులు, అధికారులు వ్యవహరిస్తున్నతీరు సామాజిక స్పృహ ఉన్న ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుంది.

**జవాబుదారీ తరం ప్రతి ఒక్కరి బాధ్యత**

మనిషి సంఘజీవి అని, ప్రతి ఒక్కరూ ఇతరులతో కలిసి తమ జీవితాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉంటుందని... అందుకే మనిషిని ఎప్పుడూ సంఘజీవిగా పరిగణిస్తుంటారని... అందుకే మనిషి అంటే సమాజం... సమాజం అంటే మనుషుల సమూహం అని అనాదిగా భావన ఉంది. ఈ మూల సూత్రాన్ని ప్రత్యేక దృష్టికోణంతో చూస్తున్న సైబరాబాద్ పోలీస్ అధికారులు పోలీసులంటే కేవలం శాంతి భద్రతకు మాత్రమే పరిమితం కారని... వారు కూడా సమాజంలో అంతర్భాగమని... పోలీసులతోపాటు సంఘంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్ద్వం దంగా నిర్వర్తించగలిగినప్పుడే ఆ వ్యవస్థ సమగ్రంగా ముందుకు సాగుతుందని, ఎన్ని సమస్యలు, అడ్డంకులు ఎదురైనా సమిష్టి కృషితో వాటిని పరిష్కరించుకుంటూ ఒక శుహృద్భావ వాతావరణం, ఆరోగ్యకర విధానాన్ని భవిష్యత్తుకు అనుసంధానించగల మార్గం సుగమమవు తుందనేది ప్రస్తుత సిపి మస్తిస్కంలో మెదులుతున్న ఆలోచన ధోరణి అనేది చెప్పకనే చెప్పవచ్చు. అందుకే బాధ్యతల తొలి రోజు నుండే తన ఆలోచనలను మదుపు చేస్తూ ముందుగా పోలీసు అధికారుల ఆలోచనలను సమన్వయంపరుస్తూ తద్వారా భవిష్యత్తులో రానున్న ఫలితాలను వారి మెదళ్లలోనాటి అవి నిర్దిష్టంగా అమలు జరిగేలా ఒక క్రమ పద్ధతిలో ముందుకు తీసుకు వెళ్తున్న సిపి అంచనాలు తప్పకుండా అమలుకు నోచుకునేలానే ప్రణాళికలు కనిపిస్తుండడం ప్రధాన సానుకూల అంశం అని చెప్పవచ్చు. వ్యవస్థలో అక్కడక్కడ కొన్ని పొరపాట్లు సహజమని, అయితే తెలిసినవారు, తెలియనివారు ఒకేలా ప్రవర్తిస్తూ బాధ్యతలను విస్మరించడం ద్వారా సమస్యలను కొనితెచ్చి తమతో పాటు ఇతరులకు వాటిని రుద్దడం ఏమాత్రం ఆమోగయోద్యం కాదని, శాంతిభద్రతలైతేనేమి, సామాజిక అంశాలు అయితేనేమి ప్రతి విషయంలో పోలీసులు మొత్తం బాధ్యత తీసుకోవాలని భావించడం కరెక్ట్ కాదని, సాటి మనిషిగా, సమాజ అంతర్గత వ్యక్తిగా ప్రతి ఒక్కరిలో అంతకు మించిన బాధ్యతభావన ఉన్నప్పుడే నిజమైన మార్పు, ప్రగతి సహకారం అవుతాయన్నదే సైబర్బాద్ సిపి సైద్ధాంతిక ఆలోచనగా అభివర్ణించవచ్చు.






జనంసాక్షి తెలుగు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సిపి డాక్టర్ రమేష్

గతానికి ఇప్పటికీ సామాజికంగా ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ఓవైపు ప్రభుత్వ యంత్రాంగానికి మెరుగైన పాలనను అందించడానికి ఎంతైతే తోడ్పాటునందిస్తుందో.. ఇదే సమయంలో కొంతమంది స్వార్థపరులు, అవకాశవాదులు నేరాలోచనవైపు సాగిపోతూ కొత్త కొత్త నేరాలు, వ్యవస్థీకృత నేర ప్రవృత్తిని పెంపొందించుకొని సమాజంలో అసాంఘిక వ్యవస్థను పెంచి పోషించడం జరుగుతుందని, ఇది సమాజానికి ఎంత మాత్రం అంగీకార యోగ్యం కాదని సిపి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే శేరిలింగంపల్లి తోపాటు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట అవసరమైనచోట పోలీసు సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ పెరగడంతోపాటు 'రాజు కొడుకుకైనా దండన లేనిదే చదువు అబ్బదు' అన్న నినాదాన్ని గమనంలో పెట్టుకున్న కొంతమంది పోలీసులు ఈ మధ్యకాలంలో తమ చేతుల్లో లాఠీలను పట్టుకొని కనిపిస్తుండడం, ఇది కచ్చితంగా నేరస్తులు, తప్పుడు ఆలోచన కలిగినవారికి ఒక హెచ్చరికగా భావించవచ్చునేది సామాజికవేత్తల అభిప్రాయం. కాగా గతంలో పోలీసు అధికారులపట్ల కొంతమంది నెగిటివ్ భావనను కలిగి ఉండడం, మరికొంతమంది దీనిని కొన్ని వర్గాలకు వ్యాపింప చేయడం గుర్తించిన రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగిందని గుర్తుచేస్తూ ఈ మధ్యకాలంలో 'పచ్చదనం–పరిశుభ్రత', 'సామాన్యులతో సైతం మరింత ఫ్రెండ్లీ విధానం', సామాజిక అంశాలు, సమస్యలే ప్రధాన ఎజెండా అన్న ప్రత్యేక కోణాలను సృజనాత్మకంగా స్పృశిస్తూ ముందుకు సాగుతున్న తీరు ఇప్పటికే చాలామందిని ఆలోచింపజేస్తుందనేది అంగీకరించాల్సిన నిజం. ఇలాగే ఇకముందు కూడా మరిన్ని నిర్మాణాత్మక, విప్లవాత్మక మార్పులతో పోలీసింగ్ వ్యవస్థను మరింత పటిష్టపరిచి సామాన్యుడి కేంద్రంగా చట్టం, న్యాయం కొనసాగేలా ప్రణాళికలను రూపొందించుకొని ముందుకు సాగడం ద్వారా పోలీసు వ్యవస్థ పట్ల సమాజంలో గౌరవాన్ని పెంపొందించడంతోపాటు ఎంతో ప్రత్యేకత కలిగిన సైబరాబాద్ కమిషనరేట్ ఔన్నత్యాన్ని మరింతగా ఇనుమడింపజేయడానికి రాజీలేని ప్రయాణాన్ని కొనసాగిస్తానని ఈ మేరకు 'జనంసాక్షి దినపత్రిక' వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణలో భాగంగా 'జనంసాక్షి' ప్రతినిధితో తన ఆలోచనలను అభిప్రాయాన్ని నిష్కల్మషంగా వ్యక్తపరుస్తున్న సిపి డాక్టర్ రమేష్ ఆశయ సాధన అనుకున్న స్థాయిని మించి విజయవంతం కావాలని సగటు మనిషిగా అందరం కోరుకుందాం!

# చిమ్మని చీకట్లో బట్టుపల్లి రహదారి

- నిత్యం ప్రమాదాలకు నెలవు
- సెంట్రల్ లైటింగ్ లేక ఇబ్బందులు
- రోడ్డు వేసి ఏండ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు



**వరంగల్, జనవరి 18 (జనంసాక్షి) :** అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వరంగల్ నగరంలోని అండర్ రైల్వే గేట్ ఉరుసు బైపాస్ నుండి బట్టుపల్లికి వెళ్లే రహదారిలో ఉంది. ఉరుసు బైపాస్ నుండి బట్టుపల్లి రోడ్డు అటు నుంచి కాజీపేట వరకు ఉన్న ఈ రహదారి లో సెంట్రల్ లైటింగ్ కోసం డివైడర్లు సుమారు పది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. అందులో మొక్కలను కూడా నాటారు. కానీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంలో ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ దారిలో నిత్యం ఖమ్మం విజయవాడ వైపు నుండి వచ్చే వాహనాలే కాకుండా వరంగల్ నగరంలోని ఉరుసు కరిమాబాద్ రంగసాయిపేట మొదలైన ప్రాంతాల నుండి వేలాది వాహనాలు వస్తూపోతూ ఉంటాయి. అంతేకాకుండా ఖమ్మం వైపు నుండి వచ్చే వాహనాలు హైదరాబాద్ వెళ్లాలన్నా కూడా ఈ దారే ఉంది. అయితే సాయంత్రం అయిందంటే చాలు ఈ రోడ్డు చీకట్లతో నిండుకుంటుంది. ఉరుసు గుట్ట బైపాస్ నుండి బట్టుపల్లి ,కడిపికొండ మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి కాజీపేట వరకు అటు నుంచి హైదరాబాద్ వరకు సాగే ఈ రోడ్డు పరిస్థితి ప్రస్తుతం దారుణంగా ఉంది. ముఖ్యంగా సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రుల్లో చీకటి అల్లుకుంటుంది. తరచుగా ఈ రోడ్డులో వాహనాలు ప్రమాదాల గురై ఎందరో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా చీకటితో నిండి ఉండడం వల్ల ఇక్కడ దొంగతనాలతో పాటు హత్యలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ రహదారి నుండి అమ్మవారిపేటకు వెళ్లే దారిలో సమ్మక్క సారలమ్మ జాతర ఈనెల 28 నుండి 31 వరకు జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారు లు ప్రజాప్రతినిధులు ఈ రహదారి లో సెంట్రల్ లైటింగ్స్ ఏర్పాటు చేసి ప్రయాణికుల సురక్షిత ప్రయా ణానికి కృషి చేయాలని ఇటు ప్రయాణికులు ఈ రహదారి వెంట ఉన్న గ్రామాలు, కాలనీ వాసులతో పాటు వ్యాపారస్తులు సామాన్యులు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
19 జనవరి 2026

# చరిత్ర లేని వారు దేశభక్తులా?

- ప్రజల కోసం మరో వందేళ్లు పోరాటానికి సిద్ధం
- ట్రంప్ తీరును ఎర్ర జెండా అడ్డుకుంటుంది.
- అమెరికాను ప్రశ్నించే శక్తిని మోడీ కోల్పోయారు
- సిపిఐ శతాబ్ది ఉత్సవ సభలో డి. రాజా





ఖమ్మం బ్యూరో( జనం సాక్షి)చరిత్ర లేని వారు దేశభక్తులుగా చెప్పుకునేందుకు తాపత్రయ పడుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ఆరోపించారు. వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతున్నామని భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు అత్యంత కీలక ఘట్టమని ఈ దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సభ సందర్భంగా ఖమ్మం ఎస్ఆర్అండ్బ జివిఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలతో బహిరంగ సభా స్థలి కిటకిటలాడింది. తెలంగాణ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజా మాట్లాడుతూ వందేళ్లు త్యాగాలతోనే గడిచిపోయిందని అనేక మంది తమ త్యాగాలతో ఈ నేలను పునితం చేశారన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో సిపిఐ ఆవిర్భావించిందని అంతకు ముందు 1985లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులకు మాత్రమే ఒక రాజకీయ చరిత్ర ఉందని వందేళ్ల చరిత్ర అని చెప్పుకుంటున్న ఆర్ఎస్ఎస్కు అసలు చరిత్ర లేదన్నారు. దేశ స్వాతంత్ర్యంలోనూ ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటని రాజా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కంటే ముందే సిపిఐ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. దేశ చరిత్రలో అత్యంత కీలక ఘట్టమని రాజా అభివర్ణించారు. స్వాతంత్ర్య అనంతరం అనేక పరిణామాలలో కమ్యూనిస్టు పార్టీ అత్యంత కీలక భూమిక పోషించిందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంతగా వ్యవహరించాలని ప్రయత్నిస్తున్నాడని మరో హిట్లర్ కావాలనుకుంటున్నాడని ట్రంప్ను ఎర్ర జెండాలు ఎదుర్కొంటాయని రాజా స్పష్టం చేశారు. సామ్రాజ్యవాద ధోరణితో ట్రంప్ వ్యవహరిస్తున్నాడని ఆయన ఆరోపించారు. మెక్సికో, కోలంబియా, క్యూబా వంటి దేశాలకు బెదిరింపులు చేయడం అనుచిత మన్నారు. రష్యా, ఉక్రేన్ యుద్ధాన్ని సాకుగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతు న్నాడని ఆధిపత్య ధోరణిని ప్రదర్శిస్తున్న ట్రంప్ను ప్రశ్నించే శక్తి భారత ప్రధాని మోడీకి లేదన్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తుందని దీనిని నిలిపివేయాలంటూ అమెరికా ఒత్తిడి తీసుకు రావడం శోచనీయమన్నారు. పాలస్తీనా అంశాన్ని ప్రస్తావిస్తూ పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఉండే హక్కు ఉందన్నారు. ఐక్యరాజ్యసమితి మద్దతు ఉన్న ద్విరాష్ట్ర పరిష్కారానికి సిపిఐ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. భారతదేశంలో మతోన్మాద శక్తులు విజృంభిస్తున్నాయని సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతుందని ఇది దేశ భవిష్యత్తుకు మరింత ప్రమాదకరమన్నారు. ఫాసిస్టు శక్తులను ఎదుర్కొనేందుకు అన్ని లౌకిక శక్తులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బలమైన ఉద్యమ నిర్మాణాల ద్వారా మతోన్మాద శక్తులను అడ్డుకుంటామని రాజా ధీమా వ్యక్తం చేశారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రతిభింబిస్తూ జరిగిన భారీ బహిరంగ సభ నూతన ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసా య శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, వాకాటి శ్రీహరి, సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్జిత్ కౌర్, గిరిశర్మ, అనిరాజా, ప్రకాష్ బాబు, సందోష్ బాబు, పల్లా వెంకటరెడ్డి, బినయ్ విశ్వం, రామకృష్ణ పాండా, కె. రామకృష్ణ, కుల్దేవ్, జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వర రావు, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివా సరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహయ కార్యద ర్శులు తకెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నర్సింహ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎస్కే సాబీర్ పాషా, వనజా, నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఎంఎల్సి ఎన్. సత్యం, ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్రెడ్డి పాల్గొన్నారు.

## నాగోబా జాతర సందర్భంగా ఆదివాసీ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు

- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్ (జనంసాక్షి) : పవిత్ర నాగోబా జాతర సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ సోదర, సోదరీమణులందరికీ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన నాగోబా జాతర తెలంగాణ గిరిజన జీవన తత్వానికి అద్దం పడుతుందని ఆయన పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ జాతర ఆదివాసీ సమాజాన్ని ఐక్యంగా నిలిపే శక్తివంతమైన వారసత్వమని, ప్రకృతి పట్ల గౌరవం, సామాజిక సమానత్వం, సోదరభావాన్ని చాటే మహత్తర పండుగగా ఆయన అభివర్ణించారు. నాగోబా జాతర సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తమ భక్తిశ్రద్ధలను చాటుకోవడం ఆదివాసీ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని తెలిపారు. ఈ జాతర సజావుగా, భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరగాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆదివాసీ సంక్షేమం, వారి హక్కులు, సంస్కృతి పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ అధ్యక్షులు గుర్తు చేశారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా విద్య, ఉపాధి, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పవిత్ర నాగోబా జాతర ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ దేవుని ఆశీస్సులతో ఆదివాసీ ప్రజల జీవితాల్లో శాంతి, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని టీపీసీసీ చీఫ్ అభిలషించారు.

## భర్త మొబైల్ ఫోన్ కొనివ్వలేదని భార్య ఆత్మహత్య



అహమ్మాబాద్ (జనంసాక్షి) : మొబైల్ ఫోన్ కొనేందుకు భర్త నిరాకరించాడు. దీంతో భార్య ఆగ్రహం చెందింది. ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. గుజరాత్‌లోని అరవల్లి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నేపాల్‌కు చెందిన 22 ఏళ్ల ఊర్మిళ ఖానన్ రిజన్ తన భర్త, బిడ్డతో కలిసి మోడసాలో నివసిస్తున్నది. ఈ దంపతులు ఆ ప్రాంతంలో చైనీస్ ఫుడ్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఊర్మిళ తన భర్తను కొత్త మొబైల్ ఫోన్ కొనివ్వమని చాలా కాలంగా అడుగుతున్నది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా అతడు పదేపదే నిరాకరించాడు. ఈ విషయంపై దంపతుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మరోవైపు భర్తతో గొడవ తర్వాత ఊర్మిళ తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకున్నారు. నేపాల్ మహిళ అయిన ఊర్మిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా పోలీస్ అధికారికి రైల్వే అత్యున్నత పురస్కారం

### 150 మందికి పైగా పిల్లలను రక్షించిన చందనా సిన్హా



న్యూఢిల్లీ (జనంసాక్షి) : రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)కు చెందిన అధికారిణి 150 మందికిపైగా పిల్లలను రక్షించారు. ఈ నేపథ్యంలో ఆమె సేవలను రైల్వే మంత్రిత్వ శాఖ గుర్తించింది. రైల్వే అత్యున్నత పురస్కారంతో సత్కరించింది. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చందనా సిన్హాకు భారత రైల్వే అత్యున్నత సేవా గౌరవమైన అతి విశిష్ట రైల్ సేవా పురస్కారాన్ని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అందజేశారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చందనా సిన్హా దూరదర్శన్‌లో ప్రసారమైన 'ఉడాన్ట సీరియల్ ద్వారా స్ఫూర్తి పొందారు. 2010లో ఆర్పీఎఫ్‌లో చేరారు. 2024 నుంచి భారత రైల్వే ఆపరేషన్ 'నాన్హే ఫరిష్తే' (ఆపరేషన్ లిటిల్ ఏంజిల్స్)లో ఆమె భాగమయ్యారు. రైళ్లు, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో తప్పిపోయిన, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన 152 మంది పిల్లలను ఆమె రక్షించారు. మరోవైపు బచ్‌పన్ బచావో సమితితో కలిసి మరో 41 మంది పిల్లలను బాల కార్మికుల నుంచి చందనా సిన్హా విముక్తి కల్పించారు. అక్రమ రవాణా పిల్లలను పునరావాసం కోసం బాలల సంక్షేమ కమిటీకి అప్పగించారు. చందనా సిన్హా ధైర్యం, 'నాన్హే ఫరిష్తే'పై అంకితభావం, పిల్లల భద్రత పట్ల నిరంతర నిబద్ధతను రైల్వే గుర్తించింది. రైల్వేల అత్యున్నత సేవా పురస్కారంతో ఆమెను సత్కరించింది.

## బీఆర్ఎస్ అంటే అస్థిత్వం, ఆత్మగౌరవం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- కాంగ్రెస్‌ను వంద మీటర్లు బొంద పెట్టే సమయం ఆసన్నం

హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ తెలంగాణ అస్థిత్వం, ఆత్మగౌరవమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.బీఆర్ఎస్ గద్దెలు కూల్చాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం, అవివేకమని ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వందమీటర్ల లోతున బొందపెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మీద దుష్ప్రచారం, కాంగ్రెస్ పార్టీ హామీలు నమ్మి ప్రజల మోసపోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో అసమానతలు, వివక్ష మూలంగానే తెలంగాణ ఉద్యమం మొదలయిం దని, వీరి మోసాల కారణంగానే తెలంగాణ బిడ్డలు అమరులయ్యారని వివరించారు. ప్రజలు కాంగ్రెస్ గద్దెలు కూల్చే సమయం ఆసన్నమైం దని మాజీ మంత్రి అన్నారు. తెలంగాణలో ఉన్న కొద్దిమంది ఓట్ల కోసం టీడీపీ గురించి రేవంత్ రెడ్డి మొసలికన్నీరు కారుస్తున్నాడని విమర్శించారు. టీడీపీ ఇండియా కూటమిలో ఉందా ? బీజేపీ కూటమిలో ఉందా ? అసలు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీయేనా ? టీడీపీ పార్టీనా ? తేల్చుకోవాలని సూచించారు.ఓట్ల కోసం నాటకాలు ఆడితే అన్ని సార్లు ప్రజలు నమ్ముతారు అనుకోవడం అవివేకమని తెలిపారు. సీఎం హోదాలో ఉండి చిల్లరకూతలు కూయడం రేవంత్ రెడ్డి మానసిక స్థితికి అద్దం పడుతుందని ఆరోపించారు. సహచర మంత్రులతో ఉన్న విభేదాలతో ఏం చేయాలో పాలుపోక వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు.

## నాగోబా జాతర మొదలు

- మహాపూజలకు సిద్ధమైన మెస్రం వంశీయులు



ఆదిలాబాద్ (జనంసాక్షి) : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో నాగోబా జాతర ఆదివారం అర్ధ రాత్రి నుంచి వైభవంగా ప్రారంభం కానుంది. తమ అరాధ్యదైవం నాగోబా దేవతకు ఆదివారం మెస్రం వంశీయులు అర్ధరాత్రి మహాపూజ నిర్వహించి అనంతరం నాగోబా జాతర మొదలవ్వనుంది. ఇప్పటికే జాతర కోసమని జన్నారం మండలం హస్తినమడుగు నుండి సేకరించిన పవిత్ర గంగాజలాన్ని మెస్రం వంశస్తులు తీసుకొచ్చారు.

కేస్లాపూర్ గ్రామంలోని మురాడీ నుంచి పురాతన నాగోబా విగ్రహంతోపాటు పవిత్ర గంగాజలంతో మెస్రం వంశీయులు నాగోబా ఆలయానికి చేరుకున్నారు. పురాతన నాగోబా విగ్రహాన్ని ఆలయంలోని విగ్రహం వద్ద పెట్టి మొక్కుకున్నారు. నాగోబా ఆలయం వెనుక భాగంలో పవిత్రమైన గంగాజలం ఝరిని భద్రంగా ఉంచారు. అనంతరం మెస్రం వంశీయుల పెద్దలు 22 కీతలకు చెందిన అడపడుచులకు మట్టి కుండలను పంపిణీ చేశారు.

మట్టి కుండలో మహిళలు మర్రిచెట్ల వద్ద ఉన్న నీటి కోనేరుకు చేరుకొని పూజలు నిర్వహించి కోనేరు నుంచి కుండల్లో నీటిని సేకరించి నాగోబా ఆలయానికి చేరుకున్నారు. మెస్రం వంశీయుల అల్లుళ్లు నాగోబా ఆలయం వద్ద ఉన్న పుట్టలను తవ్వారు. ఆ మట్టితో మెస్రం వంశీయుల అడపడుచులు నూతన పుట్టలను తయారు చేశారు. అదే మట్టితో ఉండలు చేసి బౌలదేవతను తయారు చేసి అర్ధరాత్రి పూజలు చేయనున్నారు.

### కొత్త కోడళ్లకు భేటింగ్ (పరిచయ వేదిక)


నాగోబాకు మహా పూజలు చేసిన అనంతరం భేటింగ్ నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా కొత్త కోడళ్లకు మెస్రం వంశీయుల అడపడుచులు సతీ దేవతతో పాటు నాగోబాకు పూజలు చేయిస్తారు. అనంతరం మెస్రం వంశీయుల పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకుంటారు.

మెస్రం వంశీయులు నిర్వహించనున్న నాగోబా మహాపూజలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో యువరాజ్ మర్మాట్, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, అనిల్ జాదవ్, పాయల శంకర్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొననున్నారు.



## హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- హుస్నాబాద్ పట్టణంలో రెండవ విడతలో 372 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పత్రాలు పంపిణీ
- మున్సిపాలిటీ పరిధిలో మహిళా సంఘాలకు కోటి 13 లక్షల రూపాయల వడ్డీలేని రుణాలు చెక్కు పంపిణీ
- పట్టణంలో నీటి పన్ను ,ఇంటి పన్ను పై సమీక్ష చేస్తాం
- గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి హుస్నాబాద్ సస్య శ్యామలం చేస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ (జనంసాక్షి) : హుస్నాబాద్ నియోజకవర్గంను అన్ని రంగాల్లో ముందుంచుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ విడత అర్హులైన లబ్ధిదారులకు 372 మంది ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పత్రాలు అందజేశారు. 3520 మందికి మహిళా సంఘాల నుండి కోటి 13 లక్షల రూపాయలు వడ్డీలేని రుణాలు చెక్కును అందజేశారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. కరీంనగర్ , సిద్దిపేట, హనుమకొండ, జనగాం జిల్లాలకు మధ్యలో ఉన్న హుస్నాబాద్ ను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడత లో మంజూరైన 171 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయని తెలిపారు. ఇల్లు రాని వారు అప్లికేషన్ పెట్టుకోవాలనీ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు.ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రతి నియోజవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళు ఇచ్చిందని తెలిపారు.ఇల్లు మంజూరు అయిన వారు రేపటి నుండే ఇల్లు ముహూర్తం చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ఇల్లు కట్టుకునే వారికి 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా ఇస్తున్నామన్నారు.

ప్రజా పాలన ప్రభుత్వంలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని,దేశంలో ఎక్కడ లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.మహిళలకు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి సెట్విన్ ద్వారా శిక్షణ అందిస్తున్నామని దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్ ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా మార్చడానికి గ్రామగ్రామాన స్టీల్ బ్యాంక్ పంపిణీ చేసినట్లు తెలిపారు. దానిని వినియోగించాలని ప్లాస్టిక్ వాడితే కాన్సర్ సంబంధిత వ్యాధులు వస్తాయని తెలిపారు. హుస్నాబాద్ లో 250 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని , పీజీ కాలేజీ వస్తుందని తెలిపారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని , అర్బన్ ఫారెస్ట్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ కి ఇంజనీరింగ్ కళాశాల తెచ్చామని, కోహెడ మండలం లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు.గత 10 ఏళ్లలో చేయలేని అభివృద్ధి రెండు ఏళ్లలో చేసి చూపించామని పేర్కొన్నారు.గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి హుస్నాబాద్ సస్య శ్యామలం చేస్తామన్నారు.హుస్నాబాద్ లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి ఉపాధి ,ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తామని తెలిపారు. హుస్నాబాద్ కి రింగ్ రోడ్డు మంజూరు చేయాలని ఇటీవల హుస్నాబాద్ సభలో ముఖ్యమంత్రి దృష్టికీ తీసుకుపోయామని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కార్యాలయంలో 57 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మైనార్టీ మహిళలు చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి 50 వేల రూపాయల వరకు బ్యాంకు లోన్ అందిస్తుందని తెలిపారు. ఇతర ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు కుట్టు మిషన్ లు పంపిణీ చేసేలా కార్యాచరణ తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ లో నల్ల పన్ను,ఇంటి పన్ను ఇబ్బందులు లేకుండా సమీక్ష నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గతంలో హుస్నాబాద్ ను బలవతంగా సిద్దిపేట జిల్లాలో చేర్చారని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా హుస్నాబాద్ ను కరీంనగర్ జిల్లాలో కలుపుతామని తెలిపారు. హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచే వారికి టికెట్ కేటాయిస్తామని వారికి స్థానిక సర్వే తో పాటు రాష్ట్ర సర్వే ఆదరంగా పార్టీ నిర్ణయం మేరకు చైర్మన్ ఎంపిక ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వార్డుల్లో తిరగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమవతి , గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, డిఆర్డీవో జయదేవ్ ఆర్య, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, ఇతర ముఖ్య నేతలు , అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370